RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS



We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ | 11 జనవరి 2026 ఆదివారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:187

# జర్నలిజానికి వన్నెతెచ్చే జర్నలిస్టులకు అండగా ఉంటాం

**అక్రిడిటేషన్ కార్డులు తగ్గుతాయనే ప్రచారం వాస్తవం కాదు**

**గతంలో కంటే ఎక్కువగానే అక్రిడిటేషన్ల మంజూరు**

**ఏకార్డుకైనా అన్ని ప్రయోజనాలు వర్తిస్తాయి**

**జర్నలిస్టు సంఘాల సూచనలను పరిగణనలోకి తీసుకుంటాం**

**జీవో 252లో మార్పులు చేర్పులు చేస్తాం**

**జర్నలిస్టుల ఇండ్ల స్థలాల కోసం కోర్టు అడ్డంకులు లేని విధానాన్ని రూపొందిస్తాం**

**14 జర్నలిస్టు సంఘాలతో సమావేశం నిర్వహించిన .. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**





హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధిహైదరాబాద్:- జర్నలిజం గౌరవాన్ని నిలబెట్టి ఆ వృత్తికి వన్నెతెచ్చే జర్నలిస్టులందరికీ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అన్నివిధాలా అండదండగా ఉంటుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఏ ఒక్కరి గౌరవాన్ని తగ్గించాలని గాని, చిన్నబుచ్చాలనిగాని తమ ప్రభుత్వ ఉద్దేశ్యం కాదని స్పష్టం చేశారు. జీవో 252 పై శనివారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో 14 జర్నలిస్టు సంఘాల ప్రతినిధులతో సమావేశంహించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ సమావేశంలో జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు విలువైన సూచనలు, సలహాలు ఇచ్చారని వారు ప్రస్తావించిన అంశాలను విజ్ఞప్తులను పరిశీలించి సానుకూలమైన నిర్ణయం తీసుకుంటామని జీవో 252లో మార్పులు చేర్పులు చేస్తామని హామీ ఇచ్చారు. అక్రిడిటేషన్ కార్డులు తగ్గుతాయని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టం చేశారు. గతంలో ఉన్న సుమారు 23వేల అక్రిడిటేషన్ కార్డుల సంఖ్య కంటే ఈ సారి ఇచ్చే కార్డుల సంఖ్య ఎక్కువ ఉంటుందని వెల్లడించారు. అక్రిడిటేషన్ కార్డుల జారీలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం మొదటివరుసలో ఉందని అన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలనే సదుద్దేశంతో శాస్త్రీయ పద్ధతిలో అధ్యయనం చేయడం జరిగిందని పలుమార్లు సమావేశాలు నిర్వహించామని అంతేగాక దేశ వ్యాప్తంగా ఉన్ననియమ నిబంధనలను పరిశీలించడం జరిగిందని ఫలితంగా కొత్త కార్డుల మంజూరులో కొంత జాప్యం జరిగిందని అన్నారు. మీడియా కార్డుకు, అక్రిడిటేషన్ కార్డుకు ఎలాంటి వ్యత్యాసం లేదని అక్రిడిటేషన్ కార్డుదారులకు ప్రభుత్వ పరంగా అందే ప్రతి ప్రయోజనం మీడియా కార్డుదారులకు కూడా అందుతాయని ఇందులో ఎలాంటి అనుమానాలకు తావులేదని మరోమారు స్పష్టం చేశారు. తాము అక్రిడిటేషన్ కార్డుల మంజూరు విషయంలో ఎటువంటి భేషజాలకు పోవడం లేదని కానీ ఈ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు గాను ప్రభుత్వ పరంగా సర్క్యులేషన్, ఇతర సంబంధిత వివరాలను ఖచ్చితంగా సేకరిస్తామని, ఛార్టెడ్ అకౌంటెంట్ సర్టిఫికేట్ల పరిశీలన కూడా చేస్తామని దీనివలన అసలైన పత్రికలు, పాత్రికేయులకు న్యాయం జరుగుతుందని అన్నారు. రాష్ట్రంలో మండలానికో విలేకరి ప్రాతిపదికన గాక జనాభా వారీగా అక్రిడిటేషన్‌లు మంజూరు చేస్తే ఎలా ఉంటుందన్న విషయంలో కూడా ఆలోచిస్తామని , దీనిపై పాత్రికేయ సంఘాలు స్పందించాలని అన్నారు. అక్రిడిటేషన్ కమిటీలలో ఉర్దూ జర్నలిస్టులకు అవకాశం కల్పిస్తామనిక్రీడా, సాంస్కృతిక, క్రైమ్, కేబుల్ టీవీ తదితర విభాగాల పాత్రికేయులకు అక్రిడిటేషన్ సౌకర్యం తప్పక ఉంటుందని స్పష్టం చేశారు.మహిళా జర్నలిస్టుల విజ్ఞప్తి మేరకు అక్రిడిటేషన్ కార్డుల జారీలో ప్రత్యేక కోటా కేటాయిస్తామని హామీ ఇచ్చారు. దేశంలోని తొలిసారిగా తెలంగాణ రాష్ట్రంలోనే డిజిటల్ మీడియా కార్డులు మంజూరు చేశామని తెలియజేశారు. సమావేశంలో పలువురు పాత్రికేయ సంఘాల ప్రతినిధులు ఇండ్ల స్థలాలు, పెన్షన్, బస్‌పాసులు, పాత్రికేయులకు బీమా తదితర అంశాలను ప్రస్తావించగా మంత్రి పొంగులేటి సావధానంగా వారికి సమాధానమిచ్చారు. జర్నలిస్టుల ఇండ్ల స్థలాల కోసం కోర్టు అడ్డంకులు లేని విధానాన్ని రూపొందిస్తాంజర్నలిస్టులకు ఇండ్ల స్థలాల అంశంపై కొంతమంది ప్రతినిధులు అడిగిన ప్రశ్నలపై మంత్రిగారు స్పందిస్తూ..తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల అంశాన్ని పరిష్కరించి జవహర్ లాల్ నెహ్రూ హౌసింగ్ సొసైటీకి భూమిని అప్పగించడం జరిగిందన్నారు.

ఆ తర్వాత సుప్రీంకోర్టు ఈ అంశాన్ని కొట్టివేయడంతో సమస్య మొదటికి వచ్చిందని అయినా కూడా ఇండ్ల స్థలాల విషయంలో తమ ప్రభుత్వం ఎప్పుడూ సానుకూలంగా ఉంటుందని అన్నారు.ఈ విషయంలో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు ఎటువంటి కోర్టు అడ్డంకులు లేని విధానాన్ని రూపొందిస్తామని తెలిపారు

సమావేశంలో తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి, ఐ పిఆర్ కమీషనర్ సిహెచ్. ప్రియాంక, సీపీఆర్‌వో జి. మల్సూర్ తదితరులు పాల్గొన్నారు

# జనవరి 19 నుంచి దావోస్‌లో వరల్డ్ ఎకనామిక్ ఫోరం-2026 సమ్మిట్

**క్యూర్, ప్యూర్, రేర్ ప్రణాళికలను ప్రపంచానికి పరిచయం చేస్తాం: రేవంత్**



హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధిహైదరాబాద్ జనవరి 10 : స్పిరిట్ ఆఫ్ డైలాగ్”అనే థీమ్‌తో వరల్డ్ ఎకనామిక్ ఫోరం-2026 సమ్మిట్ జనవరి 19 నుంచి 23 వరకు దావోస్‌లో జరగనుందని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదపడే పెట్టుబడులను సాధించడమే ధ్యేయంగా దావోస్‌లో జరగనున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం (ప్రపంచ ఆర్థిక సదస్సు)-2026 సదస్సులో తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను రూపొందించారని అన్నారు. దానికి అనుగుణంగా రూపొందించిన క్యూర్, ప్యూర్, రేర్ ప్రణాళికలను ప్రపంచానికి పరిచయం చేయాలని రేవంత్ రెడ్డి అధికారులకు నిర్దేశించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో ముందుకు సాగుతోందని పునరుద్ఘాటించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గడిచిన రెండేళ్లలో దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సు వేదికగా రా(ష్ట్రానికి లభించిన పెట్టుబడి హామీలు, ప్రతిపాదనల పురోగతితో పాటు.. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025లో ఆకర్షించిన పెట్టుబడులు ఇప్పటివరకు ఏ స్థాయిలో అమలయ్యాయనే అంశాలను సిఎం సమీక్షించారు. పెట్టుబడుల ఆకర్షణలో తెలంగాణకు ఇప్పటికే ఉన్న బలాలు, సామర్థ్యాలను మరింతగా వినియోగించుకొని, మూడంచెల ఆర్థిక వృద్ధిని వేగవంతం చేసేలా రూపొందించిన క్యూర్, ప్యూర్ , రేర్ ప్రణాళికలను తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం దావోస్ వేదికగా ప్రపంచానికి వివరిస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

**పాలేరు నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలబెడతా**

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి** వార్తా 2 లో

# గ్లోబల్ 'ఇన్నోవేషన్ క్యాపిటల్'గా తెలంగాణ

**గేమ్ ఛేంజర్ గా తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్, ఏఐ యూనివర్సిటీ**

**టెక్నాలజీ డిగ్రీలకే పరిమితం కావొద్దు... దేశ సేవ, ఆత్మ నిర్భరతకు ఉపయోగపడాలి**

**బిట్స్ అల్యూమ్ని అసోసియేషన్ గ్లోబల్ మీట్ లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**




హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధితెలంగాణను గ్లోబల్ 'ఇన్నోవేషన్ క్యాపిటల్'గా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. టెక్నాలజీ కేవలం డిగ్రీలకే పరిమితం కాకుండా, దేశ సేవకు, ఆత్మ నిర్భరతకు ఉపయోగపడాలన్నారు. శనివారం బిట్స్ పిలానీ-హైదరాబాద్ క్యాంపస్‌లో నిర్వహించిన 'బిట్స్ అల్యూమ్ని అసోసియేషన్ గ్లోబల్ మీట్ 2026'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.... ఇతర దేశాలు ప్రైవేట్ గుత్తాధిపత్యాన్ని ప్రోత్సహిస్తే, భారత్ మాత్రం ఆధార్, యూపీఐ వంటి 'డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్' ద్వారా ప్రపంచానికి దిక్సూచిగా నిలిచిందన్నారు. దేశంలోనే తొలిసారిగా అందుబాటులోకి తీసుకొచ్చిన ఏఐ ఆధారిత 'తెలంగాణ డేటా ఎక్స్ ఛేంజ్' పరిశోధనలకు గొప్ప ఊతమిస్తోందన్నారు. త్వరలో ప్రారంభించబోయే 'తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్', 'ఏఐ యూనివర్సిటీ'లు గేమ్ ఛేంజర్‌గా మారి ఇతర రా(ష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలుస్తాయన్నారు. ప్రస్తుత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యుగంలో 'ఇంటెలిజెన్స్' కంటే 'కో-ఆర్డినేషన్' అత్యంత ఖరీదైనదిగా మారిందన్నారు. ఏఐ వినియోగంలో డేటా ప్రైవసీ, ఎథిక్స్‌కు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఆ దిశగా ఆర్ అండ్ డీపై దృష్టి సారించాలని టెక్ కంపెనీలను కోరారు. ఒకప్పుడు స్కేల్, స్పీడ్, వాల్యూయేషన్ ప్రాతిపదికన కంపెనీల సక్సెస్ నిర్ణయించబడేదని.. ఇప్పుడు ఆర్కిటెక్చర్, డేటా ఓనర్ షిప్, డెసిషన్ స్పీడ్ మరియు నమ్మకంపైనే వాటి మనుగడ ఆధారపడి ఉందన్నారు. రాబోయే రోజుల్లో కేవలం కోడింగ్ తెలిసిన వారి కంటే, సమస్య మూలాలను గుర్తించి పరిష్కరించగల 'క్రియేటివ్ థింకర్స్'కే జాబ్ మార్కెట్‌లో డిమాండ్ ఉంటుందన్నారు. 'ఏఐ' ఫలితాలు కేవలం నగరాలకే పరిమితం కాకూడదని, వ్యవసాయం, విద్య, వైద్య రంగాల్లోని గ్రామీణ సమస్యలకు పరిష్కారం చూపేలా పరిశోధనలు జరగాలన్నారు. అప్పుడే టెక్నాలజీ ఫలాలు సామాన్యులకు కూడా అందుతాయన్నారు. 'తెలంగాణ రైజింగ్'లో భాగస్వామ్యం కావాలని బిట్స్ పిలానీ పూర్వ విద్యార్థులను, యాజమాన్యాన్ని మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానించారు. ఏఐ, ఇన్నోవేషన్, అకడమిక్ రీసెర్చ్ వంటి అంశాల్లో బిట్స్ పిలానీతో కలిసి పని చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో బిట్స్ అలుమ్ని అసోసియేషన్ ఛైర్ పర్సన్ ప్రేమ్ జైన్, మ్యాప్ మై ఇండియా ఫౌండర్ అండ్ ఛైర్మన్ రాకేష్ వర్మ, బీజీఎం 2026 ఛైర్ పర్సన్ అనిత తదితరులు పాల్గొన్నారు.

ప్రజాబలం

11 జనవరి 2026 ఆదివారం

# యువత మత్తు అలవాట్లకు, కాదు మైదానం బాట పట్టాలి

## కాలుష్య కట్టడి ఎలా...

ముంబై నగర వాయు కాలుష్య సంక్షోభంపై బాంబే హైకోర్టు సుమోటోగా విచారణ చేపట్టి ఏళ్లు గడుస్తున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి మారకపోవడానికి ప్రధాన కారణం డేటా లేకపోవడం . నిబంధనల అమలు లో వైఫల్యమేనని స్పష్టమవుతోంది. గాలి నాణ్యత క్షీణతకు, ఊపిరితిత్తుల వ్యాధులకు ప్రత్యక్ష సంబంధం ఉన్నట్లు ఎటువంటి ఆధారాలు లేవని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో పేర్కొనడం అందరి దృష్టిపథంలో ఉంది. అదే సమయంలో అసలు దానికి సంబంధం ఉందో లేదో నిర్ధారించే డేటా సేకరణ మాత్రం జరగలేదు. అది యాధృచ్ఛికమో.. లేక నిజంగానే కనెక్షన్ ఉందో తెలీదు కానీ.. ప్రభుత్వం " గాలి కాలుష్యకారకమైన వ్యాధులపై పోరాటానికి అవసరమైన ప్రయత్నాలు చేస్తున్నాం.." అని చెబుతూ ఉంటుంది. సెన్సార్లు పనిచేయకపోవడం అన్నది గాలి కాలుష్యం విషయానికి సంబంధించిన ఆందోళనలో ఒక పరిపాటిగా మారిపోయింది. కాలుష్య నియంత్రణ సెన్సార్లు అనేకచోట్ల పని చేయడం లేదని బాంబే హైకోర్టు స్వయంగా గుర్తించింది. నిర్మాణ ప్రాంతాల్లో కాలుష్య నివారణ మార్గదర్శకాలను అమలు చేస్తున్నట్లు బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ రికార్డుల్లో చూపిస్తున్నప్పటికీ, వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. అధికారిక డేటా అంతా బాగున్నట్లు భ్రమింపజేస్తున్నా, జనం అనుభవిస్తున్న కాలుష్యం మాత్రం వేరే కథ చెబుతోంది. జనసాంద్రతకు అనుగుణంగా సెన్సార్ నెట్‌వర్క్ లేకపోవడంతో, కోర్టులు కూడా సరైన సమాచారం లేని శూన్య స్థితిలో నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తోంది.పాండమిక్ తర్వాత మనం ఎదుర్కొంటున్న అతిపెద్ద ఆరోగ్య సంక్షోభం వాయు కాలుష్యమే అయినప్పటికీ, దీనిపై తగినంత శ్రద్ధ లేకపోవడం విచారకరం. ముంబై, ఢిల్లీ వంటి నగరాల్లో శ్వాస పీల్చడం అంటే రోజుకు పదుల సంఖ్యలో సిగరెట్లు తాగడంతో సమానమని వార్తలు వస్తున్నా, జనం దాన్ని అలవోకగా తీసుకుంటున్నారు. ఇది కేవలం ఆరోగ్య సమస్యే కాదు, పెరుగుతున్న వైద్య ఖర్చుల వల్ల దేశంపై భారీ ఆర్థిక భారంగా పరిణమిస్తోంది. ముక్కలు ముక్కలుగా ఉన్న నిబంధనలు, ఆచరణకు సాధ్యం కాని విధానాల వల్ల వాయు స్వచ్ఛత లక్ష్యాలు నెరవేరడం లేదు.ఈ పరిస్థితికి చాలా కారణాలున్నాయి. సరైన నియంత్రణలు లేకపోవడం...వాటిని అమలు చేయడంలో సమన్వయ లోపం, ఆశావహ విధానాలు లేకపోవడం.. వాస్తవికత ఆధారంగా పనిచేయకపోవడం ఇవన్నీ కారణాలే. స్వచ్ఛమైన గాలి కోసం మనం విధించుకునే లక్ష్యాలు..వేగంగా పెరుగుతున్న ఆర్థిక వ్యవస్థ అవసరాల మధ్య సమతుల్యం కూడా అవసరమే. నా దృష్టిలో, ఇవన్నీ రెండు ప్రధాన లోపాలున్నాయి. ఒకటి డేటా లేకపోవడం.. అదే ముఖ్యమైంది. ఇక రెండోది ప్రత్యక్ష ఆర్థిక ప్రోత్సాహకాలు, జరిమానాలు లేకపోవడం. (కాలుష్య నియంత్రణకు సంబంధించి) ఈ వ్యాసంలో ప్రస్తావించిన ఇతర కారణాలు సహా మిగతా అన్ని అంశాలు..ఈ మొదటి లోపాన్ని సరిదిద్దకుండా పరిష్కరించలేము.కాలుష్యాన్ని నియంత్రించాలంటే ప్రతి వార్డులో, ప్రతి లోకాలిటీలో తక్కువ ఖర్చుతో కూడిన ఆధునిక సెన్సార్లను ఏర్పాటు చేయాలి. కేవలం ముంబైని మాత్రమే కాకుండా, ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ మొత్తాన్ని ఒకే 'ఎయిర్ షెడ్'గా పరిగణించి అధ్యయనం చేయాలి. సముద్రపు గాలుల వల్ల కాలుష్యం ఎక్కడి నుంచి ఎక్కడికి చేరుతుందో తెలిస్తేనే మూలాలను అరికట్టగలం. 2023లో ఎమి బాంబే, ఔఇఇఖీఎ వంటి సంస్థలు ఇచ్చిన నివేదికలను ఇప్పటికైనా అమలు చేయాలి. వీటితో పాటు, కాలుష్యం తగ్గించే వారికి పన్ను రాయితీలు ఇవ్వడం, ఉల్లంఘించే వారికి భారీ జరిమానాలు విధించడం వంటి 'ఫిస్కల్ ఇన్సెంటివ్స్' విధానాన్ని ప్రవేశపెట్టాలి. బలమైన రాజకీయ సంకల్పం లేకపోతే, మనం పీల్చే గాలిని చూస్తూ కూడా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలోనే ఉండిపోతాం.శ రాజధాని ఢిల్లీని వాయుకాలుష్యం ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. మరోవైపు ప్రపంచానికే పొగమంచు రాజధానిగా పేరుపొందిన చైనా రాజధాని బీజింగ్ గడచిన దశాబ్ద కాలంలో వాయు నాణ్యతను గణనీయ స్థాయిలో మెరుగుపరుచుకుంది. గడచిన వారం రోజులుగా ఢిల్లీలో వాయు నాణ్యత దారుణంగా పడిపోయిన నేపథ్యంలో ఈ గండం నుంచి గట్టెక్కడానికి చైనీస్ ఎంబసీ ప్రభుత్వానికి కొన్ని సూచనలు చేసింది. పట్టణీకరణ వేగంగా పెరుగుతున్న దరిమిలా ఉత్పన్నమయ్యే వాయు కాలుష్యంపైన ఎలా పోరాడాలో భారత్, చైనాకు తెలుసునని చైనీస్ ఎంబసీ అధికార ప్రతినిధి యూ జింగ్ తన పోస్టులో పేర్కొన్నారు. స్వచ్ఛమైన గాలి రాత్రికి రాత్రే రాదని, కాని దాన్ని సాధించగలమని ఆమె తెలిపారు. డిసెంబర్ 15న ఢిల్లీలో వాయు ప్రమాణ సూచి(ఏక్యూ) 447 ఉండగా బీజింగ్‌లో 67 పాయింట్లు ఉంది. ఈ రెండు స్క్రీన్‌షాట్లను ఆమె తన పోస్టులో షేర్ చేశారు.మొదటి దశలో వాహన కాలుష్యాన్ని అరికట్టేందుకు బీజింగ్ తీసుకున్న చర్యలను ఆమె వివరిస్తూ ఎక్కువ కాలుష్యాన్ని వెదజల్లే పాత వాహనాలను తొలగించి యూరో 6 నిబంధనలను కఠినంగా అమలు చేసినట్లు ఆమె చెప్పారు. లైసెన్స్-ప్లేట్ లాటరీలు, బేసి, సరి సంఖ్య తేదీల్లో వాహనాలపై ఆంక్షలు, మెట్రో, ప్రజారవాణా వ్యవస్థలో భారీ పెట్టుబడులు పెట్టడం, విద్యుత్తు బస్సులు, వాహనాల వినియోగాన్ని పెద్ద ఎత్తున తీసుకురావడం వంటి చర్యలను ఆమె సూచించారు.రెండవ దశలో పారిశ్రామిక పునర్వ్యవస్థీకరణపై దృష్టి సారించాలని ఆమె తెలిపారు. బీజింగ్‌లో 3,000కు పైగా భారీ పరిశ్రమల మూసివేత లేక వేరే ప్రాంతాలకు తరలింపు జరిగినట్లు చెప్పారు. చైనాలోని అతి పెద్ద ఉక్కు తయారీ సంస్థల్లో ఒకటైన షౌగాంగ్‌ని వేరే చోటుకు తరలించడంతో 20 శాతం వాయు కాలుష్యం తగ్గినట్లు వివరించారు. ఖాళీ చేసిన ఫ్యాక్టరీల స్థలాలను పార్కులు, వాణిజ్య జోన్లు, టెక్ హబ్‌లుగా మార్చాలని ఆమె సూచించారు.

## క్రీడలే దేశానికి భవిష్యత్ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి**హైదరాబాద్ : 19వ రాజీవ్ గాంధీ అండర్-19 లీగ్ టీ20 క్రికెట్ ఛాంపియన్‌షిప్-2026 ముగింపు కార్యక్రమం హైదరాబాద్‌లో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలైన హైదరాబాద్ జట్టుకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ× ప్రస్తుతం యువత ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అనవసరపు అలవాట్లకు గురవుతున్నారని చెప్పారు. ముఖ్యంగా ఈ తరం యువత మత్తు పదార్థాలతో పాటు ఇతర పలు చెడు వ్యసనాలకు లోనవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారుఇలాంటి వ్యసనాల బానిస బాట కాకుండా వాటికి బదులు ప్రతి ఒక్కరువీలైనంత సమయాన్ని మంచి ఆరోగ్యం కొరకు మైదానాల బాట పట్టి వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ యువతకు పిలుపునిచ్చారు.స్వర్గీయ రాజీవ్ గాంధీ గారు క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చిన నేత అని గుర్తు చేశారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు ఆయన చేసిన సేవలు మరువలేనివని గుర్తు చేశారు. రాజీవ్ గాంధీ అకాల మరణం దేశానికి తీరని లోటని అన్నారు.గత దశాబ్ద కాలంగా తెలంగాణలో క్రీడా రంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని విమర్శించారు. సరైన మౌలిక వసతులు, ప్రోత్సాహకాలు లేక ఎంతో మంది ప్రతిభావంతులైన యువ క్రీడాకారులు వెనుకబడ్డారని పేర్కొన్నారు.అయితే, ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో క్రీడలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని స్పష్టం చేశారు. భవిష్యత్ క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడం చారిత్రాత్మక నిర్ణయమని మంత్రి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ఇది తెలంగాణను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడా కేంద్రంగా మార్చే దిశగా కీలక అడుగని అన్నారు.అలాగే, సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలల్లోని విద్యార్థులు క్రీడల్లో అద్భుత ప్రతిభ చూపుతున్నారని మంత్రి తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో గురుకుల విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక పతకాలు సాధిస్తున్నారని చెప్పారు. పేద కుటుంబాల పిల్లలకు క్రీడలే జీవితాన్ని మార్చే ఆయుధమని పేర్కొన్నారు.ఈ లీగ్‌లో దేశవ్యాప్తంగా 12 రా(ష్టాల జట్లు పాల్గొనడం యువతలో క్రీడల పట్ల ఉన్న ఆసక్తికి నిదర్శనమని మంత్రి అన్నారు. ఫైనల్‌లో విజయం సాధించిన హైదరాబాద్ జట్టును ప్రత్యేకంగా అభినందించారు.క్రీడల ద్వారా క్రమశిక్షణ, ఐక్యత, పోరాట స్ఫూర్తి పెరుగుతాయని, అదే యువతను మంచి పౌరులుగా తీర్చిదిద్దుతుందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ స్పష్టం చేశారు.గత 20 సంవత్సరాల నుండి స్వర్గీయ రాజీవ్ గాంధీ గారి పేరు మీదుగా ఈ పోటీలు నిర్వహిస్తున్న మాజీ పార్లమెంట్ సభ్యులు హనుమంతరావు గారికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో , క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాజీ ఎంపీ వి హనుమంతరావు, ప్రభుత్వ సలహాదారులు కేశవరావు హర్కర వేణుగోపాల్, రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి కార్పొరేషన్ చైర్మన్లు మెట్టు సాయికుమార్ , శివసేన రెడ్డి మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ , డిసిసి అధ్యక్షులు మోతే రోహిత్, సయ్యద్ సైఫుల్లా తదితరులు పాల్గొన్నారు.

## పాలేరు నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలబెడతా

### మంత్రి పొంగులేటీ శ్రీనివాస్ రెడ్డి





**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి**రెండేళ్ల క్రితం నాపై మీరు ఉంచిన నమ్మకాన్ని గుండెల్లో పెట్టుకుంటా..అభివృద్ధి, సంక్షేమంలో పాలేరు నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలబెడతా

శనివారంనాడు పాలేరు నియోజకవర్గంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, ముఖ్య నేతలు, కార్యకర్తలతో కలిసి పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటీ శ్రీనివాస్ రెడ్డి

రూ. 4 కోట్లతో ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని విద్యానగర్‌లో అంతర్గత సిసి రోడ్లు, డ్రైన్లు, కల్వర్టు పనులకు శంకుస్థాపన,

రూ. 1 కోటి 2లక్షల 50 వేలతో ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని నాయుడుపేటలో అంతర్గత సీసీ రోడ్లు, బస్ షెల్టర్, జంక్షన్ అభివృద్ధి, కమ్యూనిటీ హాల్ ఆధునీకరణ పనులకు శంకుస్థాపన,

రూ. 77.10 లక్షలతో నడిమితండా , రూ. 37.20 లక్షలతో గొల్లగూడెం, రూ. 29.30 లక్షలతో జలగంనగర్, రూ. 24.27 లక్షలతో బారుగూడెం,

రూ. 17.20 లక్షలతో ఆటోనగర్‌లో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టడం జరిగింది.

గత పది సంవత్సరాలు బీఆర్ఎస్ ప్రభుత్వం పేదవారి కష్టాలను పట్టించుకోలేదు. కనీసం రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు. కానీ ఇందిరమ్మ రాజ్యంలో అర్హులందరికీ రేషన్ కార్డులు అందజేయడమే కాకుండా, దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వని విధంగా సన్నబియ్యం అందిస్తున్నాం. సొంత ఇల్లు లేని పేదలకు గూడు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తున్నాం.. వచ్చే ఏప్రిల్ నెల నుంచి రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ చేపడతాము. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుంది.

పేదవారికి ఎల్లవేళలా అండగా ఉండే ప్రజా ప్రభుత్వాన్ని ప్రజలు ఈ మధ్య జరిగిన ప్రతి ఎన్నికలలో ఆశీర్వదించారు..

రాబోయే ఎన్నికల్లోనూ ప్రజల దీవెనలు ఇలాగే కొనసాగాలని కోరుతున్నాను.

## రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

### డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

### డిప్యూటీ సీఎంను కలిసిన జిల్లా రవాణాశాఖ అధికారి ధర్మపురి జగదీష్





**ఖమ్మం ప్రతినిధి జనవరి 10 (ప్రజాబలం)** ఖమ్మం రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. శనివారం ఖమ్మం జిల్లా రవాణా శాఖ అధికారి ధర్మపురి జగదీష్ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ జాతీయ రహదారి భద్రత మ త్సవాలు పై అవగాహన కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టిఏ నెంబర్ గజ్జెల్లి వెంకన్న, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ లు దినేష్, స్పాట్కస్ తదితరులు ఉన్నారు

# సంక్రాంతి పండుగ సందర్భంగా పల్లెలకు క్యూ కట్టిన హైదరాబాద్ నగరవాసులు

## కిక్కిరిసిపోయిన విజయవాడ జాతీయ రహదారి



**ప్రజాబలం ప్రతినిధి** హైదరాబాద్ జనవరి 10 );సంక్రాంతి పండుగ సందర్భంగా హైదరాబాద్ నగరవాసులు పల్లెలకు క్యూ కట్టారు. ఏపీకి వెళ్లే వారి వాహనాలతో హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారి కిక్కిరిసిపోయింది. శనివారం ఉదయం హైవేపై వాహనాల రద్దీ పెరిగింది. దీంతో చౌటుప్పల్, పంతంగి టోల్ ప్లాజా వద్ద వాహనాలు బారులు తీరాయి.వాహనాల రద్దీ నేపథ్యంలో పోలీసులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని పోలీసులు సూచిస్తున్నారు. భువనగిరి, రామన్నపేట మీదుగా చిట్యాలకు చేరుకోవాలని.. గుంటూరు, ఒంగోలు వైపు వెళ్లే వారు సాగర్ హైవే మీదుగా వెళ్లాలని సూచించారు.సంక్రాంతి సెలవులు ప్రారంభం కావడంతో ఎంజీబీఎస్, జేబీఎస్‌లోనూ రద్దీ పెరిగింది. ఉప్పల్, ఎల్బీనగర్, తార్నాక కూడళ్ల వద్ద కూడా బస్సుల కోసం జనాలు బారులు తీరారు. అయితే రద్దీకి తగ్గట్లుగా ఆర్టీసీ బస్సులను నడపకపోవడంతో జనాలు ఇబ్బందులు పడుతున్నారు. జనగామ బస్సు కోసం దాదాపు గంటన్నర ఎదురుచూస్తే ఒక్క బస్సు వచ్చిందని.. స్పెషల్ బస్సు పేరిట అందులోనూ రూ.50 అదనంగా వసూలు చేస్తున్నారని ప్రయాణికులు మండిపడుతున్నారు.

# భారత్ ను అగ్రదేశాల సరసన నిలబెట్టిన ప్రదాని మోదీ

## హైదరాబాద్ డిఫెన్స్ అకాడమీ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్




**ప్రజాబలం ప్రతినిధి** హైదరాబాద్ జనవరి 10 ఒకప్పుడు భారత దేశం అంటే చిన్నచూపు ఉండేదని మోదీ వచ్చాక అగ్రదేశాల సరసన నిలబెట్టారని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. హైదరాబాద్ డిఫెన్స్ అకాడమీ వార్షికోత్సవంలో పాల్గొని ప్రసంగించారు.నేడు భరత్ అగ్రదేశాల సరసన నిలబడివాటితో అన్ని రంగాల్లో పోటీ పడుతున్నామన్నారు.డిఫెన్స్ అకాడమీలో చదువుతున్నారు కాబట్టి మీరంతా దేశ రక్షణ కోసం ముందుకు రావాలని కోరారు.దేశంలో రక్షణ రంగంలో ఉన్న వారికి ఎక్కువ గౌరవం ఉంటుంది. మీరంతా దేశభక్తి సంపూర్ణంగా ఉన్నవారు. మనదేశం ప్రపంచంలో అన్నిదేశాల కంటే ఎక్కువ యువత ఉంది. అదే మా సంపద అని గర్వంగా మన ప్రధాని మోదీ చెప్తున్నారు. ఆ యువశక్తి ఆరోగ్యంగా జ్ఞానవంతంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నారు. మోదీ గారు వచ్చినప్పుడు 11 గా స్థానంలో ఉన్న ఆర్థిక వ్యవస్థ నాలుగవ స్థానంకు తీసుకువచ్చారు. మీరంతా దేశ సంపద. చెడు అలవాట్లను దగ్గరకు రానివ్వకండి. సెల్ ఫోన్ మంచికోసం వాడండి. సంస్కారం లేకపోతే ఎంత చదువుకున్నా వృధా అవుతుందన్నారు.

# రాష్ట్రంలోచిన్నారులకుఅల్మాంట్-కిడ్ సిరప్ వాడవద్దు

## డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ కీలక హెచ్చరిక



హైదరాబాద్ జనవరి 10 ;: గతేడాది అక్టోబర్‌లో మధ్యప్రదేశ్‌లో కోల్డ్-రిఫ్ అనే దగ్గు మందు వల్ల 20 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయిన దుర్ఘటన గురించి అందరికీ తెలిసిందే. ఈ ఉదంతం మర్చిపోక ముందే తెలంగాణలో మరో దగ్గు మందు మహమ్మారి ప్రవేశించినట్లు డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ హెచ్చరించింది. రాష్ట్రంలో చిన్నారులకు అల్మాంట్-కిడ్ సిరప్ వాడవద్దని కీలక ఆదేశాలు జారీ చేసింది. అది దగ్గు మందు కాదని.. ఆ రూపంలో ఉన్న స్లో పాయిజన్ అని పేర్కొంది. అందులో ఎథిలీన్ గ్లైకాల్ కలిసినట్లు ల్యాబ్ పరీక్షల్లో తేలింది. దీంతో సిరప్ వినియోగాన్ని వెంటనే నిలిపివేయాలని డిసిఎ అత్యవసర హెచ్చరికలు జారీ చేసింది. ఈ విషయాన్ని కేంద్ర ఔషధ ప్రమాద నియంత్రణ సంస్థ (సిడిఎస్‌సిఓ) ఈస్ట్ జోన్, కోల్‌కతా నుంచి వచ్చిన అలర్ట్ ఆధారంగా రాష్ట్ర డ్రగ్స్ కంట్రోల్ శాఖ ప్రకటించింది. బిహార్‌కు చెందిన ట్రిడస్ రెమిడీస్ అనే ఫార్మా సంస్థ తయారు చసిన ఎఎల్-24002 బ్యాచ్ సిరప్ శాంపిల్స్‌ను పరిశీలించగా.. అత్యంత విషపూరితమైన ఎథిలీన్ గ్లైకాల్ ఉన్నట్లు తేలిందని అధికారులు చెప్పారు. ఇది కిడ్నీలు, నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని.. పిల్లలకు ప్రాణాపాయం కలిగే అవకాశం ఉందని వైద్యులు తెలిపారు. ఈ అల్మాంట్-కిడ్ సిరప్‌ను ఎవరైనా కొనుగోలు చేస్తే.. దాని వినియోగాన్ని వెంటనే ఆపాలని సూచించారు. ఏదైనా అత్యవసరమైతే.. నేరుగా డ్రగ్స్ కంట్రోల్ శాఖకు తెలియజేయవచ్చని లేదా టో ఫ్రీ నెంబర్ 1800-599-6969కు కాల్ చేయాలని సూచించింది. పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతీ ఒక్కరు దగ్గు మందుల పట్ల అప్రమత్తంగా ఉండాలని.. అనుమానాస్పద సిరప్ కనిపిస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని డిసిఎ అధికారులు ప్రజలను కోరారు.

### నవ కంటోన్మెంట్ నిర్మాణ బాట

### మోండా డివిజన్ లోని కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే శ్రీగణేష్

సికింద్రాబాద్ నవ కంటోన్మెంట్ నిర్మాణ బాటలో భాగంగా కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ శనివారం మోండా డివిజన్ పరిధిలోని టౌన్ ఇంప్రూవ్ మెంట్ ట్రస్ట్ ( ుఇ), సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (ూఓఅ),బలరామ్ బ్లాక్స్ లలో జీహెచ్ఎంసి, హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులు, నాయకులు, కార్యకర్తలు, కాలనీల వాసులతో కలసి క్షేత్రస్థాయిలో పర్యటించారు.

ఈ పర్యటనలో కాలనీ లో బస్తీ దవాఖానా, లైబ్రరీ అవసరం ఉన్న దృష్ట్యా కాలనీలో ఉన్న ఉఊఓఅ స్థలంలో ఎమ్మెల్యే ఫండ్స్ నుంచి నిధులు కేటాయించి, అధికారులతో మాట్లాడి నిర్మాణం చేపిస్తానని అన్నారు. కాలనీలో అవసరమైన అంతర్గత రహదారులు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, వీధి దీపాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తన వెంట పర్యటనలో ఉన్న అధికారులకు చెప్పారు.

ఎన్నో ఏళ్లుగా పేరుకుపోయిన తమ సమస్యలను స్వయంగా పరిశీలించి పరిష్కరించడానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే కు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలపడంతో ఎమ్మెల్యేగా ఇది తన బాధ్యత అని వారితో చెప్పారు. ఈ పర్యటనలో ఎమ్మెల్యే శ్రీగణేష్ వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగేష్ యాదవ్, బద్రీనాథ్ యాదవ్, సంకి రవీందర్, సంతోష్ యాదవ్, అరవింద్ యాదవ్, వేణుగోపాల చారి, కాలనీ పెద్దలు రషీద్, రాజు, సాయిబాబా, అశోక్ తదితరులు ఉన్నారు.

# ఏబీవీపీ ఆద్వర్యం లో సికింద్రాబాద్ జిల్లా ఆధ్వర్యంలో వివేకానందా జయంతి ఉత్సవాలు



**ప్రజాబలం ప్రతినిధి** హైదరాబాద్ జనవరి 10 వివేకానంద 163 వ జయంతి ఉత్సవాలలో భాగంగా అఖిల భారతీయ విద్యార్థి పరిషత్-సికింద్రాబాద్ జిల్లా, అల్వాల్ శాఖ ఆధ్వర్యంలో నారాయణ జూనియర్ కళాశాలలో సెమినార్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది... ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు హాజరై ప్రసంగించారు. వివేకానందుని వాక్కులే ఏబీవీపీ సంస్థను ఏర్పాటు చేయడంలో కీలక భూమిక అని, నేటి విద్యార్థులు మరియు యువత వివేకానందుడుని స్ఫూర్తిగా తీసుకుని జీవనం సాగించాలని, వివేకానందుని స్ఫూర్తితో మన దేశ అభ్యున్నతికి పాటుపడాలని, ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతి విద్యార్థి తన లక్ష్యాలను సాధించేలా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు, ప్రతి విద్యార్థి భారత్ ను విశ్వ గురువు స్థానంలో నిలిపేలా, 2047వరకు సాధించాలనుకుంటున్న వికాసిత్ భారత్ పాలుపంచుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ జిల్లా కన్వీనర్ చెర్క బాలకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్, నగర కార్యదర్శి రిషి, సుశాంత్, యశ్వంత్ రెడ్డి, ఏకిందర్,మోహిత్, మనీష్ విద్యార్థులు, ఏబీవీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విడిపోతే చెడిపోతాం అందుకే మనమంతా ఒక్కటై ఐక్యత తో పోరాడాలి

## సంకోజు లింగా చారిఅఖిల భారత విశ్వ కర్మ మహా సభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



**ప్రజాబలం ప్రతినిధి** హైదరాబాద్ జనవరి 10 విశ్వ కర్మ కొంత కాలంగా వృత్తి పరంగా,ఉపాధి పరంగా, అధికార పరంగా ఎంతో నష్టపోయాం ఇది మనకందరికి తెలుసు దానికి కారణం గత ప్రభుత్వాలు అలాగే మన నాయకుల తప్పిదాలు ఇది అందరూ గమనించాలని సంకోజు లింగా చారిఅఖిల భారత విశ్వ కర్మ మహా సభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోరారు. విడిపోతే చెడిపోతాం అందుకే మనమంతా ఒక్కటై ఐక్యత తో పోరాడాలి. మన ఐదు పంచ దాయలు1) మను, 2)మయ, 3)త్వష్ట, 4)శిల్పి, 5)విశ్వజ్ఞ.దీనిని గమనించి పంచదాయల కోసం గత కొంత కాలంగా అఖిల భారత విశ్వ కర్మ మహాసభ ఎన్నో రకాల సేవలందిస్తుంది.అందుకే రా కదలిరా మన మంతా ఒక్కటై కదం తొక్కుదాం మన సర్వ రోగ నివారిణి కార్పొరేషన్ సాధించడమే దీనికోసం అందరు ఒక్క దాటి పై వచ్చి మన సంఖ్యా బలాన్ని చాటుకుందాం కమిటీలో విస్తరణ లో భాగంగా రా కదలి రా అఖిల భారత విశ్వ కర్మ మహా సభ పిలుస్తుంది రా కదలి రావాలని పిలుపు నిచ్చారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రములో వున్న విశ్వ కర్మ కుల బాందవులకు పేరు పేరు నా సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ, అలాగే అందరు కుటుంబ సభ్యులతో సంతోషం గా పండుగని జరుపుకోవాలని ఆకాంక్షించారు.

# థీమ్ ఆశయాల రాజకీయ నిర్మాణంఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ జాతీయ కార్యవర్గ సమావేశంలో తీర్మానం



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** హైదరాబాద్, జనవరి 10 ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ (ఏఐపిసి ) జాతీయ కార్యవర్గ సమావేశం నేడు హైదరాబాద్‌లో జరిగింది. ఈ సమావేశానికి ఏఐపిసి చైర్మన్ ప్రవీణ్ చక్రవర్తి అధ్యక్షత వహించారు. దేశవ్యాప్తంగా వివిధ రంగాలకు చెందిన నిపుణులు ఈ సమావేశంలో పాల్గొని, "ఆశయాల రాజకీయ నిర్మాణం" అనే అంశంపై విస్తృతంగా చర్చించారు. ఈ ఆలోచన ప్రతి భారతీయుడికి గౌరవం, అవకాశాలు మరియు ఆశను అందించాలనే దృక్పథంతో ముందుకు సాగుతోంది.హక్కుల ఆధారిత, సమగ్రతను కలిగిన, భవిష్యత్ దృష్టితో కూడిన ప్రజా విధానాలను బలోపేతం చేయడంపై చర్చలు జరిగాయి. 2025 సంవత్సరంలో చేపట్టిన కార్యక్రమాలను సమీక్షించిన జాతీయ కార్యవర్గం, 2026 సంవత్సరానికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళికలు మరియు ప్రాధాన్యతలను ఖరారు చేసింది. వృత్తిపరమైన నైపుణ్యాలను రాజకీయ, విధాన పరమైన పనుల్లో సమర్థవంతంగా వినియోగించడంపై ప్రత్యేక దృష్టి పెట్టింది.ఈ సమావేశంలో ఏఐపిసి కు చెందిన వివిధ విభాగాల ప్రతినిధులు చురుకుగా పాల్గొన్నారు. ముఖ్యంగా ర్థిక మరియు ఫైనాన్షియల్ సేవలు – ఆర్థిక, రాజస్వ విధానాలు,ఆరోగ్య రంగం – ప్రజారోగ్యం మరియు వైద్య వ్యవస్థలు,అకాడమియా మరియు పరిశోధన – ఆధారాలతో కూడిన విధానాలు, విద్య,సమాచార సాంకేతికత – డిజిటల్ పాలన, నూతన ఆవిష్కరణలు,ఎంఎస్ఎంఈలు – వ్యాపారోత్పత్తి, ఉపాధి, సమాన మార్కెట్ విధానాలు,వ్యవసాయ నిపుణులు – రైతులు, గ్రామీణ జీవనోపాధి,ఆర్కిటెక్చర్ – పట్టణ ప్రణాళిక, మౌలిక సదుపాయాలు,ప్రొఫెషనల్ సేవలు – చట్టపరమైన, నియంత్రణ సంబంధిత అంశాలు,క్రీడలు – క్రీడా విధానాలు, గ్రాస్‌రూట్ అభివృద్ధి,సివిల్ సొసైటీ పాలసీ రీసెర్చ్ – ప్రజా భాగస్వామ్య పాలన,ఎల్జిబిటిక్యూఐఏ + సామాజిక సమగ్రత – సమానత్వం, గౌరవం,చార్టెడ్ అకౌంటెంట్స్ – ఆర్థిక బాధ్యత,గిగ్ వర్కర్లు – ప్లాట్‌ఫార్మ్ ఆర్థిక వ్యవస్థ, కార్మిక హక్కులు,పర్యావరణం – సుస్థిర అభివృద్ధి, వాతావరణ విధానాలు,కళలు సంస్కృతి – సాంస్కృతిక వ్యక్తీకరణ, సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ రంగాలపై చర్చలు జరిగాయి.తన కీలక ప్రసంగంలో చైర్మన్ ప్రవీణ్ చక్రవర్తి , కేవలం సంక్షేమానికి పరిమితం కాకుండా, ప్రజల ఆశయాలను సాధ్యమయ్యేలా చేసే రాజకీయాల అవసరాన్ని ప్రస్తావించారు. సంస్థలు ప్రజలను శక్తివంతం చేయాలి, మార్కెట్లు న్యాయంగా ఉండాలి, పని గౌరవప్రదంగా ఉండాలి, వృద్ధి సమగ్రంగా జరగాలన్నారు.ఈ సందర్భంగా ఏఐపిసి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డా. ఆదిత్య రెడ్డి గిల్లెల్లా మాట్లాడుతూ, వృత్తిపరమైన నిపుణులు నిజాయితీ, ఆధారాలు మరియు ప్రజా బాధ్యతతో విధానాల రూపకల్పనలో కీలక పాత్ర పోషించాలని అన్నారు. ప్రజాకేంద్రిత రాజకీయాలకు వృత్తిపరమైన ప్రతిభను అనుసంధానించడమే ఏఐపిసి లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమానికి ×ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర గౌరవ మంత్రివర్యులు, మైనారిటీల సంక్షేమం మరియు పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖ మంత్రి, మొహమ్మద్ అజారుద్దీన్, మాజీ భారత క్రికెట్ జట్టు కెప్టెన్, హాజరయ్యారు. ఆయన ఏఐపిసి నిపుణులతో ప్రశ్నోత్తర కార్యక్రమంలో పాల్గొని, నాయకత్వం, పాలన మరియు సమగ్ర అభివృద్ధిపై విలువైన సూచనలు అందించారు.ఇటీవల పలువురు సీనియర్ ఏఐపిసి సభ్యులు జిల్లా కాంగ్రెస్ కమిటీ () నాయకులుగా నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో ×హైదరాబాద్ డిసిసి అధ్యక్షులు ఖాలిద్ మరియు సికింద్రాబాద్ డిసిసి అధ్యక్షులు దీపక్ జాన్ పాల్గొని, తమ అనుభవాలను ఏఐపిసి నిపుణులతో పంచుకున్నారు.కేరళలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసిన ఏఐపిసి సభ్యులు మరియు డా. మన్మోహన్ సింగ్ ఫెలోస్ తమ అనుభవాలను పంచుకున్నారు. రాజకీయాల్లో వృత్తిపరుల భాగస్వామ్యం పెరుగుతోందని ఈ సమావేశం స్పష్టం చేసింది.దేశాన్ని మరింత ప్రజాస్వామ్యబద్ధంగా, సమానత్వంతో ముందుకు నడిపేందుకు, వృత్తిపరమైన జ్ఞానం ఆధారంగా ప్రగతిశీల రాజకీయాలను నిర్మించేందుకు ఏఐపిసి కట్టుబడి ఉందని జాతీయ కార్యవర్గం పునరుద్ఘాటించింది.

# ప్రెస్ క్లబ్ జర్నల్ ను ఆవిష్కరించిన మంత్రి పొంగులేటిశ్రీనివాసరెడ్డి



హైదరాబాద్, ప్రజాబలం ప్రతినిధిజనవరి ,10: జర్నలిస్టుల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్ నూతన కమిటీ రూపొందించిన ప్రెస్ క్లబ్ జర్నల్ ను మంత్రి సచివాలయంలో శనివారం ఆవిష్కరించారు. తెలుగు ఇంగ్లీష్ భాషల్లో ప్రతినెల ప్రెస్ క్లబ్ జర్నలను రూపొందించడం అభినందనీయమని పొంగులేటి సందర్భంగా ప్రశంసించారు. ఈ జర్నల్లో జర్నలిస్టులకు సంబంధించిన సమకాలిన అంశాలు పొందుపరచడం సంతోషకరమని పొంగులేటి గారు చెప్పారు. ప్రెస్ క్లబ్ నూతన పాలకమండలి ఏర్పడి మూడు నెలలు అయినప్పటికీ జర్నలిస్టుల సంక్షేమ అభివృద్ధికి వివిధ కార్యక్రమాలను రూపొందించామని ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎస్ విజయకుమార్ రెడ్డి ప్రధాన కార్యదర్శి రమేష్ వరికుప్పల మంత్రికి వివరించారు. ప్రెస్ క్లబ్ సభ్యులందరికీ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తున్నామని ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని మంత్రికి వివరించారు. జర్నలిస్టుల కోసం ప్రెస్ క్లబ్ చేపట్టే కార్యక్రమాలకు ప్రభుత్వం సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తుందని మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ప్రెస్ క్లబ్ జర్నల్ ఆవిష్కరణ కార్యక్రమంలో ప్రెస్ క్ల బ్ ఉపాధ్యక్షులు ఏ. రాజేష్, అరుణ అత్తలూరి, జాయింట్ సెక్రెటరీ చిలుకూరి హరిప్రసాద్, కోశాధికారి రమేష్ వైట్ల, ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులు శంకర్ శీగ, ఎన్ . ఉమాదేవి, రచన ముదుంబై, వనం నాగరాజు, అమిత్ బట్టు తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్ అవగాహన కార్యక్రమంలో విద్యార్థులను ప్రేరేపించిన మంత్రి మహమ్మద్ అజహరుద్దీన్ ప్రేరణాత్మక ప్రసంగం



హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధికర్వాన్ + జనవరి 10, 2026తెలంగాణ మైనారిటీల సంక్షేమం మరియు ప్రభుత్వ సంస్థల శాఖ మంత్రి Mohammed Azharuddin జనవరి 10, 2026న కర్వాన్‌లో నిర్వహించిన డ్రగ్ అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. యువతలో మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించడం, సమాజం మొత్తంగా డ్రగ్ నిర్మూలనలో భాగస్వామ్యం కావాలని ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో డైరెక్టర్, యాంటీ-నార్కోటిక్స్ బ్యూరో అయిన ఐపీఎస్ సందీప్ శాండాలియా సహా సీనియర్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు, స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో హాజరుకావడం ద్వారా డ్రగ్ వ్యతిరేక కార్యక్రమాలకు ప్రజల మద్దతు స్పష్టంగా కనిపించింది. ఈ కార్యక్రమాన్ని ఉస్మాన్ బిన్ మహమ్మద్ అల్ హాజ్రీ తదితరులు నిర్వహించారు.కార్యక్రమంలో మంత్రి మహమ్మద్ అజహరుద్దీన్ విద్యార్థులతో సన్నిహితంగా మమేకమై ప్రేరణాత్మక ప్రసంగం చేశారు. డ్రగ్స్‌కు సంబంధించిన అనుమానాస్పద కార్యకలాపాలు, ఫోటోలు లేదా సమాచారం ఏదైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. అలాంటి సందర్భాల్లో పోలీసులు పూర్తిగా తమకు సహకరిస్తారని భరోసా ఇచ్చారు. డ్రగ్ నిర్మూలన కోసం తెలంగాణ ప్రభుత్వం మరియు ముఖ్యమంత్రి నిరంతరం కృషి చేస్తున్నారని, ప్రజల సహకారం అత్యంత అవసరమని ఆయన అన్నారు.చిన్న వయసు నుంచే మంచి స్నేహబంధాలు ఏర్పరుచుకోవడం ఎంతో ముఖ్యమని మంత్రి పేర్కొన్నారు. పాఠశాల స్థాయిలో ఏర్పడే మంచి అలవాట్లు, స్నేహాలు భవిష్యత్తును తీర్చిదిద్దుతాయని తెలిపారు. కళాశాల విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండడమే కాకుండా తమ స్నేహితులను కూడా ఆ దారి నుంచి దూరం చేయాలని పిలుపునిచ్చారు.తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలకు మంచి విలువలు, సద్గుణాలు నేర్పాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయులు శత్రువులు కాదని, విద్యార్థుల మంచికే మార్గనిర్దేశం చేస్తారని చెప్పారు. మంచి విద్య కోసం తల్లిదండ్రులు చేసే కష్టాలను గుర్తించి వారి విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని, చదువుపై దృష్టి పెట్టి జీవితంలో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు.తన ప్రసంగం ముగింపులో, నేటి విద్యార్థులే రేపటి భారతదేశ భవిష్యత్తని మంత్రి అన్నారు. క్రమశిక్షణతో, విద్యతో, డ్రగ్‌రహిత యువతే దేశాన్ని మరింత బలమైన మరియు ప్రకాశవంతమైన దిశగా నడిపిస్తారని పేర్కొన్నారు.

## మహిళా ఐఏఎస్ అధికారులపై వచ్చిన అసభ్య, అనుచిత ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం - మంత్రి సీతక్క



హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధిమహిళా ఐఏఎస్ అధికారులను లక్ష్యంగా చేసుకుని కొంతమంది వ్యక్తులు, కొన్ని మీడియా వేదికలు అసభ్యంగా, అనుచితంగా, దూషణాత్మకంగా వార్తలు, వ్యాఖ్యలు చేయడం అత్యంత ఆందోళనకరమైన విషయం అని తెలంగాణ పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క పేర్కొన్నారు. బాధ్యతాయుతంగా పనిచేస్తూ ప్రజాసేవలో నిమగ్నమైన మహిళా ఐఏఎస్ అధికారుల గౌరవాన్ని దెబ్బతీయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆమె అన్నారు.మహిళలు ఉన్నత స్థాయిలకు చేరితే వాటిని తట్టుకోలేని ఫ్యూడల్ మానసికతే ఈ రకమైన దుష్ప్రచారాలకు మూలమని ఆమె విమర్శించారు.తెలంగాణ రాష్ట్రంలో మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పని చేస్తోందని, అటువంటి పరిస్థితుల్లో మహిళా అధికారులను కించపరిచే వ్యాఖ్యలను, వారి వ్యక్తిత్వాన్ని దెబ్బతీసే ప్రచారాన్ని సహించబోమని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.మహిళా ఐఏఎస్ అధికారులు తమ బాధ్యతలను ధైర్యంగా, నిబద్ధతతో నిర్వహిస్తున్నారని, వారి వెనుక రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణంగా నిలుస్తుందని ఆమె భరోసా ఇచ్చారు. ఈ తరహా దూషణలు, అసభ్య వ్యాఖ్యలు చేసిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.మహిళలపై ద్వేషం, అవమానంతో కూడిన ప్రచారానికి సమాజం మొత్తం వ్యతిరేకంగా నిలబడాల్సిన అవసరం ఉందని, ప్రజాస్వామ్యాన్ని, మహిళల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిదని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు.

# 3 హాస్పిటళ్లు.. 30 మెడికల్ క్యాంపులు

### మేడారంలో వైద్య సేవల కోసం ఏర్పాటు
### జాతరకు వెళ్లే రూట్లలో మరో 42 క్యాంపులు
### 35 అంబులెన్సులు.. 3,199 మంది సిబ్బందితో వైద్య సేవలు
### ఏర్పాట్లపై అధికారులతో మంత్రి దామోదర్ రాజనర్సింహ



హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధిమేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు వచ్చే కోట్లాది మంది భక్తులకు వైద్యపరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. చిన్నపాటి అనారోగ్య సమస్య వచ్చినా తక్షణం స్పందించి వైద్యం అందించేలా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ మేరకు శనివారం ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జాతర ఏర్పాట్లపై పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రూపొందించిన ప్రణాళికను మంత్రి పరిశీలించారు. ఇప్పటికే లక్షల మంది భక్తులు ముందస్తుగానే జాతరకు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే గద్దెల వద్ద, జంపన్న వాగు సమీపంలో, ఆర్టీసీ బస్ స్టాండ్ వద్ద 3 వైద్య శిబిరాలను ప్రారంభించామని అధికారులు మంత్రికి వివరించారు. భక్తుల సంఖ్య పెరుగుతున్నందున జాతర పరిసరాలలో మరిన్ని మెడికల్ క్యాంపులను ముందస్తుగానే ప్రారంభించాలని అధికారులకు మంత్రి సూచించారు. భక్తులు మేడారం బయలుదేరిన దగ్గరి నుంచి.. అమ్మవార్లను దర్శించుకుని క్షేమంగా ఇళ్లకు చేరేంత వరకు వైద్య సేవలు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. మేడారం చేరుకునే అన్ని రూట్లలోనూ మెడికల్ క్యాంపులు ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు.50 పడకల ప్రధాన హాస్పిటల్జాతరలో అత్యవసర వైద్య సేవల కోసం మేడారంలోని టీటీడీ కల్యాణ మండపంలో 50 పడకలతో కూడిన ప్రధాన హాస్పిటల్ (శ్రీ సమ్మక్క సారలమ్మ వైద్యశాల) ఏర్పాటు చేసినట్లు అధికారులు మంత్రికి వివరించారు. దీనికి అదనంగా జంపన్న వాగు, ఇంగ్లీష్ మీడియం స్కూల్ వద్ద 6 పడకల సామర్థంతో రెండు మినీ హాస్పిటళ్లు, జాతర పరిసరాల్లో 30 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఎనిమిది రూట్లలో క్యాంపులువివిధ జిల్లాల నుంచి భక్తులు వచ్చే 8 ప్రధాన రూట్లలో, ఎక్కడా వైద్య సేవలకు లోటు రాకూడదని మంత్రి సూచించారు. ఇందుకోసం 42 ఎన్-రూట్ (జుఅ-తీశీబ్వ) మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా హనుమకొండ - మేడారం రూట్‌లో అత్యధికంగా 9 క్యాంపులు, ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చే భక్తుల కోసం 6 క్యాంపులు, భద్రాచలం రూట్‌లో 5 క్యాంపులు ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు.3,199 మందితో వైద్య సైన్యంగత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి భారీగా వైద్య సిబ్బందిని మోహరించాలని మంత్రి ఆదేశించారు. పూర్వ వరంగల్, ఖమ్మం జిల్లాల నుంచి మొత్తం 3,199 మంది సిబ్బందిని విధుల్లోకి తీసుకున్నామని అధికారులు తెలిపారు. ఇందులో 72 మంది స్పెషలిస్టులు, 42 మంది లేడీ డాక్టర్లతో కలిపి 544 మంది వైద్యులు విధుల్లో ఉంటారు. వీరికి తోడుగా 2,150 మంది పారామెడికల్ సిబ్బంది (నర్సులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు) షిఫ్టుల వారీగా 24 గంటల పాటు సేవలు అందించనున్నారు.అత్యవసర సేవలకు 35 అంబులెన్సులుగుండెపోటు, ప్రమాదాల వంటి అత్యవసర సమయాల్లో గోల్డెన్ అవర్లో చికిత్స అందించేలా 35 అంబులెన్సులను సిద్ధం చేశామని ధికారులు తెలిపారు. మెరుగైన వైద్యం అవసరమైతే పేషెంట్లను ములుగు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌కు, వరంగల్ ఎంజీఎంలకు తరలించాలని మంత్రి సూచించారు. ఈ రెండు హాస్పిటళ్లలో నెల రోజుల పాటు డాక్టర్లు, సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు.మందుల కొరత రాకూడదుచిన్నపిల్లల మందుల దగ్గరి నుంచి పాముకాటు విరుగుడు ఇంజెక్షన్ల వరకు 248 రకాల మందులు, సర్జికల్ సామాగ్రిని ద్వారా ముందస్తుగానే సిద్ధం చేసినట్లు అధికారులు మంత్రికి వివరించారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే జనవరి 25వ తేదీ నుంచి అన్ని వైద్య శిబిరాలు పూర్తిస్థాయిలో పనిచేసేలా ప్రణాళిక రూపొందించామన్నారు. ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి, క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. తక్షణమే మేడారం వెళ్లి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించాలని పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవీందర్ నాయక్‌ను మంత్రి ఆదేశించారు.

## ఈ నెల 12, 13 తేదీల్లో జీహెచ్ఎంసీ పరిధిలో మెగా ఈ-వేస్ట్ సానిటేషన్ డ్రైవ్:జీహెచ్ఎంసీ కమిషనర్




హైదరాబాద్, 10 జనవరి, 2026: స్వచ్ఛ భారత్ మిషన్లో భాగంగా మెగా ఈ-వేస్ట్ శానిటేషన్ డ్రైవ్ ను జనవరి 12, 13 తేదీల్లో నగరవ్యాప్తంగా 300 వార్డుల్లో నిర్వహించనున్నట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ తెలిపారు.ఈ డ్రైవ్ ద్వారా ప్రజల్లో ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించడంతో పాటు, నివాస, వాణిజ్య, ప్రజా ప్రాంతాల నుంచి ఈ-వేస్ట్‌ను సేకరించి శాక్ష్మయంగా ప్రాసెస్ చేస్తారు.ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషీన్లు, ఏసీలు, కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లు, టీవీలు, బ్యాటరీలు, యూపీఎస్‌లు, పవర్ బ్యాంకులు వంటి వివిధ రకాల ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఈ డ్రైవ్‌లో సేకరించనున్నారు.నిన్నటి నుంచే పారిశుద్ధ్య సిబ్బంది, ఆర్‌డబ్ల్యూఏలు, ఎన్‌జీవోలు, స్వయం సహాయక సంఘాల మహిళలతో కలిసి ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రతి వార్డులో తాత్కాలిక ఈ-వేస్ట్ సేకరణ కేంద్రాలను గుర్తించారు.ఈ డ్రైవ్‌ను విజయవంతం చేయాలని జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, పారిశుద్ధ్య అధికారులకు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ ఆదేశాలు జారీ చేశారు. నగర వ్యాప్తంగా విస్తృత ప్రచారంకమిషనర్ ఆదేశాల మేరకుమెగా ఈ-వేస్ట్ సానిటేషన్ డ్రైవ్ ను సక్సెస్ చేసేందుకు నగర వ్యాప్తంగా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు.అన్ని జోన్లు , సర్కిల్ లలో క్షేత్ర స్థాయిలో మైక్ ల ద్వారా డ్రైవ్ ప్రాధాన్యత ప్రజలకు తెలిసేలా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు.

## అనధికార ప్రకటనల తొలగింపుకు జీహెచ్ఎంసీ ప్రత్యేక డ్రైవ్




హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధిహైదరాబాద్, జనవరి 10, 2026:జీహెచ్ఎంసీ పరిధిలోకి పలు మున్సిపాలిటీల విలీనానంతరం, నగరంలోని వివిధ ప్రాంతాల్లో అనధికార ప్రకటనలు ఉన్నట్లు గుర్తించామని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ శనివారం తెలిపారు.మున్సిపల్ నిబంధనల ఉల్లంఘనల నేపథ్యంలో, అనధికార ప్రకటనలను గుర్తించి తొలగించేందుకు జీహెచ్ఎంసీ ఈ డ్రైవ్‌ను ప్రారంభించిందన్నారు. ఈ డ్రైవ్‌లో భాగంగా ఇప్పటికే పలు అక్రమ ర్డింగ్‌లు, బ్యానర్లు తదితర అనధికార ప్రకటనలను తొలగించినట్లు ఆయన వెల్లడించారు.ప్రజా భద్రత, నగర సుందరీకరణను కూడా దృష్టిలో పెట్టుకునిజీహెచ్ఎంసీ పరిధి అంతటా ఈ డ్రైవ్ నుదశలవారీగా, నిరంతరంగా కొనసాగిస్తామని కమిషనర్ స్పష్టం చేశారు.అనధికార ప్రకటనలపై పర్యవేక్షణ, నియంత్రణ, చర్యల కోసం ప్రత్యేక ఎన్ ఫోర్స్ మెంట్ బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు.నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రకటనదారులు, ప్రకటన ఏజెన్సీలు, భవన యజమానులు తప్పనిసరిగా నిబంధనలను పాటిస్తూ అవసరమైన అనుమతులు పొందిన తర్వాతే నిర్మాణాలు, ప్రకటనలు ఏర్పాటు చేయాలని కమిషనర్ కోరారు.

# ఏపీలో ఎక్కడ చూసినా సంక్రాంతి శోభ

తిరుపతి, జనవరి 10, ఆంధ్రప్రదేశ్‌లో సంక్రాంతి సందడి ఈసారి సరికొత్త శోభను సంతరించుకుంది. వైసీపీ ఐదేళ్ల పాలనలో పండుగ అంటే కేవలం కాసినోలు, కోడి పందాలు, జూద వినోదాలే అన్నట్లుగా సాగిన పరిస్థితి నుంచి, నేడు తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా రాష్ట్రం కళకళలాడుతోంది. పాలకుల ఆలోచనా ధోరణి మారితే ప్రజల ఉత్సాహం ఎలా ఉంటుందో ప్రస్తుత ఏపీ వేడుకలే నిదర్శనంగా నిలుస్తున్నాయి.రాజధాని అమరావతి పరిధిలోని విజయవాడ పున్నమి ఘాట్, భవానీ ద్వీపంలో ప్రభుత్వం ఆవకాయ్-అమరావతి సినిమా, సంస్కృతి, సాహిత్యోత్సవం నిర్వహిస్తోంది. తెలుగువారి ఐకానిక్ రుచి ఆవకాయ పేరుతో జరుగుతున్న ఈ వేడుకల్లో సాహిత్యం, కళలు, సినిమా విశ్లేషణలు , సాంస్కృతిక కార్యక్రమాలతో కృష్ణమ్మ తీరం ఆధ్యాత్మిక, సామాజిక చైతన్యానికి వేదికైంది. జూదానికే పరిమితం కాకుండా, తెలుగు మేధో సంపత్తిని ప్రపంచానికి చాటాలనే లక్ష్యం ఇక్కడ కనిపిస్తోంది.డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తన సొంత నియోజకవర్గమైన పిఠాపురాన్ని పీఠికాపురం పేరిట ఆధ్యాత్మిక, సంప్రదాయ వేడుకలకు కేంద్రంగా మార్చారు. మూడు రోజుల పాటు జరిగే ఈ సంక్రాంతి మహోత్సవంలో గంగిరెద్దుల ఆటలు, హరిదాసుల కీర్తనలు, జానపద కళారూపాలతో పాతకాలపు పల్లెటూరి పండుగ వాతావరణాన్ని తలపిస్తోంది. పీఠికాపురం పురావైభవాన్ని గుర్తు చేస్తూ సాగుతున్న ఈ వేడుకలు స్థానికుల్లో అపూర్వమైన ఉత్సాహాన్ని నింపాయి.గతంలో పండుగ రోజుల్లో అశ్లీల నృత్యాలు, అక్రమ జూద కేంద్రాలతో భయానక వాతావరణం ఉండేదన్న విమర్శలు ఉండేవి. కానీ ఇప్పుడు ప్రభుత్వం అధికారికంగా సాంస్కృతిక ఉత్సవాలను ప్రోత్సహిస్తుండటంతో సామాన్య ప్రజలు కుటుంబాలతో కలిసి పండుగను ఆస్వాదిస్తున్నారు. హరిదాసుల దీవెనలు, ముగ్గుల పోటీలు, సంప్రదాయ వంటకాలతో ప్రతి ఇల్లు ఒక కళానిలయంగా మారింది. ఇది కేవలం పండుగ మార్పు మాత్రమే కాదు, రాష్ట్రంలో వచ్చిన పాలనాపరమైన మార్పుకు ప్రతిబింబం.ఏపీలో ఇప్పుడు కనిపిస్తున్న సంక్రాంతి కళ కేవలం వినోదం కోసం మాత్రమే కాదు, అది తెలుగు జాతి మూలాలను గౌరవించే ఒక గొప్ప ప్రయత్నం. పాలకుల ప్రాధాన్యతలు మారినప్పుడు, సమాజంలో నైతిక విలువల కంటే సంస్కృతికి పెద్దపీట వేసినప్పుడు ప్రజల్లో ఇలాంటి నిజమైన పండుగ కళ కనిపిస్తోంది.

# అసెంబ్లీలో రప్పా...రప్పా రాజకీయం

నెల్లూరు, జనవరి 10, అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ఫిబ్రవరిలో జరగనున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటుతోంది. ప్రతిపక్ష హోదా ఇవ్వనిదే సభకు హాజరుకామని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేసింది. ఇప్పటికీ అదే స్టాండ్ తో ఉంది. మరోవైపు వరుసగా పని దినాలు కలుపుకొని శాసనసభకు 60 రోజులపాటు హాజరు కాకుంటే ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ వేటు పడే అవకాశం ఉంది. ఇప్పటికే శాసనసభ ఎథిక్స్ కమిటీ సమావేశం జరిగింది. వైసీపీ ఎమ్మెల్యేల గైర్హాజరుపై చర్చించారు. ప్రభుత్వానికి నివేదించనున్నారు. స్పీకర్ ద్వారా మరోసారి నోటీసులు జారీ చేసే అవకాశం ఉంది. సాధారణంగా అసెంబ్లీ శీతాకాల సమావేశాలు నవంబర్ నుంచి జనవరి మధ్య జరగాలి. కానీ ఈసారి ఆలస్యం జరిగింది. ఫిబ్రవరిలో సమావేశాలు ఉంటాయని తెలుస్తోంది. దాదాపు పది రోజులపాటు సభను కొనసాగించాలని స్పీకర్ నిర్ణయించినట్లు సమాచారం.అయితే ఈసారి కూటమి ప్రభుత్వం శాసనసభ సమావేశాల్లో వ్యూహాత్మకంగా వ్యవహరించనున్నట్లు తెలుస్తోంది. గడిచిన ఏడాదిన్నర కాలంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు గురించి సమగ్రంగా వివరించనున్నారు ఈ సభ ద్వారా. అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్ట్, విశాఖలో పరిశ్రమల ఏర్పాటు, ఏపీకి భారీగా వస్తున్న ప్రాజెక్టులు, తయారీ రంగం పరిశ్రమలు.. ఇలా ప్రతి అంశం గురించి సమగ్రంగా చర్చించే వీలుగా సభలు ఉండనున్నాయి. అర్థవంతమైన చర్చకు తెర లేపనున్నారు. ముఖ్యంగా విపక్ష పాత్రను కూడా అధికార పార్టీ ఎమ్మెల్యేలు పోషించనున్నారు. ప్రజల తరఫున బలమైన వాయిస్ వినిపించి ప్రభుత్వం నుంచి సమాధానాలు రాబట్టనున్నారు. అందుకే లోతైన అధ్యయనం చేయాలని పార్టీ ఎమ్మెల్యేలకు చంద్రబాబు సూచించారు. మంత్రులు కూడా సమగ్ర వివరాలతో సభకు హాజరుకావాలని ఇప్పటికే సంకేతాలు పంపించారు.ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చిన నాటికి రాష్ట్ర పరిస్థితి ఎలా ఉంది? ఇప్పుడు ఎలా ఉంది అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ఇచ్చే అవకాశం ఉంది. ఎందుకంటే ఇటీవల పెట్టుబడులను ఆకర్షించడంలో ఏపీ దేశంలోనే ప్రథమ స్థాయిలో నిలిచింది. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రాష్ట్రాలకు వచ్చిన పెట్టుబడుల ప్రతిపాదనల్లో.. 25% ఏపీకి రావడం నిజంగా శుభపరిణామం. ఇందులో సగం పెట్టుబడులు వచ్చిన ఏపీ అభివృద్ధి సాధించినట్టే. మరోవైపు కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా ఉంది. కూటమి ప్రభుత్వం చెప్పినట్టే ఒకవైపు అభివృద్ధి.. మరోవైపు సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ అడుగులు వేస్తోంది.

అమరావతి రాజధానితోపాటు పోలవరం ప్రాజెక్ట్ వంటి ప్రాధాన్యతాంశాలను పూర్తిచేసేందుకు గట్టి ప్రయత్నాల్లోనే ఉంది. మొన్ననే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ట్రయల్ రన్ పూర్తి చేసుకుంది.

అయితే వైసీపీ నుంచి మాత్రం అంతా తామే చేసాం అన్నట్టు వాయిస్ వస్తోంది. అందుకే దాదాపు పది రోజులపాటు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించి.. ప్రజలకు వాస్తవాలు తెలియజేసేందుకు ప్రభుత్వం సిద్ధపడుతోంది.

# స్పైలుగా చిన్నారులు..
# మారని పాకిస్తాన్ వైఖరి

న్యూఢిల్లీ, జనవరి 10, (న్యూస్ పల్స్) పాకిస్తాన్‌కు ఎన్నిసార్లు బుద్ధి చెప్పినా తీరు మార్చుకోవడం లేదు. ఉగ్రవాద సంస్థలతోపాటు ఐఎస్ఐతో కుట్రలు చేస్తూనే ఉంది. తాజాగా ఐఎస్ఐ కుట్రను మన భద్రతా బలగాలు గుర్తించాయి. అయితే ఇందులో అభం శుభం తెలియని 15 ఏళ్ల పిల్లలు ఉండడం ఆందోళన కలిగిస్తోంది. పఠాన్‌కోట్‌లో 15 ఏళ్ల బాలుడిని పోలీసులు అరెస్టు చేశారు. సాధారణ జీవితం గడుపుతున్న అతను రక్షణ స్థావరాలు, భద్రతా సిబ్బంది ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పంచాడు. ఈ ఘటన ఐఎస్ఐ ఆన్‌లైన్ గ్రూమింగ్ వ్యూహాన్ని బయటపెట్టింది.జమ్మూ సాంబార్ ప్రాంతం నుంచి పఠాన్‌కోట్‌లోని బంధువుల ఇంటికి వచ్చిన ఈ అబ్బాయి వివిధ చోట్ల తిరిగి ఫొటోలు, వీడియోలు సేకరించాడు. రక్షణ శాఖ ఆఫీసులు, నివాసాలు, వాహనాలు లక్ష్యాలు. పోలీసు విచారణలో సోషల్ మీడియా గ్రూపుల్లో అజ్ఞాతుల సూచనలపై ఇలా చేశాడు. ఫొటోలు, వీడియోలను ఓ గ్రూపులో పోస్టు చేశాడు. బాలుడి తండ్రి చనిపోయి పేదరికంలో ఉన్నాడు. ఐఎస్ఐ ఏజెంట్లు డబ్బు పంపుతూ సమాచారం సేకరించారు.ఆన్‌లైన్ గ్రూమర్లు పిల్లలను ఆకర్షించి నేరాలకు ప్రేరేపిస్తారు. ఇలాంటి బాలురు ఐఎస్ఐకి మిలిటరీ కదలికలు, ఆయుధాల వివరాలు సరఫరా చేస్తున్నారు. పఠాన్‌కోట్ ఎయిర్ బేస్, సరిహద్దు రక్షణ వ్యవస్థలు కీలకం. 2016 జైష్ దాడి ఇక్కడే జరిగింది.అంబాలాలో ప్రైవేటు ఉద్యోగిని అరెస్టు చేశారు. మిలిటరీ పాస్‌తో లోపలికి వెళ్లి సరుకులు అందించే సందర్భంలో ఐఎస్ఐ హనీట్రాప్, బ్లాక్‌మెయిల్‌తో సమాచారం సేకరించింది. 15?16 ఏళ్ల పిల్లలను కూడా ఉపయోగిస్తున్నారు.ఈ ఘటనలు భద్రతా ఏజెన్సీలను హెచ్చరికలో ఉంచాయి. పిల్లల ద్వారా సమాచారం సేకరణ కొత్త ఆందోళన. రక్షణ స్థాపనల చుట్టూ పరిశీలనలు పెరిగాయి. పోలీసులు మైనర్‌పై చర్యలు తీసుకుంటూ గ్రూమర్లను గుర్తించాలని ప్రయత్నిస్తున్నారు. పిల్లలను లక్ష్యంగా చేసుకున్న ఈ వ్యూహం జాతీయ భద్రతకు సవాలు. తల్లిదండ్రులు, సమాజం ఆన్‌లైన్ కార్యకలాపాలపై అవగాహన పెంచుకోవాలి. భద్రతా దళాలు సోషల్ మీడియా మానిటరింగ్‌ను బలోపేతం చేయాలి.

# మంత్రుల ప్రేమ వ్యవహారం...

హైదరాబాద్, జనవరి 10, 10 సంవత్సరాల తర్వాత కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. అలాగని జనాలు వన్ సైడ్ విక్టరీని కాంగ్రెస్ పార్టీకి అందించలేదు. గులాబీ పార్టీ బలమైన ప్రతిపక్షంగా ఇప్పటికీ ఉంది. పార్లమెంటు ఎన్నికల్లో 0 సీట్లు వచ్చినప్పటికీ.. సర్పంచ్ ఎన్నికలలో సత్తా చూపించలేకపోయినప్పటికీ? సోషల్ మీడియాలో మాత్రం కాంగ్రెస్ పార్టీ గులాబీ పార్టీ కంటే అత్యంత బలంగా ఉంది. వాస్తవానికి ఈ విషయంలో రేవంత్ రెడ్డి ఒక విఫల ముఖ్యమంత్రి. ఇక మిగతా మంత్రుల సంగతి గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది.నేటి కాలంలో సోషల్ మీడియాలో వచ్చే ప్రతి ఆరోపణకు అధికార పార్టీ నుంచి కౌంటర్ ఉండాల్సిందే. అవసరమైతే ఆ కౌంటర్ చాలా సాలిడ్ గా ఉండాలి. దీనికోసం అనేక వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలి. ప్రభుత్వం నుంచి అమలవుతున్న పథకాలను పకడ్బందీగా ప్రచారం చేసుకోవాలి. అదే సమయంలో గులాబీ పార్టీ చేసే విష ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పి కొట్టాలి. కానీ ఇది అధికార కాంగ్రెస్ పార్టీకి ఏమాత్రం చేతకావడం లేదు. పైగా ఆ పార్టీ సోషల్ మీడియా వింగ్ అత్యంత దారుణమైన ప్రదర్శన చేస్తోంది. కౌంటర్ ఇవ్వడం కాదు కదా కనీసం.. తనను తాను కాపాడుకోవడం కూడా ఆ పార్టీకి, ఆ ఆ పార్టీ సోషల్ మీడియాకు ఏమాత్రం చేతకావడం లేదు.తాజాగా గులాబీ పార్టీ అనుకూల సోషల్ మీడియా తెలంగాణ మంత్రుల మీద విష ప్రచారం మొదలుపెట్టింది. ఏకంగా ఆ మంత్రులు తమ స్థాయిని మర్చిపోయి, తమ వయసును మర్చిపోయి ప్రేమ వ్యవహారాలు సాగిస్తున్నారని బాంబు పేల్చింది. ఇటీవల సెక్రటేరియట్లో ఓ అధికారి షాడో గా వ్యవహరిస్తున్నారని.. పై స్థాయిలో అండదండలు ఉండడంతో క్యాబినెట్ స్థాయిలో ప్రోటోకాల్ ఇస్తున్నామని చెబుతున్నారని రాజ్ టీవీ ఒక సంచలన కథనాన్ని ప్రసారం చేసింది. దానిని మర్చిపోకముందే ఎన్టీవీ నల్గొండకు సంబంధించిన ఓ మంత్రికి వ్యవహారాన్ని కథనం రూపంలో ప్రసారం చేసింది. నల్గొండ జిల్లా చెందిన ఓ మంత్రి.. ఓ కలెక్టర్ విషయంలో పిచ్చిపిచ్చిగా ప్రవర్తించారని.. ఆమెతో ప్రేమ వ్యవహారం కూడా సాగించారని.. ఎన్టీవీ ఆ కథనంలో ప్రసారం చేసింది.

అయితే ఆ ప్రాంతం నుంచి వేరే ప్రాంతానికి ఆ కలెక్టర్ ను ప్రభుత్వం బదిలీ చేయించిందని ఎన్ టీవీ ప్రసారం చేసిన కథనంలో పేర్కొంది.రాజ్ టీవీ, ఎన్ టివి ప్రసారం చేసిన కథనాలను గులాబీ పార్టీ సోషల్ మీడియా తనకు అనుకూలంగా మార్చుకుంది. ఈ కథనాలకు కాస్త మసాలా జోడించి ఆ పార్టీ సోషల్ మీడియా అడ్డగోలుగా ప్రచారం చేయడం మొదలుపెట్టింది. తెలంగాణ రాష్ట్రంలో మంత్రులు ప్రేమ వ్యవహారాలలో మునిగి తేలుతున్నారని.. ఏకంగా సెక్రటేరియట్లో ఓ అధికారి తనకు పై స్థాయి అండ ఉందని ప్రచారం చేసుకుంటున్నారని.. అందువల్లే అధికారులు ఆమెకు క్యాబినెట్ స్థాయి ప్రోటోకాల్ ఇస్తున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి.మరోవైపు కరీంనగర్ జిల్లాకు చెందిన ఓ మంత్రి మహిళా అధికారులను వేధిస్తున్నారని.. కనీసం సీనియర్ మహిళా విలేకరులను కూడా వదిలిపెట్టడం లేదని.. ప్రేమ పేరుతో వేధింపులకు గురి చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇందులో వాస్తవాలు ఎలా ఉన్నప్పటికీ గులాబీ పార్టీ సోషల్ మీడియా మాత్రం విపరీతంగా ప్రచారం మొదలుపెట్టింది. మరి దీనికి కాంగ్రెస్ పార్టీ ఎలాంటి కౌంటర్ ఇస్తుంది? అనే ప్రశ్నకు ఇప్పుడు సమాధానం లభించాల్సి ఉంది.

# భారత్ ను టార్గెట్ చేసిన ట్రంప్



న్యూఢిల్లీ, జనవరి 10, (న్యూస్ పల్స్ ట్రంప్ పాలిటిక్స్‌లో కొత్త మలుపు ఇది. వెనుజువెలాలోకి అమెరికా సైనికులను పంపించి ఆ దేశ అధ్యక్షుడు నికోలస్ మదురోను, ఆయన భార్యను కిడ్నాప్ చేశారు. ఈ క్రమంలో ఆ దేశంలోని చైనా, రష్యా డిఫెన్స్ సిస్టం విఫలమయ్యాయి. దీంతో అమెరికా ఆపరేషన్ విజయవంతమైంది. దీంతో ట్రంప్‌కు అహంకారం తలకెక్కింది. దీంతో క్యూబా, ఇరాన్, కొలంబియా, మెక్సికోతోపాటు భారత్‌ను టార్గెట్ చేశారు.వెనెజువెలాలో మదురో దంపతులను లక్ష్యంగా చేసుకుని యుఎస్ విజయవంతమైంది. రష్యా ఎస్?300, చైనా రాడార్లు అమెరికా చొరబాటును పసిగట్టలేకపోయాయి. దీంతో యుఎస్ ఆయుధాల ఆధిపత్యాన్ని నిరూపించింది. ఈ సంఘటన ఆయిల్ వనరులపై యుఎస్ ఆకాంక్షలను స్పష్టం చేస్తోంది. వెనుజువెలాలోని 303 బిలియన్ బ్యారెళ్ల క్రూడ్ ఆయిల్‌ను తరలించుకుపోవడానికి యుఎస్ కంపెనీలను ట్రంప్ ప్రోత్సహిస్తున్నారు. వెనుజువెలాలో విజయం తర్వాత ట్రంప్ ఇప్పుడు మరో ఐదు దేశాలపై ఫోకస్ పెట్టాడు.వెనెజువెలాపై ఆధారపడి ఉన్న క్యూబాను త్వరగా కూల్చివేస్తామని ట్రంప్ ప్రకటించారు. ఆయిల్ సరఫరాలు ఆగిపోతే ఇది సులభమవుతుందని వ్యూహం. అందుకే క్యూబాను ఫస్ట్ టార్గెట్ చేశారు. క్యూబాకు చెందిన మచాడో కూడా అమెరికాకు మద్దతు ఇస్తున్నారు.ఇరాన్‌పై మునుపటి దాడుల్లోనూ రష్యన్ టెక్నాలజీ విఫలమైంది. కొలంబియా అధ్యక్షుడు పెట్రోతో మాటల యుద్ధం ఉధృతమైంది. ఈ దేశాల్లో పాలన మార్పులు లక్ష్యంగా యుఎస్ ఒత్తిడి పెరుగుతోంది. కానీ పెట్రో బలంగా నిలబడ్డారు. ట్రంప్‌కు సవాల్ చేస్తున్నారు. అయితే కొలంబియా మెక్సికో పక్కనే ఉంది. అందుకే దానిని కూడా ఆక్రమించి చూస్తున్నారు. అమెరికా కోర్టుల ప్రకారం ఇవి తప్పు చేస్తున్నాయి కాబట్టి అక్కడి ప్రభుత్వాలను కూలుస్తామని ట్రంప్ అంటున్నారు.అక్రమ వలసలు, మాదకాలు కారణంగా మెక్సికోను లక్ష్యంగా చేసుకుని యుఎస్ సైనిక చర్యలు ఆలోచిస్తోంది. సరిహద్దు భద్రతకు ఇది ముఖ్యమని ట్రంప్ వాదననాటో సభ్య దేశమైన డెన్మార్క్ భూభాగం గ్రీన్‌లాండ్‌ను యుఎస్ కోరుతోంది. భద్రతా కారణాలతో ఈ డిమాండ్ ప్రపంచవ్యాప్త చర్చనీయాంశం. ఇది యుఎస్ ప్రభావాన్ని ఈ ప్రాంతంలో విస్తరించే అవకాశాన్ని కల్పిస్తుంది.ట్రంప్?మోదీ మధ్య వ్యాఖ్యలు ఉధృతమవుతున్నాయి. రష్యా నుంచి ఆయిల్ దిగుమతులు, టారిఫ్‌లు, మొక్కజొన్న వ్యాపారం విషయాల్లో యుఎస్ ఒత్తిడి పెరిగింది. షెల్ ఆయిల్ కొనుగోళ్లకు భారత్‌ను లక్ష్యంగా చేసుకుంటోంది. భారత్ మౌనంగా ఉండి స్వంత ఆస్థాను కాపాడుకుంటోంది. యుఎస్ ఆయుధాలు అమ్మకాలకు ఈ సంఘటనలు ప్రచారం చేస్తున్నాయి. మోదీ తనను బతిమాడుతున్నాడని ట్రంప్ చెప్పుకుంటున్నారు.

# రాజాసాబ్ అంచనాలు తలకిందులు

హైదరాబాద్, జనవరి 10, రెబల్ స్టార్ ప్రభాస్ హీరో గా నటించిన 'రాజా సాబ్' చిత్రం నిన్న ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాల నడుమ విడుదలై నెగిటివ్ టాక్ ని సొంతం చేసుకుంది. ఆ నెగిటివ్ టాక్ ప్రభావం నూన్, మ్యాట్నీ షోస్ మీద చాలా బలంగా పడింది కానీ, ఫస్ట్ షోస్ నుండి కాస్త పికప్ అయ్యాయి. ఇక సెకండ్ షోస్ అయితే అన్ని సెంటర్స్ లో దుమ్ము దులిపేసింది. ఫ్లాప్ టాక్ వల్ల ఘోరమైన డిజాస్టర్ ఓపెనింగ్స్ వస్తాయని అంతా అనుకున్నారు కానీ, ప్రభాస్ పరువు నిలబెట్టే ఓపెనింగ్ ని చివరికి సొంతం చేసుకుంది. ముఖ్యంగా నైజాం ప్రాంతం లో ఈ చిత్రం చాలా డీసెంట్ వసూళ్లను నమోదు చేసుకుంది. ప్రీమియర్ షోస్ భారీగా లేకపోవడం ఈ సినిమాకు చాలా ప్లస్ అయ్యింది ఈ ప్రాంతంలో. ఓవరాల్ గా వరల్డ్ వైడ్ గా ఈ చిత్రానికి గ్రాస్ వసూళ్లు వచ్చాయో ఒకసారి చూద్దాం.ట్రేడ్ పండితులు అందిస్తున్న సమాచారం ప్రకారం చూస్తే ఈ చిత్రానికి నైజాం ప్రాంతం లో మొదటి రోజు 18.6 కోట్ల రూపాయిల గ్రాస్ వసూళ్లు వచ్చాయి. షేర్ వసూళ్లు దాదాపుగా 12 కోట్ల రూపాయిల వరకు ఉంటుందని అంచనా. అదే విధంగా ఆంధ్రా + సీడెడ్ ప్రాంతం నుండి 34 కోట్ల రూపాయిల గ్రాస్ వసూళ్లు వచ్చాయని అంటున్నారు. ఓవరాల్ గా తెలుగు రాష్ట్రాల నుండి 52.6 కోట్ల రూపాయిల గ్రాస్ వసూళ్లు, 34 కోట్ల రూపాయిల షేర్ వసూళ్లు వచ్చాయి. వచ్చిన టాక్ కి ఇది చాలా డీసెంట్ షేర్ వసూళ్లు అనే చెప్పాలి. ఇక ఓవర్సీస్ ప్రాంతం నుండి ఈ చిత్రానికి కేవలం 27 కోట్ల రూపాయిల గ్రాస్ వసూళ్లు మాత్రమే వచ్చాయి. అదే విధంగా కర్ణాటక ప్రాంతం నుండి 6 కోట్లు, రెస్ట్ ఆఫ్ ఇండియా నుండి 8 కోట్ల రూపాయిల గ్రాస్ వసూళ్లు వచ్చాయి.ఓవరాల్ వరల్డ్ వైడ్ గా ఈ చిత్రానికి 93.6 కోట్ల రూపాయిల గ్రాస్ వసూళ్లు నమోదు అయ్యింది. తెలుగు రాష్ట్రాల్లో రామ్ చరణ్ 'గేమ్ చేంజర్', పవన్ కళ్యాణ్ 'హరి హర వీరమల్లు' చిత్రాలకంటే తక్కువ ఓపెనింగ్ వసూళ్లు వచ్చాయి కానీ , ఓవర్సీస్ ప్రాంతం లో ఆ రెండు సినిమాల కంటే డీసెంట్ వసూళ్లను నమోదు చేసుకోవడం తో ప్రభాస్ పరువుని నిలబెట్టే రేంజ్ ఓపెనింగ్ దక్కింది. ఆయన అభిమానులకు మొదటి రోజు వంద కోట్ల గ్రాస్ మిస్ అయ్యామే అనే బాధ ఉంటుంది కానీ, ఈ టాక్ తో కూడా ఈ రేంజ్ గ్రాస్ ని రాబట్టినందుకు ప్రభాస్ స్టార్ స్టేటస్ ని చూసి గర్వపడొచ్చు అనే చెప్పాలి.

# అఘోరి రోజు ఆదాయం 30 వేలు...

హైదరాబాద్, జనవరి 10, శవ్యాప్తంగా సంచలనం రేపిన 'అఘోరీ శ్రీనివాస్' ని అంత తేలికగా మర్చిపోగలమా?..మగవాడు అయినప్పటికీ లేడీ అఘోరీ గా మారి, మాయ మాటలు చెప్పి, అమాయకులను మోసం చేసి కోట్ల రూపాయిల సంపాదన అతి తక్కువ సమయం లోనే సంపాదించాడు. అంతే కాదు, ఇతను ఆడవాళ్లను లొంగదీసుకోవడం లో కూడా నేర్పరి. శ్రీ వర్షిణి అనే అందమైన అమ్మాయిని మాయ మాటలు చెప్పి తన వెంట తిరిగేలా చేసాడు. రెండు నెలల పాటు ఆ అమ్మాయి అతనితో కలిసి ప్రయాణం చేసింది. కుటుంబ సభ్యులు వర్షిణి కోసం వెతకాని ప్రదేశం అంటూ లేదు. అంతలా మాయ చేసి తన వెంట తీసుకొని వెళ్ళిపోయాడు. అయితే ఎట్టకేలకు అఘోరి శ్రీనివాస్ దుర్మార్గాలను గమనించిన పోలీసులు అతన్ని అదుపులో తీసుకున్నారు. అయితే రెండు నెలల పాటు అతనితో కలిసి తిరిగి శ్రీ వర్షిణి అనే అమ్మాయి, రీసెంట్ గా ఒక ఇంటర్వ్యూ ఇచ్చింది. ఈ ఇంటర్వ్యూ లో ఆమె మాట్లాడిన మాటలు చూస్తే ఆశ్చర్యపోక తప్పదు. ఆమె మాట్లాడుతూ 'రెండు నెలల పాటు నేను అతనితోనే ఉన్నాను. దేవాలయాలకు బాగా తిప్పేవాడు, అక్కడ ప్రసాదాలు తీసుకోవడం, పడుకోవాలని అనుకుంటే ఎక్కడైనా పెట్రోల్ బంక్ వద్ద కారు ఆపేసి నిద్రపోవడం వంటివి చేసేవాడు. మంచి ఫేమ్ ఉన్న వ్యక్తి కాబట్టి, భక్తులు ఆయన కారు స్టిక్కరింగ్ ని చూసే వచ్చేవాళ్ళు. ఒక్కొక్కరు 500 , లేదా వెయ్యి రూపాయిలు ఇవ్వడం, కారు కి పెట్రోల్ ఫుల్ ట్యాంక్ చేయించడం, ఫుడ్ తినిపించడం, ఖరీదైన బట్టలు పెట్టడం వంటివి చేసేవారు. అలా రోడ్డు మీద వెళ్తున్న సమయం లో అతనికి ఎవరో ఒకరు ఎంతో కొంత డబ్బులు ఇస్తూనే ఉండేవాళ్ళు. అలా రోజుకి అతను పాతిక నుండి 30 వేల రూపాయిలు సంపాదించేవాడు. పెట్రోల్ ఫ్రీనే, డబ్బు ఫ్రీనే, ఆహారం ఫ్రీనే, ఇంకేమి ఉంది చల్లగా ఒఆ పెట్టుకొని పాడుకోవడమే అతను చేసే పని' అంటూ చెప్పుకొచ్చింది.

ఇంత జరుగుతుంటే మీకు అతన్ని ఎప్పుడు ప్రశ్నించాలని అనిపించలేదా అని యాంకర్ అడిగిన ప్రశ్నకు, వర్షిణి సమాధానం చెప్తూ 'ఆశ్రమాన్ని నిర్మించాలని అనేవాడు. నేను అతన్ని అప్పట్లో గుడ్డిగా నమ్మేసాను, ఒక ట్రాన్స్ లోకి వెళ్ళిపోయాను. అతనే లోకం అంటూ తిరిగాను కదా, అందుకే అన్నీ నమ్మేదాన్ని' అంటూ చెప్పుకొచ్చింది. మీ కుటుంబ సభ్యులు నిన్ను అతి కష్టం మీద వెతికి మూడు వారాల తర్వాత ఇంటికి తిరిగి తీసుకొచ్చారు కదా, అప్పుడు మళ్ళీ మీరెందుకు పారిపోయారు అని యాంకర్ అడగ్గా 'దాదాపుగా పారిపోయాను అనే అనుకోండి, కానీ మధ్యలో కొంతమంది ఉన్నారు. వాళ్ళ వల్లే నేను వెళ్లాల్సి వచ్చింది' అంటూ చెప్పుకొచ్చింది.

# కమలం వైపు.. ఆ ఇద్దరు ఎమ్మెల్యేలు

నల్గొండ, జనవరి 10, రాబోయే ఎన్నికల వరకు మరింత బలపడి అధికారంలోకి రావాలని కలలు కంటున్న కమలనాథులు..దక్షిణ తెలంగాణలో పేరున్న నేతలను పార్టీలో చేర్చుకోవాలని భావిస్తున్నారట. ఇందులో భాగంగా నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై ఫోకస్ పెట్టిందట బీజేపీ. ఆ ఇద్దరు కూడా గతంలో బీజేపీలో పనిచేసిన ఎమ్మెల్యేలే అంటూ గాసిప్స్ చక్కర్లు కొడుతున్నాయ్.ఉత్తర తెలంగాణలో బీజేపీ స్ట్రాంగ్‌గా ఉంది. నార్త్ తెలంగాణలో మూడు ఎంపీ సీట్లు, ఏడు ఎమ్మెల్యే సీట్లు గెలుచుకున్న కమలనాథులు..గ్రాడ్యుయేషన్ టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా రెండు ఎమ్మెల్సీ స్థానాలను కైవసం చేసుకున్నారు. మొన్న జరిగిన సర్పంచ్ ఎన్నికల్లోనూ ఉత్తర తెలంగాణలో గతం కంటే ఎక్కువ స్థానాలే గెలుచుకున్నారు.దక్షిణ తెలంగాణలో ఒకరిద్దరు మినహా.. బీజేపీకి పెద్దగా పట్టున్న లీడర్లు లేరన్న అభిప్రాయం ఉంది. పైగా క్యాడర్ కూడా స్ట్రాంగ్ లేదని భావిస్తున్నారట. ఈ క్రమంలో దక్షిణ తెలంగాణలో కాస్త పేరున్న, ప్రజాబలం ఉన్న లీడర్లను..చేర్చుకుంటే..రాబోయే ఎన్నికల్లో సత్తా చాటొచ్చని ప్లాన్ చేస్తున్నారట. తెలంగాణలో అధికారంలోకి రావాలంటే..దక్షిణ తెలంగాణ జిల్లాలైన నల్లగొండ, మహబూబ్‌నగర్‌లో కూడా బలపడాలని లెక్కలు వేసుకుంటున్నారట కాషాయ నేతలు.ఈ క్రమంలో ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై ఫోకస్ పెట్టారట బీజేపీ లీడర్లు. దక్షిణ తెలంగాణకు చెందిన ఇద్దరు శాసనసభ్యులు..బీజేపీ స్టేట్ లీడర్లతో టచ్‌లో ఉంటున్నారట. నల్లగొండకు చెందిన ఓ కాంగ్రెస్ ఎమ్మెల్యే, పాలమూరుకు చెందిన మరో హస్తం పార్టీ ఎమ్మెల్యే..కొన్ని రోజులుగా వాళ్ల సొంత పార్టీ పెద్దలపై అసంతృప్తిగా ఉన్నారట. అడిగిన పనులు చేసి పెట్టడం లేదని..కోరుకున్న పదవులు ఇవ్వట్లేదని నిరుత్సాహంగా ఉన్నారట.ఈ క్రమంలోనే వాళ్లు అప్పుడప్పుడు సొంత పార్టీపై, సీఎం రేవంత్‌పై అసంతృప్తి గళం వినిపిస్తున్నారట. అలా కాంగ్రెస్ పార్టీలో కంఫర్ట్‌గా లేని ఆ ఇద్దరు ఎమ్మెల్యేలపైన కన్నేసిన కమలనాథులు తమవైపు తిప్పుకునే పనిలో పడ్డారట.హైదరాబాద్ జంట నగరాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఓ బీజేపీ ఎంపీ.. దక్షిణ తెలంగాణకు చెందిన మరో బీజేపీ మహిళా నాయకురాలు.. ఆ ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు టచ్‌లోకి వెళ్లినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

హస్తం పార్టీలో అసంతృప్తిగా ఉన్న ఆ ఇద్దరు ఎమ్మెల్యేలతో.. తమకు ఉన్న సాన్నిహిత్యం, పరిచయాలతో కమలం గూటికి చేర్చే ప్రయత్నం చేస్తున్నారట.

# ఆ ఐదుగురు ఎవరు...

హైదరాబాద్, జనవరి 10, తెలంగాణ క్యాబినెట్లో..ఇప్పుడు ఒకటే చర్చ. అమాత్యులపై ఆరోపణలు..వివాదాలతో..ఎవరి సీటుకు ఎసరు వస్తుందనేది హాట్ టాపిక్ అవుతోంది. ఇప్పటిదాకా ఖాళీగా ఉన్న రెండు బెర్తులపైనే ఆశలు పెట్టుకున్న ఎమ్మెల్యేలకు..ఇప్పుడు ఖాళీ కాబోయే బెర్తులూ కూడా ఊరిస్తున్నాయట. దక్షిణ తెలంగాణకు చెందిన సీనియర్ మంత్రి ఓ మహిళా అధికారితో నడిపిన..నడుపుతున్న వ్యవహారం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఎక్కడ చూసినా ఆ మంత్రెవరు..? ఆ అధికారెవరన్న చర్చే. ఆయన తెరచాటు వ్యవహారాలు..సర్కార్‌కు బ్యాడ్ నేమ్ తెచ్చిపెడుతున్నాయట. సదరు మంత్రి కారణంగా ఇద్దరు మహిళా అధికారుల బదిలీలు కూడా జరిగాయటపార్టీలో అందరికన్నా తానే సీనియర్ అని చెప్పుకునే ఆ సదరు అమాత్యుల వారికి సంబంధించిన పూర్తి డేటా..ఇంటలిజెన్స్ రిపోర్టు ఢిల్లీకి కూడా చేరిపోయిందట. దీంతో గత అసెంబ్లీ సమావేశాల్లో ఒంటికాలిపై లేచిన ఆ అమాత్యుడు..ఈ సెషన్‌లో పూర్తిగా సైలెంట్ అయిపోయారట. ఈ నేపథ్యంలోనే ఆయన కుర్చీకి ఎసరు తప్పదనే ప్రచారం జరుగుతోంది.ఇక దక్షిణ తెలంగాణకే చెందిన మరో సీనియర్ మంత్రిది ఇదే పరిస్థితి అంటున్నారు. ఎన్నికల ముందే హస్తం గూటికి చేరి..ఇప్పుడు అమాత్యులుగా ఉన్న ఆ మంత్రిగారికి కూడా ఉద్వాసన తప్పదంటున్నారు. ఆర్టీఐ ద్వారా తన శాఖలోని అధికారుల దందాలను ఆ మంత్రే బయట పెట్టడమే కారణమనే టాక్ నడుస్తోంది. వీరిద్దరూ తెలంగాణ ఉద్యమానికి తామే బ్రాండ్ అంబాసిడర్లం అని కూడా చెప్పుకునే నేతలే కావడం మరో విశేషం.ఇక మరో ఉత్తర తెలంగాణ మంత్రిది ఇంకో కథ. హైదరాబాద్‌లో అంతా తానై చక్రం తిప్పుతున్న సదరు మంత్రి చేష్టలు..సర్కార్‌కు హెడెక్‌గా మారాయట. మహిళా అధికారులు, నేతలతో జోక్‌లు..వింత పలుకులతో ఆయన తీరు చర్చనీయాంశంగా మారిందంటున్నారు. సదరు మంత్రి తీరుపై ఇప్పటికే కొందరు అధికారులు..సీఎంవో దృష్టికి తీసుకెళ్లారట. ఇది చాలదన్నట్లు..ఇటీవల ఒకరిద్దరు మహిళా జర్నలిస్ట్‌లతో కూడా ఆయన సన్నిహితంగా ఉంటూ..వాట్సప్ కాల్స్..ఇన్‌స్టాలో మెస్సేజ్‌లు పెడుతూ టీనేజర్‌గా మారిపోయారన్న గుసగుసలు విన్పిస్తున్నాయి. ఈ వ్యవహారంతో సదరు అమాత్యులవారికి ఉద్వాసన తప్పదన్న గుసగుసలు సెక్రటేరియట్లో రచ్చ రంబోలా చేస్తున్నాయి.

ఇంకో సీనియర్ మంత్రిపై కూడా?చిలిపి చేష్టలు, కరప్షన్ అలిగేషన్స్‌తో గందరగోళం నెలకొందట. సమైఖ్య రాష్ట్రంలోనే..సీనియర్ మోస్ట్ నేతగా ఉన్న ఆయనకు ఓ టైప్ ఆఫ్ డ్యాషింగ్ లీడర్‌గా పేరుంది. ఈ సదరు మంత్రితో సూటిగా మాట్లాడాలంటే..అధికారులే కాదు..తోటి లీడర్స్ కూడా జంకుతుంటారు. తన అనుకున్న వారిపై ట్రాన్స్‌ఫర్స్ గాలి సోకకుండా.. ప్రొటెక్టర్‌గా ఉంటుంటడం వెనుక ఏవో మతలబులున్నాయనే టాక్ నడుస్తోంది. అవినీతి ఆరోపణలు పెరిగిపోవడంతో ఆయనపై కూడా రిపోర్టులు రెడీ అయ్యాయని తెలుస్తోంది.ఉత్తర తెంగాణకు చెందిన మరో సీనియర్ మహిళా మంత్రి పదవి కూడా..క్యాబినెట్ విస్తరణలో గల్లంతు అవడం పక్కా అంటున్నారు. సర్కార్ ఏర్పడిన కొత్తలో ఈ సీనియర్ మంత్రి నోటి మాటతో రేవంత్ సర్కార్‌కు ఇబ్బందికర పరిస్థితి ఏర్పడగా..తన ఇంటి మనిషి అవినీతి వ్యవహారాన్ని వెనుకేసుకుని రావడం అప్పట్లో చర్చనీయాంశంగా మారింది. అది ఇప్పటికీ విపక్షాలకు అస్త్రంగా ఉంటూనే వస్తోంది. ఈ అంశాలన్నింటినీ పరిగణలోకి తీసుకుని ఆ మహిళా మంత్రిని క్యాబినెట్ నుంచి తప్పిస్తారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. దీంతో సదరు మహిళా మంత్రికి విస్తరణ మాట వింటే చాలు కంటి మీద కునుకు రావడం లేదట.ఐదుగురు మంత్రులకు ఉద్వాసన పలికితే..అప్పుడు కేబినెట్ లో ఖాళీ బెర్తుల సంఖ్య ఆరుకు చేరనుంది. అటు అజారుద్దీన్ స్థానం కూడా ఊగిసలాటలోనే ఉండటంతో కేబినెట్ లో బెర్తుల కోసం దాదాపు డజన్ మంది కాపు కాసుకుని కూర్చున్నారట. ఇప్పటికే ఈ లిస్ట్‌లో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ విజయశాంతి, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, కవ్వంపల్లి సత్యనారాయణ, ఆది శ్రీనివాస్ పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. వీరితో పాటు తొలిసారి ఎన్నికై అసెంబ్లీ లోపలా, బయట.. ఫైర్ బ్రాండ్ లీడర్లుగా ఎస్టాబ్లిష్ అవుతున్న మరికొందరు యువ ఎమ్మెల్యేలకు కూడా అదృష్టం కలిసి రావచ్చని టాక్ నడుస్తోంది.

# కాంగ్రెస్ గూటికేనా...

హైదరాబాద్, జనవరి 10, తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత శాసనమండలి వేదికగా తీసుకున్న నిర్ణయం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో పెను ప్రకంపనలు సృష్టిస్తోంది. తన రాజీనామాను ఆమోదించాల్సిందేనని ఆమె నిండు సభలో పట్టుబట్టడం, మండలి ఛైర్మన్ దాన్ని పునరాలోచించుకోవాలని సూచించడం వంటి పరిణామాలు ఒక పొలిటికల్ థ్రిల్లర్ ను తలపిస్తున్నాయి. అయితే, ఈ రాజీనామా వెనుక కేవలం అసంతృప్తి మాత్రమే ఉందా? లేక దీని వెనుక ఒక భారీ రాజకీయ వ్యూహం దాగి ఉందా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారిందిశాసనమండలిలో కవిత ప్రవర్తించిన తీరు బీఆర్ఎస్ శ్రేణులను సైతం విస్మయానికి గురిచేసింది. తన రాజీనామా లేఖను ఆమోదించాలని ఆమె ఛైర్మన్ ను కోరగా, తొందరపడవద్దని, నిర్ణయంపై పునరాలోచించుకోవాలని ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సూచించారు. అయినప్పటికీ, కవిత తన నిర్ణయానికి కట్టుబడి ఉంటారా లేక ఛైర్మన్ సూచన మేరకు వెనక్కి తగ్గుతారా అనేది ప్రస్తుతానికి సస్పెన్స్ గానే ఉంది. కానీ, సభలో ఆమె బీఆర్ఎస్ పార్టీ విధానాలపై, నాయకత్వంపై పరోక్షంగా నిప్పులు చెరిగిన తీరు చూస్తుంటే.. గులాబీ పార్టీతో ఆమె బంధం తెగిపోయినట్టేనని విశ్లేషకులు భావిస్తున్నారు.ఈ మొత్తం ఎపిసోడ్ లో కవిత చేసిన ఒక వ్యాఖ్య అత్యంత కీలకమైనది. "వచ్చే ఎన్నికల నాటికి 'జాగృతి' ఒక శక్తిగా రూపాంతరం చెందుతుంది, అందరూ ఆశీర్వదించాలి" అని ఆమె కోరడం వెనుక పెద్ద ప్లాన్ ఉందని అర్థమవుతోంది. తెలంగాణ ఉద్యమ సమయంలో సాంస్కృతిక సారథిగా ఉన్న తెలంగాణ జాగృతిని ఇప్పుడు పూర్తిస్థాయి రాజకీయ పార్టీగా మార్చే యోచనలో కవిత ఉన్నట్లు స్పష్టమవుతోంది. బీఆర్ఎస్ లో ఇన్నాళ్లుగా ఉన్న అసమ్మతిని, తనకంటూ ఉన్న వ్యక్తిగత క్యాడర్ ను జాగృతి వేదికగా ఏకం చేయడం ఆమె తక్షణ కర్తవ్యంగా కనిపిస్తోంది.కవిత కొత్త పార్టీ పెడతారన్న వార్తల నడుమ.. అత్యంత ఆసక్తికరమైన ప్రచారం విలీనం చుట్టూ తిరుగుతోంది. వైఎస్ జగన్ సోదరి షర్మిల మొదట 'వైఎస్ఆర్టీపీ' పేరుతో పార్టీ పెట్టి, ఆ తర్వాత దాన్ని కాంగ్రెస్ లో విలీనం చేసి, ఇప్పుడు పీసీసీ చీఫ్ గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇప్పుడు కవిత కూడా అదే బాటలో నడవబోతున్నారనే ఊహాగానాలు బలంగా వినిపిస్తున్నాయి.రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం.. కవిత నేరుగా కాంగ్రెస్ లో చేరడం కంటే, జాగృతిని పార్టీగా మార్చి, ప్రజల్లోకి వెళ్లాక, ఎన్నికల సమయానికి కాంగ్రెస్ లో విలీనం చేయడం వ్యూహాత్మకంగా మంచిదనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. దీనివల్ల అటు సొంత బలం నిరూపించుకోవడంతో పాటు, ఇటు కాంగ్రెస్ హైకమాండ్ వద్ద బార్గేనింగ్ పవర్ పెరుగుతుందన్నది అంచనా.ఈ ఊహాగానాలకు బలం చేకూరుస్తూ కాంగ్రెస్ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. కవిత కాంగ్రెస్ లోకి రావచ్చంటూ ఆయన చేసిన ప్రకటన.. తెరవెనుక జరుగుతున్న మంత్రాంగం బయటపడేలా చేసింది. బీఆర్ఎస్ ను, ముఖ్యంగా కేసీఆర్ కుటుంబాన్ని దెబ్బకొట్టడానికి కాంగ్రెస్ పార్టీ కవితను ఒక 'బ్రహ్మాస్త్రం'లా వాడుకోవాలని చూస్తున్నట్టు తెలుస్తోంది. కేసీఆర్ కుమార్తెనే కాంగ్రెస్ గూటికి చేరితే.. అది బీఆర్ఎస్ ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయడమే కాక, ప్రజల్లో ఆ పార్టీ విశ్వసనీయతను పూర్తిగా దెబ్బతీస్తుంది.మొత్తానికి కవిత రాజీనామా ఎపిసోడ్ కేవలం ఒక పదవికి సంబంధించిన విషయం కాదు. ఇది తెలంగాణ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చేసే ఒక భారీ ఆపరేషన్ కు నాందిగా కనిపిస్తోంది. రానున్న రోజుల్లో జాగృతి యాక్టివిటీ పెరగడం, బీఆర్ఎస్ పై కవిత విమర్శల దాడి తీవ్రతరం కావడం ఖాయంగా కనిపిస్తోంది. వచ్చే ఎన్నికల నాటికి ఈ రాజకీయ చదరంగంలో కవిత వేసే ఎత్తులు, దానికి కాంగ్రెస్ అందించే సహకారం.. బీఆర్ఎస్ ఉనికికే ప్రమాదంగా మారే అవకాశాలను కొట్టిపారేయలేం

# ఒకే రోజు..ఒకే ఊరిలో మూడు దొంగతనాలు

మేడ్చల్ ఒకే రోజు ఒకే ఊరిలో ఓ దుండగుడు మూడు చోట్ల దొంగతనాలకు పాల్పడి అందినకాడికి నగదును దోచుకెళ్ళిన సంఘటన శామీర్పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మాపూర్లో చోటుచేసుకున్నాయి. గ్రామంలోని మూడు చోట్ల ఒకే రోజు దొంగతనం జరగగా ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. లక్ష్మాపూర్ లో కిరాణ దుకాణం, ఎరువుల దుకాణం, ఆలయ హుండీని లక్ష్యంగా చేసుకుని గుర్తు తెలియని దుండగుడు షట్టర్ల తాళాలు పగులగొట్టి అందినకాడికి నగదు దోచుకెళ్లాడు. లక్ష్మాపూర్లో కిరాణా దుకాణం యజమాని గురువారం రాత్రి షాపు మూసి వెళ్లగా అర్ధరాత్రి సమయంలో దుండగుడు షట్టర్ తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించి కౌంటర్లో ఉన్న నగదును ఎత్తుకెళ్లాడు. ఫర్టిలైజర్ దుకాణం తాళాలు పగలగొట్టి సుమారు 40 వేల వరకు నగదు దోచుకెళ్లాడు. గ్రామపంచాయతీ ముందు ఉన్న శివాలయంలోని హుండీని పగులగొట్టి అందులోని డబ్బులను తీసుకుని, హుండీని కాళీ ప్రదేశంలో పడేసి వెళ్లాడు. ఉదయం షాపులు తెరవడానికి వచ్చిన యజమానులు తాళాలు విరిగివుండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, సీసీ కెమెరాల దృశ్యాల ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దొంగతనానికి గురైన దేవాలయం ఉండిని పరిశీలించారు. గ్రామంలో చోరీకి పాల్పడిన సంఘటనలు కొన్ని సీసీ కెమెరాలు దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# తిట్ల దండకంలో తండ్రినే మించిపోతున్న కేటీఆర్?




హైదరాబాద్, జనవరి 10, తెలంగాణ రాజకీయ యవనికపై ఇప్పుడు ప్రజా సమస్యల చర్చ కంటే.. వ్యక్తిగత దూషణలు, అసభ్య పదజాలమే ఎక్కువగా వినిపిస్తున్నాయి. ఒకప్పుడు ఉద్యమ సెగతో రగిలిన తెలంగాణ గడ్డపై ఇప్పుడు రాజకీయ కక్షలు ? బూతుల పర్వాలు రాజ్యమేలుతున్నాయి. ముఖ్యంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వైఖరి ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. తన తండ్రి కేసీఆర్ వేసిన తిట్ల బాటలో నడుస్తూ.. ఇప్పుడు ఆయననే మించిపోతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ వాడిన భాష ఒక ఆయుధంగా పనిచేసింది. సమైక్య పాలకులను ఉద్దేశించి ఆయన వాడిన పిచ్చోళ్లు, దెబ్బకు దెయ్యం వదులుతది వంటి పదాలు అప్పట్లో ఉద్యమకారుల్లో ఉత్సాహాన్ని నింపాయి. అయితే, అధికారం వచ్చాక కూడా అదే ధోరణి కొనసాగడంపై తీవ్ర విమర్శలు వచ్చాయి. చివరకు 2024 ఎన్నికల సమయంలో కేంద్ర ఎన్నికల సంఘం కూడా కేసీఆర్ వాడిన అన్ పార్లమెంటరీ భాషపై సీరియస్ అయ్యి నోటీసులు ఇచ్చిందంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.బీఆర్ఎస్ పదేళ్ల పాలనకు చెక్ పెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, అదే భాషా యుద్ధాన్ని కొనసాగిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా గానీ, బహిరంగ సభల్లో గానీ బీఆర్ఎస్ నేతలపై విరుచుకుపడుతున్నారు. 2025 డిసెంబర్ నాటి అసెంబ్లీ సమావేశాల్లో రేవంత్ రెడ్డి వాడిన కొన్ని పదాలు సభ్య సమాజాన్ని విస్మయానికి గురిచేశాయి. అలాగే సోషల్ మీడియా వేదికగా విమర్శలు చేసేవారిని బట్టలు ఊడదీసి పరేడ్ చేస్తాం అనడం ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ఒక ముఖ్యమంత్రికి తగదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.విదేశాల్లో చదువుకుని, కార్పొరేట్ శైలిలో రాజకీయాలు చేస్తారని పేరున్న కేటీఆర్.. ఓటమి తర్వాత పూర్తిస్థాయిలో రూటు మార్చారు. రేవంత్ రెడ్డి విమర్శలకు కౌంటర్ ఇచ్చే క్రమంలో ఆయన కూడా సంయమనం కోల్పోతున్నారు. తాజాగా ఖమ్మంలో కేటీఆర్ వాడిన పదజాలం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీలను కేటీఆర్ అసభ్యపదజాలంతో దూషించారు. రేవంత్ రెడ్డిని గూండాగిరి చేస్తున్నారని విమర్శిస్తూనే, కేటీఆర్ కూడా అదే స్థాయి పదజాలంతో విరుచుకుపడుతున్నారు. ఎక్స్ వేదికగా రాహుల్ గాంధీని టార్గెట్ చేస్తూ వ్యక్తిగత దూషణలకు దిగడం కేటీఆర్ ఇమేజ్‌కు డ్యామేజ్ కలిగిస్తోందనే వాదన వినిపిస్తోంది.రాజకీయాల్లో విమర్శలు ప్రతివిమర్శలు సహజం. కానీ, అవి లక్ష్మణ రేఖను దాటకూడదు. "రేవంత్ తిడుతున్నారు కాబట్టి మేము కూడా తిడతాం" అని బీఆర్ఎస్ సమర్థించుకోవడం ఆ పార్టీ నైతికతను దెబ్బతీస్తుంది. కేటీఆర్ లాంటి విద్యావంతుడైన నాయకుడు ఈ తిట్ల సంస్కృతికి చరమగీతం పాడి, ఒక కొత్త తరహా రాజకీయాలకు నాంది పలకాల్సిన అవసరం ఉంది. లేనిపక్షంలో, అధికార-ప్రతిపక్షాల మధ్య జరుగుతున్న ఈ బూతుల యుద్ధంలో అసలైన ప్రజాస్వామ్యం అపహాస్యం పాలవుతుంది. తెలంగాణ ప్రజలు చైతన్యవంతులు. వారు నేతల నోటి వెంట తిట్లు కాదు.. తమ సమస్యలకు పరిష్కారాలు కోరుకుంటున్నారు. ఈ నిజాన్ని నాయకులు ఎంత త్వరగా గ్రహిస్తే అంత మంచిది.

# ఖమ్మం, తాడేపల్లిలో పోస్టర్ల కలకలం

ఖమ్మం, జనవరి 10, లేటెస్ట్‌గా వైసీపీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి చేసిన వ్యాఖ్యలు మరింత ఇంట్రెస్టింగ్‌గా మారాయి. వైసీపీ క్యాడర్..తెలంగాణలో కేసీఆర్ గెలవాలని కోరుకుంటారని.. బీఆర్ఎస్ క్యాడర్ ఏపీలో జగన్ అధికారంలోకి రావాలని కోరుకుంటారని చెప్పారు. దీనికి ఆయన ఒక ఈక్వేషన్ కూడా చెప్పి చర్చకు దారి తీశారు. అదే దుష్మన్ కా దుష్మన్ అప్నా దోస్త్ అనే పాయింట్ తప్ప..వేరే కారణాలు ఏమి ఉండవంటూ ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నిజానికి తెలంగాణలో రేవంత్ సీఎం అయినప్పుడు కాంగ్రెస్ ర్యాలీల్లో ..రేవంత్ ఇంటి దగ్గర టీడీపీ జెండాలు కనిపించాయి. మరోవైపు జగన్ పర్యటనల్లో కేసీఆర్, కేటీఆర్ ఫోటోలు కనిపించడం కూడా పొలిటికల్ ఇంట్రెస్టింగ్‌గా మారింది.లేటెస్ట్‌గా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఖమ్మం పర్యటనలో..వైసీపీ జెండాలు కనిపించాయి. కేటీఆర్ ర్యాలీలో వైసీపీ ఫ్లాగ్స్‌తో, జగన్ నినాదాలతో సందడి చేశారు ఫ్యాన్ పార్టీ అభిమానులు. ఖమ్మం జిల్లాలో వైసీపీకి పట్టుంది. టీడీపీకి కూడా క్యాస్ట్ ఈక్వేషన్స్ పరంగా మంచి బలమే ఉంది. ఇప్పుడు ఖమ్మం జిల్లాలో ఇటు కాంగ్రెస్‌లో కీలకంగా ఉన్న నేతలు..అటు బీఆర్ఎస్‌లో కీలకంగా ఉన్న నేతలు వైసీపీ, టీడీపీ నుంచి వచ్చిన వారే. 2014లో ఖమ్మంలో మూడు ఎమ్మెల్యేలు సహా, ఒక ఎంపీ సీటును గెలుచుకుంది వైసీపీ. టీడీపీ కూడా ఖమ్మంలో ఒక సీటును, 2018లో రెండు సీట్లను గెలుచుకుంది. సీట్ల పరంగానే కాదు..వైసీపీ, టీడీపీ అభిమానులు కూడా ఖమ్మం జిల్లాలో డిసైడింగ్ ఫ్యాక్టర్‌గా ఉన్నారు.అయితే రేవంత్ ఆల్రెడీ చంద్రబాబుతో కలిసి పని చేసిన నేతగా..వాళ్లిద్దరూ ఒక్కటే అన్న భావనతో..గత ఎన్నికల్లో తెలంగాణలో టీడీపీ క్యాడర్ ఔట్‌రైట్‌గా కాంగ్రెస్‌కు సపోర్ట్ చేసిందన్న ప్రచారం ఉంది. అయితే ఇప్పుడు కార్పొరేషన్ ఎన్నికలు రాబోతున్న వేళ కేటీఆర్ ఖమ్మం పర్యటనలో వైసీపీ ఫ్లాగ్స్ కనిపించడం చర్చకు దారితీస్తోంది. ఖమ్మంలో వైసీపీ క్యాడర్, జగన్ అభిమానులు బీఆర్ఎస్ వెంట మద్దతుగా నిలిస్తే..పోటీ మరోలా ఉంటుందన్న అంచనాలున్నాయి.అటు ఏపీ మాజీ సీఎం జగన్ కార్యక్రమాల ఫ్లెక్సీల్లో కేసీఆర్, కేటీఆర్ ఫోటోలు. బీఆర్ఎస్ కార్యక్రమాల్లో వైఎస్ జగన్ ఫ్లెక్సీలు, వైసీపీ జెండాలు కనిపించడంతో తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో అసలేం జరుగుతోందన్నది హాట్ టాపిక్‌గా మారింది. గతేడాది నవంబర్‌లో వైఎస్ జగన్ హైదరాబాద్‌లోని సీబీఐ కోర్టుకు వచ్చిన సందర్భంగా అభిమానులు ఆయనకు భారీ ఎత్తున స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీబీఐ కోర్టు దగ్గర ఓ అభిమాని ప్రదర్శించిన ఫ్లెక్సీలో జగన్‌తో పాటు కేటీఆర్ ఫోటోను ఉంచారు. జగన్ కోర్టు నుంచి లోటస్ పాండ్ కు వెళ్లే క్రమంలో వైసీపీ జెండాలతో పాటు అక్కడక్కడ బీఆర్ఎస్ జెండాలు కూడా కనిపించాయి.జగన్ పుట్టిన రోజు కూడా ఇదే సీన్ రిపీట్ అయ్యింది. జగన్ బర్త్ డే సందర్భంగా తాడేపల్లిలో కేసీఆర్, కేటీఆర్, జగన్‌తో కూడిన ఫ్లెక్సీ వెలిసింది. అది కూడా రాజకీయవర్గాల్లో ఆసక్తి రేపింది. ఇక ఇటు తెలంగాణ సీఎం రేవంత్..అటు ఏపీ సీఎం చంద్రబాబు దోస్తీ అనే ప్రచారం ఓవైపు..జగన్, కేసీఆర్ మిత్రులంటూ కాంగ్రెస్ విమర్శలు రెగ్యులర్ అయిపోయాయి. ఇలా తెలంగాణ సెంట్రిక్‌గా టీడీపీ వర్సెస్ వైసీపీ..బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ రాజకీయం?నెక్ట్ లెవల్ హీట్‌ను క్రియేట్ చేస్తోంది.

## మరువలేని 'నిరాడంబర ప్రధాని' లాల్ బహదూర్ శాస్త్రి -నేడు ఆయన వర్ధంతి



భారతదేశ మరువలేని రెండవ'నిరాడంబర ప్రధాని' లాల్ బహదూర్ శాస్త్రి. ఆయన స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రముఖ పాత్రధారి. భారతదేశపు నిరాడంబర ప్రధానులలో ఒకరైన లాల్ బహదూర్ శాస్త్రి ఉత్తరప్రదేశ్‌లోని మొఘల్ సరాయ్ గ్రామంలో 1904 అక్టోబర్ 2న జన్మించారు. ఎంతో దేశభక్తిగల ఆయన 1921లో సహాయ నిరాకరణోద్యమంలో అడుగుపెట్టారు. స్వాతంత్ర్య పోరాటంలో మొత్తం 9 సంవత్సరాలపాటు జైలులోనే గడిపారు. స్వాతంత్ర్యం అనంతరం ఉత్రప్రదేశ్ రాష్ట్రమంత్రిగా పనిచేసి ఆ తరువాత 1951లో లోక్ సభ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. మహాత్మా గాంధీ ప్రభావంతో అతను మొదట మహాత్మా గాంధీకి, తరువాత జవహర్‌లాల్ నెహ్రూకు నమ్మకస్తుడైన అనుచరుడయ్యాడు. 1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత అతను భారతదేశ ప్రభుత్వంలో చేరి జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వంలో మొదట రైల్వే మంత్రిగా (1951?56), తరువాత హోంమంత్రిగానేకాక ఇతర బాధ్యతలను కూడా చేపట్టాడు. నెహ్రూ అనంతరం ప్రధానమంత్రి పదవిని చేపట్టాడు. అతను 1965 ఇండో-పాకిస్థాన్ యుద్ధం కాలంలో దేశాన్ని నడిపించాడు. అతని నినాదం "జై జవాన్ జై కిసాన్" యుద్ధ సమయంలో బాగా ప్రాచుర్యంలోనికి వచ్చి ప్రస్తుత కాలం వరకు ప్రజల హృదయాల్లో గుర్తుండిపోయింది. ఈ యుద్ధం 1966 జనవరి 10న తాష్కెంట్ ఒప్పందం ద్వారా యుద్ధం పూర్తి అయినది. ఒప్పందం జరిగిన తరువాత దినం తాష్కెంట్లో అతను గుండెపోటుతో మరణించినట్లు చెప్పబడింది. కానీ ఈ మరణానికి అనేక కారణాలు చెప్పబడినప్పటికీ అది సి.ఐ.ఎ ద్వారా జరిగిన ప్రణాళికాబద్ధమైన హత్యగా చెప్పబడింది. కేంద్ర రైల్వే శాఖ మంత్రిగా పనిచేస్తూ రైలు ప్రమాదానికి నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఆ తరువాత రవాణా మంత్రిగా, హోంమంత్రిగా పనిచేశారు. 1964లో జవహర్ లాల్ నెహ్రూ ఆకస్మిక మరణం తర్వాత లాల్ బహదూర్ శాస్త్రిగారు ప్రధానమంత్రి అయ్యారు. దేశం ఆర్థిక సంక్షోభంలో ఉంటే గ్రీన్ రివల్యూషన్‌కు బాటలు వేశారు. భారత్-పాకిస్తాన్ దేశాల మధ్య ఒప్పందం కోసం రష్యా చేరిన లాల్ బహదూర్ శాస్త్రి తాష్కెంట్ ఒప్పందంపైన 1966 జనవరి 10న సంతకాలు చేశారు. ఆ మర్నాడు 1966 జనవరి 11న గుండెపోటుతో తాష్కెంట్‌లోనే ఆయన మరణించారు. మరణానంతరం 1966లో భారత ప్రభుత్వం ఆయనకు 'భారతరత్న' ఇచ్చి గౌరవించింది.

# స్మశాన సుందరీకరణ పనులు కలగానే మిగిలేనా?

## చస్తే పూడ్చడానికి, కాల్చడానికి స్థలం లేదు

## నడవాలంటే రోడ్డు లేదు

## నిజాం చెరువు ట్యాంక్ బండ్ కలగానే మిగిలేనా ?

మహబూబాబాద్, జీవించి ఉన్నప్పుడు ప్రజలు చెల్లించే పన్నులు ప్రభుత్వానికి కావాలి కానీ మరణించిన ప్రజలకు ప్రశాంతమైన వాతావరణం ఉండే విధంగా పూడ్చడానికి కాల్చడానికి కిలోమీటర్ల దూరం చూసినా స్థలం కూడా ఉండని దుస్థితి మహబూబాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది.మహబూబాబాద్ పట్టణంలో బస్టాండ్ సమీపంలో ఉన్న నిజాం చెరువు (నీలం చెరువు) శిఖం భూములలో తరతరాల నుండి వస్తున్న స్మశాన వాటిక మరియు ప్రజల అవసరాల నిమిత్తం కేటాయించిన నిజాం చెరువు ప్రక్కన నుండి బస్టాండ్ రైల్వే గేట్ కలిపే నెక్లెస్ రోడ్డు హైకోర్టు వెడల్పు తగ్గిస్తూ రిజిస్ట్రేషన్ భూములు కలిగిన వారికి ఇచ్చిన తీర్పు తో నెక్లెస్ రోడ్డు నిర్మాణం జరిగి సంవత్సరములు గడుస్తున్నా ప్రజలు వినియోగించుకోకుండా కొందరు భూ కబ్జాదారులు రెవిన్యూ రిజిస్ట్రేషన్ సంబంధిత అధికారులను తైలాలతో మచ్చిక చేసుకుని సుమారుగా 100 సంవత్సరం ల నుండి ఆస్తులు కనిపించే విధముగా నకిలీ పత్రాలు సృష్టించి నిజాం చెరువు రెండు భాగాలను వేరు చేసే విధముగా ప్రయాణించే నక్లెస్ రోడ్డు రాకపోకలను నిలిపివేసి తరతరాల నుండి స్మశాన వాటిక వినియోగంలో ఉన్న నిజాం చెరువు లోతట్టు ప్రాంతాన్ని కొందరు కబ్జాదారులు ప్లాట్స్ గా మార్చి అమ్మకం అమ్మడం జరుగుతుంది. మహబూబాబాద్ జిల్లా మొత్తం ఇదే పరిస్థితి, పట్టణంలో ప్రజలందరికీ అందుబాటు దూరంలో ఉన్న నిజాం చెరువు స్మశాన వాటిక, స్థానిక ప్రజలు అన్ని కుల మతస్తులు వినియోగించుకునే స్మశాన వాటికను పునరుద్ధరించి స్మశాన వాటిక సుందరీ కరణ పనులలో భాగంగా వేచి ఉండేందుకు షెడ్లు, దినకర్మలకు గదులు, నిద్రించే స్థలాలు, నీటి సరఫరా గదులు, విద్యుత్, భద్రత సిబ్బంది, ఎలక్ట్రానికల్ దహన కేంద్రం అమర్చి ప్రజలందరికీ స్మశాన వాటిక వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలందరూ అధికారులందరికీ విజ్ఞప్తిని తెలియపరుస్తూ, గతంలో నుండి ప్రభుత్వాలు స్మశాన వాటికల సుందరి కరుణ పనులకు కేటాయించి విడుదల చేసిన నిధులు స్థానిక అధికారులు కాసులకు కక్కుతులు పడుతూ వాటిని దుర్వినియోగపరిచారని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తపరుస్తూ జిల్లా అధికార యంత్రాంగం ఆ యొక్క నిధుల జాబితా పున పరిశీలన చేసి స్మశాన వాటికల నిర్మాణాలకు చర్యలు చేపట్టాలని కోరారు.

# విద్యార్థి, యువజన నాయకులపై అక్రమ కేసులు

## రౌడీషీట్లు ఎత్తివేయాలి

## కూటమి టీడీపీ ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలి

"రెడ్ బుక్" పాలనలో ప్రజాస్వామ్య హక్కులను హరించడం సిగ్గుచేటు అని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు తీవ్రంగా విమర్శించారు.ప్రజా సమస్యలపై ప్రశ్నించినందుకే విద్యార్థి, యువజన నాయకులపై తప్పుడు కేసులు నమోదు చేయడం, రౌడీషీట్లు తెరవడం పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని వారు పేర్కొన్నారు. విశాఖపట్నంలో ఏఐఎస్ఎఫ్?ఏఐవైఎఫ్ నాయకులపై పెట్టిన రౌడీషీట్లు, కడపలో పలువురు ప్రజా సంఘ నాయకులపై అమలు చేసిన పీడీ యాక్ట్‌ను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ కర్నూలు కలెక్టర్ కార్యాలయం ముందు విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ఉరితాళ్లు మెడలో వేసుకుని, చేతులకు సంకెళ్లతో, నల్లజెండాలు ప్రదర్శిస్తూ నిరసన తెలియజేశారు.ఈ కార్యక్రమం ఉద్దేశించి ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్న, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు శివారెడ్డి, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి సంఘ నాయకులు రెడ్డి పోగు ప్రశాంత్, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమణ, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మహేంద్ర తదితరులు మాట్లాడుతూ 2024 ఎన్నికల వాగ్దానాల ప్రకారం ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉద్యోగాలు అడిగితే అక్రమ కేసులు పెట్టడం, ఉద్యమాలను అణిచివేయడం దుర్మార్గమైన పాలనకు నిదర్శనమని అన్నారు.ఏటా నాలుగు లక్షల ఉద్యోగాలు లేదా నెలకు రూ.3,000 నిరుద్యోగ భృతి ఇస్తామని చేసిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందని, తమ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న విద్యార్థి?యువజన సంఘ నాయకులను అణిచివేయడానికి ప్రయత్నించడం తగదని వారు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఉద్యమాల పేరుతో పెట్టిన అన్ని అక్రమ కేసులు, రౌడీషీట్లు వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.అధికారం తమ చేతిలో ఉందని పోలీస్ వ్యవస్థను ఉపయోగించి ప్రశ్నించే గొంతుకలను అణిచివేయాలని ప్రయత్నిస్తే, గ్రామ స్థాయి నుంచి రాష్ట్రవ్యాప్తం వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.అప్పుడు విద్యార్థులు, నిరుద్యోగులను అరెస్టు చేయడానికి రాష్ట్రంలో ఉన్న జైళ్లు కూడా సరిపోవని వారు వ్యాఖ్యానించారు, ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం నిరుద్యోగుల పట్ల నిర్లక్ష్యాన్ని వీడి, ఎన్నికల ముందు ఇచ్చిన హామీల ప్రకారం జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, ఎమ్మిగనూరు నియోజకవర్గ అధ్యక్షులు డి. నజీర్ అహ్మద్, పాణ్యం నియోజకవర్గ యువజన విభాగ అధ్యక్షులు నాయకులు దుర్గాప్రసాద్, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌతమ్, విద్యార్థి విభాగ రాష్ట్ర కార్యదర్శి కటారీకొండ సాయి, ఏఐవైఎఫ్ నగర అధ్యక్షులు నాగరాజు, బిసన్న, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శరత్‌కుమార్, నగర కార్యదర్శి అశోక్, పీడీఎస్‌యూ జిల్లా నాయకులు మునిస్వామి, యూత్ కాంగ్రెస్ నగర అధ్యక్షులు హనోక్, నగర నాయకులు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# అంబర్పేట్ ఎస్ ఐ భాను ప్రకాష్ రెడ్డి అరెస్ట్



హైదరాబాద్ అంబర్ పేట పోలీసు స్టేషన్ లో ఎస్సై గా పని చేస్తున్న భాను ప్రకాష్ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. భాను ప్రకాష్ రెడ్డి బెట్టింగ్ అప్పులు తీర్చేందుకు రికవరీ సొత్తు కాజేసి తాకట్టు పెట్టిన విషయం తెలిసిందే. తన సర్వీస్ రివాల్వర్ ను ఎక్కడో పోగొట్టుకున్నాడు. ట్రైన్ లో ప్రయాణిస్తున్న సందర్భంలో రివాల్వర్ పోయిందని స్టేట్మెంట్ ఇచ్చాడు. ఎంత వెతికినా గన్ కనిపించలేదని చెప్పాడు. భాను ప్రకాష్ రెడ్డి ఏపీ లో గ్రూప్2 ఉద్యోగం పొందాడు. ఇక్కడ రిలీవ్ చేయాలని రిక్వెస్ట్ పెట్టుకున్నాడు.

# ఇళ్లకు తాళాలు వేసి వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలి....

## సీసీటీవీ కెమెరాల పనితీరును తప్పనిసరిగా పరిశీలించాలి

## ప్రజల సహకారంతోనే నేరాల నివారణ సాధ్యం :

## పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా.



గోదావరిఖని రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లకు చెందిన ప్రజలు పండుగలు, సెలవులు, వివాహాలు తదితర సందర్భాల్లో ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలని,చోరీలు మరియు ఇతర నేరాలు జరగకుండా స్వీయ రక్షణ చర్యలు తప్పనిసరిగా పాటించాలని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో సూచించారు.ఇళ్లకు తాళాలు వేసి వెళ్లే ముందు తలుపులు,కిటికీలు, గేట్లు సక్రమంగా మూసి ఉన్నాయా లేదా అన్న విషయాన్ని పూర్తిగా పరిశీలించుకోవాలని తెలిపారు.అలాగే ఇళ్లలో లేదా ఇంటి పరిసర ప్రాంతాల్లో అమర్చిన సీసీటీవీ కెమెరాలు సరిగా పనిచేస్తున్నాయా, రికార్డింగ్ జరుగుతోందా,నైట్ విజన్ సదుపాయం సక్రమంగా ఉందా అనే అంశాలను తప్పనిసరిగా తనిఖీ చేసుకోవాలని సూచించారు.సీసీటీవీ కెమెరాలు సక్రమంగా పనిచేస్తే నేరాలకు పాల్పడే వ్యక్తుల్లో భయాన్ని కలిగించడంతో పాటు,ఏదైనా అనుకోని ఘటన జరిగినా నిందితులను గుర్తించేందుకు ఎంతో ఉపయోగపడుతాయని సీపీ పేర్కొన్నారు. ఇంటర్నెట్ సదుపాయం కలిగిన సీసీటీవీ కెమెరాలైతే మొబైల్ ఫోన్ యాప్ ద్వారా లైవ్ ఫుటేజ్ వీక్షించే విధంగా ముందుగానే సెటప్ చేసుకోవాలని సూచించారు.అదేవిధంగా,ఇళ్లకు తాళాలు వేసి వెళ్లే విషయాన్ని పొరుగువారికి లేదా నమ్మకమైన వ్యక్తికి ముందుగా తెలియజేయడం, అవసరమైతే సంప్రదింపు ఫోన్ నంబర్ ఇవ్వడం భద్రతకు మరింత దోహదపడుతుందని తెలిపారు.రాత్రి సమయాల్లో ఇంటి వెలుపల లైట్లు వెలిగేలా టైమర్ ఏర్పాటు చేసుకోవడం వల్ల ఇల్లు ఖాళీగా ఉందనే అనుమానం కలగకుండా ఉంటుందని వివరించారు.ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు లేదా కదలికలు గమనించినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని,లేదా డయల్ 100 లేదా 112కు ఫోన్ చేయాలని పోలీస్ కమిషనర్ ప్రజలను కోరారు.ప్రజల సహకారంతోనే నేరాల నివారణ సాధ్యమవుతుందని, ప్రతి పౌరుడు భద్రత విషయంలో బాధ్యతగా వ్యవహరించాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు.

# నరుడే నారాయణుడని, మానవసేవయే మాధవసేవ యని చాటిచెప్పిన మహోన్నత మూర్తి స్వామి వివేకానంద

## -నేడు స్వామి వివేకానంద జయంతి


## -భారతీయులకు జాతీయ యువజన దినోత్సవ శుభాకాంక్షలు



మతానికి కొత్త అర్థాన్ని, సేవకు పరమార్థాన్ని నిర్వచించి నరుడే నారాయణుడని, మానవసేవయే మాధవసేవ యని చాటిచెప్పిన మహోన్నత మూర్తి స్వామి వివేకానంద దేశ యువతకు సదా స్ఫూర్తిదాతగా నిలువాలని 1985లో భారత ప్రభుత్వం ఆయన పుట్టినరోజైన జనవరి 12ను జాతీయ యువజన దినోత్సవంగా నిర్ణయించింది.బలమే జీవనం...బలహీనతే మరణం..నువ్వు దేనినైతే ఆలోచిస్తావో ఆవిధంగానే తయారవుతావు. నిన్ను బలహీనుడిగా భావించుకుంటే చివరకు బలహీనుడివే అవుతావు..శక్తిమంతుడిగా భావించుకుంటే శక్తిమంతుడివే అవుతావు. సమస్త శక్తి నీలోనే ఉంది. దానినే విశ్వసించు, నీవు బలహీనుడవని ఎప్పుడూ తలపోయకు..ధీరుడవై నిలిచి నీలోని దివ్యత్వాన్ని ప్రకటించు...అంటూ సమస్త మానవాళిని భయం వదలి సమాజ సేవకు నడుంకట్టాలన్నారు స్వామి వివేకానంద. ఉక్కునరాలు, ఇనుపకండరాలు, వజ్రతుల్యమైన ధృడసంకల్పం, మొక్కవోని విశ్వాసం గల వందమంది యువకులు చాలు...ఈదేశాన్ని ప్రపంచంలో అన్ని రంగాలలో అగ్రగామిగా నిలుపడానికి అంటూ ఎలాంటి యువత నేడు అవసరమో వివరించారు ఆమహనీయుడు. స్వామి సంక్షిప్త జీవిత చరిత్రకలకత్తాకు చెందిన ప్రసిద్ధ న్యాయవాది విశ్వనాథ దత్తా, ఆయన సతీమణి భువనేశ్వరీదేవి దంపతులకు నలుగురు కుమార్తెలు. ఒక మగబిడ్డ కావాలని భువనేశ్వరీ దేవి శివుణ్ని ప్రార్థించింది. 1863 జవనరి 12తేదీ మకర సంక్రాంతి పర్వదినాన నరేంద్రనాథ్ జన్మించారు. ఆ శిశువే అనంతరం స్వామి వివేకానందుడిగా ప్రపంచ ప్రసిద్ధి చెందారు. చిన్నప్పుడు కొంటె పనులు చేసినా, పెంపుడు జంతువులతో ఆటలాడుతూ తల్లి చెప్పే భారత, రామాయణ ఇతిహాసాలను శ్రద్ధగా వినేవాడు.పాఠశాలలో చేరింది మొదలు కళాశాల స్థాయి వరకు ఆ బాలుడిలో అసాధారణ మేధాశక్తి, అద్భుత జ్ఞాపకశక్తిని చూసి సహవిద్యార్థులు, ఉపాధ్యాయులు సైతం ఆశ్చర్యపడేవారు. వివిధ క్రీడల్లో ప్రావీణ్యం చూపడంతోపాటు మూఢనమ్మకాలను నమ్మకుండా ధైర్యసాహసాలు ప్రదర్శించేవాడు. చిన్నప్పటినుంచే ధ్యానంపై దృష్టి నిలిపిన నరేన్ త్రాచుపాము సమీపించినా ధ్యానముద్ర వీడేవాడుకాదు. గదిలో బంధించినా నిరుపేదలను చూసి చలించి ఇంట్లో ఉన్నవన్నీ కిటికీలగుండా దానం చేసేవాడు. దేవుడంటే ఎవరు, ఎలా ఉంటాడో కనుక్కోవాలన్న తపనతో ఎంతమందిని అడిగి చూసినా ఫలితం లేకపోవడంతో దక్షిణేశ్వర కాళికాలయానికి వెళ్లి శ్రీరామకృష్ణ పరమహంసను కలుసుకున్నాడు. కోరుకుంటున్న శిష్యుడు, గురువు దొరికేసరికి రామకృష్ణులవారి సంతోషానికి, శిష్యుడి సంతోషానికి అవధులు లేకుండా పోయాయి. దైవసాక్షాత్కారం కోసం నిరంతర ధ్యానం చేశారు. పరివ్రాజకునిగా దేశసంచారం చేశారు. ఎన్నో క్షేత్రాలు తిరిగి భారతదేశంపై పూర్తి అవగాహనకు వచ్చారు. పేద ధనిక తేడాలకు కలత చెందేవారు. కన్యాకుమారి చేరుకుని ఆమె దివ్య సమక్షాన్ని అనుభూతి చెందిన స్వామిలో ఆధ్యాత్మికతతోపాటు దేశభక్తి మిళితమైంది. స్వామి ప్రసంగాలకు ముగ్ధులైన మద్రాసు ప్రజలు విరాళాలు సేకరించగా 30 ఏళ్ల వయసులో త్యాగభూమి నుంచి భోగభూమి అయిన అమెరికాకు వెళ్లారు. అక్కడ ఎన్నో కష్టాలు ఎదురైనా లెక్కచేయకుండా 1893 సెప్టెంబర్ 11న చికాగోలో ప్రారంభమైన సర్వమత మహాసభలో వివిధ మతాలకు చెందిన ప్రతినిధులు, దాదాపు 7వేల మంది శ్రోతలు ఉన్నసభలో స్వామి ప్రవేశించారు. అమెరికా సోదర సోదరీమణులారా నామతం గొప్పదంటే..కాదు కాదు నామతం గొప్పది అంటూ కొట్లాడుకుంటున్న కాలంలో కాషాయం కట్టిన ఓ సాధారణ సన్యాసిగా చికాగోలోని సర్వమత సమ్మేళనంలోకి అడుగుపెట్టి ఓ నా అమెరికా సోదర సోదరీమణులారా అంటూ ఆత్మీయ సంబోధనతో ప్రపంచదేశాలకు భారతీయ సోదరభావాన్ని, ఔన్నత్యాన్ని చాటిచెప్పారు. ఆయన ఆత్మీయ సంబోధన విని వేలాదిమంది లేచి రెండు నిమిషాలపాటు చప్పట్లతో ఆనందానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన అనర్గళంగా చేసిన విశ్వజనీన ప్రసంగానికి మంత్రముగ్ధులయ్యారు. అంతవరకు ఎవరికీ తెలియని స్వామి అసాధారణ ధార్మిక ప్రబోధకుడిగా కీర్తిగాంచారు. చికాగో వీధుల్లో వెలసిన ఆయన చిత్రపటాలకు వందనం చేయనివారు లేరంటే అతిశయోక్తికాదు. డిసెంబర్ 16న ఆయన మాతృభూమికి ప్రయాణమవుతుండగా ఆయనను వీడలేకనే అఖండ జనం ఆయనకు వీడ్కోలు పలికారు. మాతృదేశంలో ఆయనకు ఘన స్వాగతం లభించింది.అనంతరం 1899 జూన్ 20న కూడా మరోమారు పాశ్చాత్య దేశాలలో పర్యటనకు వెళ్లివచ్చారు. తన నలభయ్యవ పుట్టిన రోజును చూడబోనని స్వామిజీ సూచించినట్లుగానే 1902 జూలై 4వ తేదీన రాత్రి 9:10గంటలకు స్వామిజీ మహాసమాధి పొందారు.

# అభ్యుదయ విప్లవ రచయిత, అస్తమించని అక్షర సూర్యుడు అలిశెట్టి ప్రభాకర్

## -నేడు ఆయన జయంతి,వర్ధంతి సందర్భంగా జోహార్లు



అలిశెట్టి ప్రభాకర్ ఒక అభ్యుదయ విప్లవ రచయిత మాత్రమే కాదు అస్తమించని అక్షర సూర్యుడు. సామాజిక కోణంలో అనేక కార్టూన్లు వేసిన జర్నలిస్టు కూడా.అలిశెట్టి ప్రభాకర్ కరీంనగర్ జిల్లాలోని జగిత్యాలలో 1956 జనవరి 12 న జన్మించారు. అలిశెట్టికి ఏడుగురు అక్కా చెల్లెళ్ళు, ఇద్దరు అన్నదమ్ముళ్ళు. తండ్రి పరిశ్రమల శాఖలో పనిచేస్తూ ఆకస్మికంగా మృత్యువాత పడ్డాడు. ఆయన మరణంతో 11 ఏళ్ల వయసులో ప్రభాకర్ కుటుంబ పోషణ బాధ్యతలు స్వీకరించాడు. ఆదర్శాలకు అనుగుణంగా పేదరాలయిన 'భాగ్యం' ను పెళ్ళి చేసుకొన్నారు. జీవిక కోసమే తప్పా, ఏనాడు సంపాదన కొరకు ఆరాటపడని మనిషి. తన కళ ప్రజల కోసమే అని చివరి వరకు నమ్మాడు. చిత్రకారుడిగా, ఫోటో గ్రాఫర్‌గా వృత్తి జీవితాన్ని కొనసాగిస్తూనే, కవిగా ఎదిగాడు. 1982 లో హైదరాబాదులో స్థిరపడ్డారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఆరేళ్ళ పాటు సీరియల్‌గా సిటీ లైఫ్ పేరుతో హైదరాబాద్ నగరంపై మినీ కవిత్వం రాశాడు. తన కవిత్వంతో పాఠకుల్లో ఆలోచనాదృక్పథాన్ని, సామాజిక చైతన్యాన్ని పెంపొందించిన అతి కొద్ది మంది కవుల్లో అలిశెట్టి ఒకడు. క్షయ బారిన పడి 1993 జనవరి 12న మరణించారు.

చిత్రకారుడిగా : ఆయన మొదట చిత్రకారుడిగా జీవితాన్ని ప్రారంభించాడు. ప్రారంభంలో పత్రికలకు పండుగలు, ప్రకృతి, సినీనటుల బొమ్మలు వేసేవాడు... ఫోటో గ్రాఫర్‌గా : సిరిసిల్లలో రాం ఫోటో స్టూడియోలో ఫోటోగ్రఫీ నేర్చుకొని, 1975 లో జగిత్యాలలోని సొంత ఇంట్లో పూర్ణిమ స్టూడియో ప్రారంభించాడు. కరీంనగర్‌లో స్టూడియో శిల్పి (1979), హైదరాబాద్లో స్టూడియో చిత్రలేఖ (1983) పేర్లతోనూ స్టూడియోలు నడిపి ఫోటో గ్రాఫర్‌గా జీవితాన్ని గడిపాడు... కవిగా: జగిత్యాలలో సాహితీ మిత్ర దీప్తి సంస్థ పరిచయంతో కవిత్వ రంగంలో ప్రవేశించాడు. 1974లో ఆంధ్ర సచిత్ర వారపత్రికలో వచ్చిన పరిష్కారం అచ్చైన ఆయన మొదటి కవిత. ఎర్ర పావురాలు (1978) అచ్చైన ఆయన మొదటి కవితా సంకలనం. ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఆరేళ్ళ పాటు సీరియల్‌గా సిటీ లైఫ్ పేరుతో హైదరాబాద్ నగరంపై రాసిన మినీ కవితలతో ప్రఖ్యాతిపొందాడు. సామాజిక చైతన్యమే ధ్యేయంగా కవిత్వం రాశాడు...అచ్చైన కవితా సంకలనాలు: ఎర్ర పావురాలు (1978), మంటల జెండాలు (1979), చురకలు (1981), రక్త రేఖ (1985), ఎన్నికల ఎండమావి (1989), సంక్షోభ గీతం (1990),సిటీ లైఫ్ (1992)

## 57వ డివిజన్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల బరిలో బి ఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు బూరుగు వంశీకృష్ణ




రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 57వ డివిజన్ తనకు కుటుంబంలాంటిదని, ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉండడమే తన జీవన విధానమని 57వ డివిజన్ అభ్యర్థి బూరుగు వంశీకృష్ణ అన్నారు. మాటలకే పరిమితం కాకుండా చూపించే సేవే తన రాజకీయ పునాదని ఆయన పేర్కొన్నారు. డివిజన్‌లో మౌలిక సదుపాయాలు కల్పించడం, తాగునీటి సమస్యలు, నిరుద్యోగం రూపుమాపడం, ఉపాధి కల్పన, డివిజన్లో డ్రైనేజీ, రోడ్ల అభివృద్ధి, మహిళా సంక్షేమ అభివృద్ధి, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. అలాగే అభివృద్ధిలో మహిళలు, యువతకు అవకాశాలు కల్పించడం, పేదల సమస్యలపై తక్షణ స్పందన తన ప్రధాన ప్రాధాన్యాలని ఆయన స్పష్టం చేశారు. డివిజన్‌లో ఏ సమస్య తలెత్తినా ప్రజల దగ్గరకే వెళ్లి సమస్యను విని, పరిష్కారం చూపే విధంగా పనిచేస్తానని ఆయన అన్నారు. వృద్ధులు గౌరవంగా జీవించాలి, మహిళలు భద్రంగా ఉండాలి, యువతకు సరైన మార్గదర్శనం ఉండాలి, పేద కుటుంబాలకు అండగా నిలవాలి అనే ఆలోచనతోనే ప్రతి రోజూ ప్రజల మధ్యనే ఉంటానని ఆయన హామీ ఇచ్చారు.రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో 57వ డివిజన్ నుండి బరిలోకి దిగుతున్నట్లు బూరుగు వంశీకృష్ణ తెలిపారు. ప్రజల నమ్మకమే తన బలమని, ప్రజల ఆశీస్సులు, సహకారంతో విజయం సాధించి డివిజన్ అభివృద్ధికి నిజాయితీగా పని చేస్తానని ఆయన మాటిచ్చారు.

## అరకు కాఫీ స్టాల్‌ను సందర్శించిన ఎమ్మెల్యే చదలవాడ అరవింద్ బాబు




నరసరావుపేట, రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతే లక్ష్యంగా తీసుకుని అమలు చేస్తున్న కార్యక్రమాల్లో భాగంగా ఏర్పాటు చేసిన నేటివ్ అరకు కాఫీ స్టాల్‌ను నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు శనివారం ఉదయం సందర్శించారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ కాఫీ స్టాల్ వద్దకు చేరుకున్న ఆయన, అక్కడ అందిస్తున్న స్వచ్ఛమైన అరకు కాఫీని తాగి ఆస్వాదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ, అరకు ప్రాంతానికి చెందిన కాఫీ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని, గిరిజన రైతులు కష్టపడి పండించే ఈ కాఫీకి మరింత ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇటువంటి నేటివ్ అరకు కాఫీ స్టాల్స్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు.మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించినప్పుడే సమాజం పురోగతి సాధిస్తుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల సాధికారత కోసం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని, అందులో భాగంగానే ఈ అరకు కాఫీ స్టాల్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా స్థానిక ఉపాధి పెరగడంతో పాటు, నాణ్యమైన ఉత్పత్తులు ప్రజలకు అందుబాటులోకి వస్తాయని అన్నారు. ఈ కార్యక్రమం వల్ల గిరిజన రైతులకు మార్కెట్ లభించడమే కాకుండా, మహిళలకు ఉపాధి అవకాశాలు మరింత విస్తరించనున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి స్టాల్స్‌ను మరిన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆయన సూచించారు.

## బోధి పాఠశాలలో ఘనంగా ప్రీసంక్రాంతి వేడుకలు



పిడుగురాళ్ల మండలం తుమ్మలచెరువు గ్రామంలోని బోధి పాఠశాలలో నిర్వహించిన ప్రీ?సంక్రాంతి వేడుకలు దివ్యాంగ పిల్లలకు అంకితంగా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పిడుగురాళ్లకు చెందిన డెఫ్ & డంబ్ (దివ్యాంగ– బధిర) విద్యార్థులు సుమారు 20 మంది హాజరై వేడుకలకు ప్రధాన ఆకర్షణగా నిలిచారు. సమాజంలో దివ్యాంగ పిల్లలు కూడా సమానమేనన్న భావనను పెంపొందించడమే లక్ష్యంగా పాఠశాల యాజమాన్యం ఈ వేడుకలను ప్రత్యేక శ్రద్ధతో నిర్వహించింది. దివ్యాంగ పిల్లలు ఎంతో ఉత్సాహంగా కార్యక్రమాలను వీక్షిస్తూ, సంక్రాంతి పండుగ ఆనందాన్ని ఆస్వాదించారు. బధిర విద్యార్థుల ముఖాల్లో కనిపించిన ఆనందం వేడుకల విజయానికి నిదర్శనంగా నిలిచింది. సంక్రాంతి సంప్రదాయాన్ని ప్రతిబింబించేలా పాఠశాల ప్రాంగణంలో పొంగళ్ల వంట, భోగిమంటల నిర్వహణ చేపట్టారు. అలాగే గాలిపటాల ఎగరవేత, సాంస్కృతిక కార్యక్రమాలతో వేడుకలకు మరింత శోభ చేకూరింది. ఈ సందర్భంగా వేడుకలకు హాజరైన అందరు పిల్లలకూ విందు భోజన ఏర్పాట్లు చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముఖ్యంగా దివ్యాంగ– బధిర పిల్లలకు పాఠశాల యాజమాన్యం ప్రత్యేక ప్రోత్సాహక బహుమతులు అందజేసి వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. ఈ బహుమతులు వారికి మరింత ధైర్యాన్ని, ప్రేరణను అందించాయని నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఎన్. సునీత మాట్లాడుతూ, "దివ్యాంగ పిల్లలు మనకు భారం కాదు, మన బలం. వారి ఆశీర్వాదాలే మా సేవలకు ప్రేరణ. ప్రతి పిల్లవాడూ ప్రేమ, ఆదరణ, అవకాశాలు పొందాలి. అదే బోధి పాఠశాల ఆశయం" అని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా దివ్యాంగ పిల్లల పట్ల మానవత్వం, సామాజిక బాధ్యతను పెంపొందించాలన్న సందేశాన్ని బోధి పాఠశాల బలంగా అందించింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొని ప్రీ?సంక్రాంతి వేడుకలను విజయవంతంగా నిర్వహించారు.

### నీటి విషయంలో గొడవలకు దిగితే నష్టపోయేది తెలుగు ప్రజలే ఏపీ ప్రయోజనాలే మాకు ముఖ్యం.. నీటి విషయంలో రాజీ పడేదే లేదు": చంద్రబాబు



అమరావతి జనవరి 10 : నీటి విషయంలో గొడవలకు దిగితే నష్టపోయేది తెలుగు ప్రజలే అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న నీటి వివాదాలపై ఆయన మరోసారి స్పందించారు. తెలుగు రాష్ట్రాలు బాగుండేలా చూడటం తప్పెలా అవుతుందని ప్రశ్నించారు. మిగులు జలాల సద్వినియోగంతో రాష్ట్రాలు సుభిక్షంగా ఉంటాయని అన్నారు. కాళేశ్వరానికి లేని అభ్యంతరం నల్లమలసాగర్‌కు ఎందుకు అని అడిగారు. తెలుగు ప్రజల కోసం ఒకరికొకరు సహకరించుకుంటాం అని తెలిపారు. ప్రజల కోసం ప్రాజెక్టులు చేపడతాం కానీ, జగన్ కోసం నేనెందుకు చేస్తా? అని అన్నారు. "నీటిని బిల్డప్ చేస్తే ఎక్కువైనా దాచుకోవచ్చు.. అవసరాలకు వాడుకోవచ్చు. నల్లమలసాగర్ మేము చేపడితే శ్రీశైలం, సాగర్‌లో నీటి లభ్యత పెరుగుతుంది. శ్రీశైలం, సాగర్‌లో ఉన్న నీటిని తెలంగాణ కూడా వాడుకోవచ్చు. 2020లో నిలిపిన రాయలసీమ లిఫ్ట్‌తో స్వార్థ రాజకీయాలు చేస్తున్నారు. ఏపీ ప్రయోజనాలే మాకు ముఖ్యం.. నీటి విషయంలో రాజీ పడేదే లేదు" అని చంద్రబాబు అన్నారు.

## పందేల బరులను చదును చేసిన పోలీసులు



భీమడోలు మండలంలో అసాంఘిక కార్యకలాపాలపై పోలీసు దాడు లు నిర్వహించినారు. పూళ్ళ గ్రామములో ఏర్పాటు చేసిన బరుల లను భీమడోలు ఇన్స్పెక్టర్ యు జే విల్సన్, ఎస్ఐ మదీనా బాషా జేసీబీలు, ట్రాక్టర్లతో చదును చేసారు. బరులు, ఇతర తాత్కాలిక షెల్టర్ లను జేసీబీ లు మరియు ట్రాక్టర్ల సహాయంతో పూర్తిగా ధ్వంసం చేశారు. పండుగ ముసుగులో జూదం, పేకాటలు, కోడిపందేలు నిర్వహిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరించారు. ఇన్స్పెక్టర్ యు జే విల్సన్ మాట్లాడుతూ జూదం వల్ల కుటుంబాలు ఆర్థికంగా చితికి పోతాయని, ప్రజలు ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండి పండుగ ను కుటుంబ సభ్యులతో ఆనందంగా జరుపు కోవాలని కోరారు. ?? యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా, కోడి పందేలకు పేకాటలకు బానిస కాకుండా తల్లి దండ్రులు కఠినంగా వ్యవహరించాలని, వారిని సంప్రదాయ క్రీడల వైపు ప్రోత్సహించాలని హితవు పలికారు. ఈ ఆపరేషన్ లో భీమడోలు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## అమరావతి పేరుతో చంద్రబాబు రాష్ట్ర ఖాజానాను కొల్లగొడుతున్నారు: సజ్జల



అమరావతి జనవరి 10 అమరావతిని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నామని వైఎస్ ఆర్ సిపి కీలక నేత సజ్జల రామకృష్ణారావు తెలిపారు. అమరావతిని జగన్ ఎప్పుడూ వ్యతిరేకించలేదని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అమరావతిలోనే జగన్ ఇల్లు కట్టుకున్నారని, ఏపీ సిఎం చంద్రబాబు నాయుడు ఇప్పటికీ అక్రమంగా కట్టుకున్న నివాసంలోనే ఉంటున్నారని తెలియజేశారు. అమరావతి పేరుతో జగన్ ను దూషిస్తున్నారని, పెద్ద భవనాల పేరుతో బడ్జెట్ పెంచేస్తున్నారని మండిపడ్డారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం ఆపడానికి చంద్రబాబు నాయుడు క్లోజ్ డోర్ మీటింగ్ లో ఒప్పుకున్నారని, లోపాకారి ఒప్పందం వల్లనో, తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డితో సంబంధాల వల్లనో ఆపేశారని విమర్శించారు. జగన్ సంధించిన ప్రశ్నలకు చంద్రబాబు, ఆయన మీడియా సమాధానం చెప్పాలి? అని అన్నారు. అమరావతిలో మొదటి 50 వేల ఎకరాల్లోనే అభివృద్ధి లేదని.. మొదటి దశ అభివృద్ధి లేకుండానే రెండో దశ భూసేకరణ ఏంటి? అని ప్రశ్నించారు. తెలంగాణ అసెంబ్లీ 10 లక్షల చదరపు అడుగులు మాత్రమేనని, పార్లమెంట్ కూడా 7 లక్షల చదరపు అడుగులు అని అన్నారు. కానీ, అమరావతిలో 50 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో సచివాలయ భవనాలు నిర్మిస్తామంటున్నారని చెప్పారు. రైతుల ప్రాణాలు పోయే పరిస్థితి వచ్చిందని, రైతులను చంద్రబాబు భ్రమల్లో పెడుతున్నారు. అమరావతిలో ఇంటర్నెల్ స్కామ్ లు చాలా ఉన్నాయని, తనకు ఏం అక్కర్లేదు.. అమరావతికి నిధులు ఇస్తే చాలని బాబు అంటున్నారని చెప్పారు. అమరావతిలో నీళ్లు ఎత్తిపోయడానికే వేల కోట్లు పెడుతున్నారని, అమరావతి పేరుతో చంద్రబాబు రాష్ట్ర ఖాజానాను కొల్లగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మాణాల పేరుతో భారీ దోపిడీ జరుగుతోందని, మొబలైజేషన్ అడ్వాన్సులతో దోచుకుంటున్నారని సజ్జల ధ్వజమెత్తారు.

## మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కల్పించాల్సిందే

పూలే దంపతులకు భారతరత్న అవార్డులు ఇచ్చి కేంద్రం గౌరవించాలి
పార్లమెంటులో పోలే సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలు నెలకొల్పాలి
బీసీ రిజర్వేషన్లు 42 శాతం మించిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలి
బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్



నిజామాబాద్ జనవరి 10 బీసీ మహిళలకు ప్రాతినిధ్యం లేని మహిళా బిల్లు ను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, కేంద్ర ప్రభుత్వానికి బీసీల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాల్సిందేనని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు నేడు నిజామాబాద్ పట్టణంలోని న్యూ అంబేద్కర్ ఆడిటోరియంలో బీసీ ఉపాధ్యాయ సంఘం నిజామాబాద్ శాఖ ఆధ్వర్యంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు, చదువుల తల్లి సావిత్రిబాయి పూలే 195వ జయంతి ఉత్సవాలు జిల్లా అధ్యక్షులు మాదవేడి వినోద్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, నిజామాబాద్ రూరల్ శాసనసభ్యులు ఆర్ భూపతిరెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్న గారికి విఠల్ రావు, జిల్లా విద్యాశాఖ అధికారి పార్శి అశోక్ తదితరులు పాల్గొన్నారు ముందుగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో పోరాడి సావిత్రిబాయి పూలే జయంతి రోజైన జనవరి మూడో తేదీని మహిళా ఉపాధ్యాయ దినోత్సవం అధికారికంగా ప్రకటించిందని, అదేవిధంగా హైదరాబాదులో పూలే సావిత్రిబాయి పూలే విగ్రహాలను ప్రభుత్వ పరంగా ఏర్పాటు చేస్తున్నారని ఆయన తెలిపారు, ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వం కూడా సామాజిక సంఘసంస్కర్త అయినటువంటి మహాత్మ జ్యోతిబాపూలే సావిత్రిబాయి పూలే పుణ్య దంపతులకు భారతరత్న అవార్డులు ప్రకటించి గౌరవించాలని అలాగే వారి విగ్రహాలను భారత పార్లమెంటులో ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు కేంద్ర ప్రభుత్వం మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలనే ఉద్దేశంతో చట్టసభలలో మూడోవంతు రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంట్లో చట్టం చేసిందని, ఈ చట్టం వలన బీసీ మహిళలకు ఎలాంటి ప్రయోజనం ఉండదని ఆయన తెలిపారు ప్రస్తుతం అసెంబ్లీలో కొనసాగుతున్న అగ్రకులాల తరతరాలుగా తిష్ట వేశారని, మహిళా బిల్లు పేరుతో వారి భార్యలు వారి కుటుంబ సభ్యులు మాత్రమే చట్టసభలోకి రాగలుగుతారని అవమానాలను, వివక్షత ఎదుర్కొన్నటువంటి బీసీ మహిళలకు బీసీలకు సబ్ కోటా కూడా లేకపోవడంతో చట్టసభలోకి వచ్చే అవకాశం లేదన్నారు అందుకే మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోట కల్పించినప్పుడే మహిళా బిల్లుకు పరిపూర్ణత వస్తుందని ఆయన తెలిపారు బీసీల విద్యా ఉద్యోగ రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు సాధించి తీరుతామని, ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువచ్చి బీసీ రిజర్వేషన్ల అంశాన్ని ఎజెండాగా చేసుకునేలా అన్ని పార్టీలపై ఒత్తిడి పెంచామని ఆయన వెల్లడించారు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతనే మున్సిపల్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సహకార ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. పూలే సావిత్రిబాయి పూలే ఆశయాలను బీసీ సమాజం ముందుకు తీసుకుపోవాలని ఊరికి ఒక మహాత్మ పూలే, ఇంటికొక సావిత్రిబాయి పూలేలు కావాలని జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపు ఇచ్చారు. నిజామాబాద్ రూరల్ శాసనసభ్యులు ఆర్ భూపతి రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే తెలంగాణలో కులగనన నిర్వహించి బీసీల జనాభా 56 ఉందని అధికారికంగా వెల్లడించామని బీసీ జనాభా ఆధారంగా రిజర్వేషన్లు కల్పించాలని అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి చట్టం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించిన కేంద్రంలో కొద్దిగా కూడా చలనం లేదని, బీసీ రిజర్వేషన్లు పెంచే బాధ్యత బిజెపి నేతలపై ఉన్నప్పటికీ అది విస్మరించి, బీసీ రిజర్వేషన్లు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడంలో అర్థం లేదని ఆయన అన్నారు కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి కట్టుబడి ఉందని బీసీలకు అన్ని విధాలుగా న్యాయం చేయడానికి తమ ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన తెలిపారు రాజకీయాల కచ్చితంగా ఐక్యంగా ఉంటే సాధించలేనిది దంటు ఏదీ లేదని ఐక్యమత్యం ద్వారానే బీసీలు అభివృద్ధి చెందుతారని భూపతి రెడ్డి తెలిపారు జయంతి ఉత్సవాల సందర్భంగా వివిధ రంగాలలో అత్యంత ప్రతిభ కనబరిచిన మహిళలకు, సామాజిక సేవ లో నిమగ్నమైన మహిళలకు సావిత్రిబాయి పూలే అవార్డులతో సత్కరించారు ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహ అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం చంద్రశేఖర్ గౌడ్,గోపాల కృష్ణ చారి, నరాల సుధాకర్, శ్రీలత, యన్ విజయలక్ష్మి, బుస్స ఆంజనేయులు, శ్రీనివాస్, రమణ, కరిపే రవీందర్ తదితరులు పాల్గొన్నారు

# నా కల నెరవేరింది... జగ్గారెడ్డి

పదేళ్ల నుండి ఈరోజు కోసం ఎదురుచూస్తున్న సదాశివపేట ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం కంటే మించిన సంతోషం నాకు లేదు.

సదాశివపేటలో ఇంటి జాగా లేని వారందరికీ ఇళ్ల స్థలాలు అందించే బాధ్యత నాది.జగ్గారెడ్డిగా నేను మాట ఇస్తున్నాను.







**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జనవరి 10(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా** :సదాశివపేట/తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి శనివారం నాడు సదాశివపేటలో పర్యటించారు, గతంలో తను ఇచ్చిన ఇళ్ల స్థలాల పట్టాదారులతో సమావేశం అయ్యారు,జగ్గారెడ్డితో పాటు తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి పాల్గొన్నారు,సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడుతూ 2013లో ఉమ్మడి రాష్ట్రం లో కిరణ్ కుమార్ రెడ్డి హయాం లో సదాశివపేట పట్టణం లో ఇళ్ల స్థలాలు లేకుండా కిరాయి ఇళ్లలో ఉన్న పేదలకు 182 ఎకరాల లో ఇళ్ల స్థలాలు ఇచ్చాం రైతుల నుండి మూడు లక్షల కు ఎకరా చొప్పున కొని భూమి ఇచ్చిన 222 మంది రైతులకు సైతం ఇళ్ల స్థలాలు ఇచ్చి సదాశివపేట పట్టణ వాసుల తో పాటు, సదాశివ పేట మండలం లోని పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చాం,ఒక్కొక్కరికి 80 గజాల చొప్పున 5300 మందికి పట్టలిచ్చిన 2014లో కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాడు, సంగారెడ్డి లో టీఅర్ఎస్ ను గెలిపించారు,రాష్ట్రంలో అధికారంలో లేదు,నేను ఎమ్మెల్యే గా లేను పవర్ లేదు,నేను ఇచ్చిన సమయం లోనే కబ్జాలోకి రండి అని చెప్పిన ఎవరు రాలేదు, టీఅర్ఎస్ హయాంలో ఈ ప్లాట్ల వద్దకు పట్టా దారులు వస్తె పోలీసులతో బెదిరించి వెళ్లగొట్టారు,పవర్ లేకపోవడంతో నేను ఏం చేయలేకపోయిన నేను రాజకీయాల లో ఉంటా... కానీ ఎమ్మెల్యే గా పోటీ చేయ,నేను ఓట్లు అడగను ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డితో ఏడాది కింద మాట్లాడిన రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తో ,కలెక్టర్ల తో మాట్లాడిన నెల రోజుల కింద కలెక్టర్ తో సమావేశమైన ఈ పది సంవత్సరాలు టీఅర్ఎస్ హయాంలో మీకు ప్లాట్ల కోసం ఇచ్చిన భూమి 180 ఎకరాలలో 52 ఎకరాలు డబుల్ బెడ్ రూం లకు మీ సదాశివపేట లీడర్ ఇచ్చిండు 50 ఎకరాల్లో కట్టిన డబుల్ బెడ్ రూంలలో కేవలం 320 మంది కి ఇచ్చారు,80 గజాల చొప్పున 50 ఎకరాల్లో 2011 మంది కి ఇవ్వొచ్చు అదే జాగాలో 50 ఎకరాల్లో 320 మందికి ఇచ్చినాడు మీ సదాశివపేట లీడర్,మీ ఊరు లీడర్ కు,హరీష్ రావుకు తెలివి లేదు,10 ఎకరాల్లో మైనార్టి కాలేజీ,10 ఎకరాలలో గ్రౌండ్ 10 ఎకరాలు ఖాళీగా ఉంది,5300 మందికి సర్టిఫికెట్లు ఉన్నాయి,మీ ఊరు లీడర్,హరీష్ రావు కలిసి చేసిన తప్పిదానికి 180 ఎకరాలకు ఇప్పుడు 88 ఎకరాలు మిగిలింది,ఉన్న 88 ఎకరాల్లో స్కూల్ కు, దవాఖాన కు , మూడు మతాల ఆలయాలకు జాగా పోను 36 ఎకరాలు మిగిలింది,36 ఎకరాల్లో 2011 మందికి 80 గజాల చొప్పున వస్తది,2011 మందికి ఇక్కడ భర్తీ చే సే అవకాశం ఉంది కేవలం సదాశివపేట పట్టణానికి చెందిన వారికి మాత్రమే ఇస్తాం ఇంకా మిగిలిన వారికి ఇళ్ల స్థలాలు కావాలంటే 100 ఎకరాలు కావాలి వ్యవసాయం చేయని, పంటలు పండని బీడు భూమి చూడమని, అధికారులకు, నాయకులకు చెప్పిన గతంలో సర్టిఫికెట్ ఉన్న వారికి ఇంటి స్థలం ఉన్నవారికి ఫస్ట్ ప్రయారిటీ,ఆ తర్వాత మిగతా వారికి ఇదివరకే స్థలం ఉన్నవారికి స్వయాన నేను రికమెండ్ చేసిన ఇవ్వద్దని కలెక్టర్ కు చెప్పిన ఈ స్థలంలో రోడ్లు, కరెంట్ స్థంబాలు ఏపిస్తా సదాశివపేట పట్టణంలో గతంలో సర్టిఫికెట్ లు ఇచ్చిన వారందరికీ ఇంటి స్థలం వస్తది ఇది జగ్గారెడ్డి మాట... జగ్గారెడ్డి మాట ఇస్తే... అయ్యి తీరుతుంది,మిగిలిన వారికి సదాశివపేట ఐబి వెనుకాల వెంకటాపూర్ రోడ్ లో భూమి చూడమని అధికారులకు చెప్పిన, అక్కడ కేటాయిస్తా ఇప్పుడు స్థలాలు ఇస్తా వచ్చే ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపిస్తా కులాలు, మతాలకు అతీతంగా ఇల్లు లేని పేదలకు ఇంటి స్థలాలు ఇస్తాం సగటు మనిషి నెలకు లక్ష రూపాయలు, నెలకు కోటి రూపాయలు సంపాదించిన సరే రోజుకు 100 రూపాయల తిండి కంటే ఎక్కువ తినలేరు సామాన్యులు పేదల బతుకులే సంతోషం,ఎద్దైన తినగలం,కోటీశ్వరుడికి కోడి తింటే అరగదు మీకు ఇళ్ల స్థలం ఇస్తే నెలకు ఐదువేల కిరాయి తప్పుతది జగ్గారెడ్డిగా నేను ఇచ్చిన మాట అమలవుతుంది పట్టా సర్టిఫికెట్లు లేనివారికి సైతం దరఖాస్తు చేసుకుంటే ఇంటి స్థలం ఇస్తాం 2012లో ఐదువేల మందికి ఇంటి స్థలాలు ఇస్తే 2014 లో ఎమ్మెల్యే గా పోటీ చేసినప్పుడు సదాశివపేట టౌన్ లో నాకంటే టీఅర్ఎస్ పార్టీకి మూడువేల ఓట్లు ఎక్కువ ఇచ్చారు,నేను ఆ రోజు గెలిచి ఉంటే, మీరు మీ ప్లాట్ల లో కబ్జా లో ఉండేవారు కదా...2018లో ఎమ్మెల్యేగా గెలిచిన అప్పుడు కూడా సదాశివపేటలో నాకంటే 3వెలు ఎక్కువ మెజారిటీ ఇచ్చారు,మొన్న ఎన్నికల్లో నేను నిలబడ అన్నా, అయినా నిలబెట్టారు, మొన్న ఎన్నికల్లో సైతం నాకంటే టీఅర్ఎస్ కు ఆరువేల మెజారిటీ ఎక్కువ ఇచ్చునరు మీరు ఈ మూడు ఎన్నికల్లో జాగ్రత్తగా ఉంటే మీ ప్లాట్ల మీకు వచ్చేవి కదా మీ ఓటు మీ బలం.... మీ ఓటు ను పైసల కో , మందు కో అమ్ముకోకుండ, మీ బతుకు దెరువు కోసం వాడుకోండి,పదేళ్లుగా మీరు ఎదురు చూస్తున్న ప్లాట్లు, రెండు నెలల్లో వస్తాయి,ఇదే జాగలో మీకు స్థలాలు ఇచ్చి మీతో కలిసి భోజనం చేస్తా 2011 మందికి ఇక్కడా మిగతా వారికి వెంకటాపూర్,నిజాంపూర్ రోడ్లో ఇస్తా మీకు టౌన్ లో 60,70 గజాల్లో ప్లాట్ ఉంటే ఇందిరమ్మ ఇల్లు ఇస్తాం ఇందిరమ్మ ఇళ్లు కొత్తగా దరఖాస్తు చేసుకునే వాళ్ళు 20వ తేదీ తర్వాత మున్సిపల్ కమిషనర్ కు దరఖాస్తు చేసుకోండి నా పదేళ్ల కోరిక ఇది, పదేళ్ల నుండి ఈ రోజు కోసం ఎదురచూస్తున్న .. మీ అందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వడ మే ఆనందం అంతకంటే ఎక్కువ ఆనందం నాకు లేదు అని అన్నారు.

## కేవలం సిఎం,సిఎస్ మాత్రమే అధికారులను మాత్రమే బదిలీ చేస్తారు

టిక్కెట్ల ధరల పెంపు సంబంధించి ఏ ఫైల్ తన వద్దకు రాలేదు

బెనిఫిట్ షోల కోసం తనను ఎవరూ సంప్రదించలేదు

కుటుంబాలను ఇబ్బంది పెట్టేలా రాతలు రాయొద్దని మంత్రి కోమటిరెడ్డి హితవు



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** జనవరి 10 కేవలం సిఎం,సిఎస్ మాత్రమే అధికారులను మాత్రమే బదిలీ చేస్తారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. కుటుంబాలను ఇబ్బంది పెట్టేలా రాతలు రాయొద్దని హితవు పలికారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ...మహిళా ఐఎస్-ఎస్ పై దుష్ప్రచారం చేయడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల తర్వాత నల్గొండకు నలుగురు కలెక్టర్ల మారారని, తన జిల్లాలోనే కాదు..మంత్రులు, ఎమ్మెల్యేలకు తెలియకుండానే బదిలీలు జరుగుతాయని తెలియజేశారు. మంత్రులపై ఇటీవల వస్తున్న ఆరోపణల్ని కోమటి రెడ్డి ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కలెక్టర్ల బదిలీలు, పదోన్నతులు సర్వసాధారణం అని.. అధికారుల మీద అభాండాలు వేయటం సరికాదని అన్నారు. రేటింగ్ లు, వ్యూస్ కోసం దుష్ప్రచారం సరికాదని, అధికారుల కుటుంబాల గౌరవం గురించి కూడా ఆలోచించాలని సూచించారు. సినిమా పరిశ్రమపై ఇంకా దృష్టి పెట్టలేదని, పుష్ప సినిమా తర్వాత బెనిఫిట్ షోలు, టికెట్ ధరల పెంపు ఉండదని చెప్పానని అన్నారు. బెనిఫిట్ షోలు, టికెట్ల పెంపు కోసం తన వద్దకు రావొద్దని చెప్పానని, సినీ పరిశ్రమ గురించి పట్టించుకోవడం మానేశానని, టిక్కెట్ల ధరల పెంపు సంబంధించి ఏ ఫైల్ తన వద్దకు రాలేదని చెప్పారు. బెనిఫిట్ షోల కోసం తనను ఎవరూ సంప్రదించలేదని, సంధ్య థియేటర్ బాధిత కుటుంబానికి రూ. 25 లక్షలు అందించానని తెలియజేశారు. బాధిత బాలుడిని చదివిస్తానని చెప్పానని, చిత్ర పరిశ్రమ సమస్యల కంటే ప్రజల సంక్షేమం, అభివృద్ధి పనులే తనకు ప్రాధాన్యత ఇచ్చానని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు.

## సెయోక్ ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ కి 31మంది శ్రీ చైతన్య విద్యార్థుల ఎంపిక




**ఖమ్మం ప్రతినిధి జనవరి 10 (ప్రజాబలం)** స్థానిక పొన్నేకల్‌లోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో వర్చువల్ గా నిర్వహించిన ప్లేస్మెంట్ డ్రైవ్‌లో సెయోక్ ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ సంస్థలో 31 మంది విద్యార్థులు వార్షికంగా రూ.6 లక్షల వార్షిక వేతనంతో ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డా. జె. లక్ష్మి నారాయణ తెలిపారు సెయోక్ ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ హెచ్.ఆర్. మోనిక మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పాఠ్యపుస్తక జ్ఞానంతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, కోడింగ్ మరియు తాజా టెక్నాలజీలపై అవగాహన పెంపొందించుకోవాలి నిరంతర అభ్యాసమే విజయం సాధించడానికి ప్రధాన ఆయుధం అని సూచించారు కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సాయి గీతిక మాట్లాడుతూ శ్రీ చైతన్య యజమాన్యం విద్యార్థులపై చూపుతున్న విశేషమైన శ్రద్ధ వల్ల రికార్డు స్థాయిలో ప్రాంగణ నియామకాలు జరుగుతున్నాయి అని రాబోయే రోజులలో మరిన్ని ప్రాంగణ నియామకాలు జరపడానికి కావాల్సిన ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలియపరిచారు కళాశాల చైర్మన్ శ్రీ మల్లంపాటి శ్రీధర్ మాట్లాడుతూ ప్రాంగణ నియామకలలో సెలెక్ట్ అయిన విద్యార్థులను అభినందిస్తూ,వంద శాతం నియామకాలు జరిగేలాగా చర్యలు తీసుకున్నట్లు తెలియపరిచారు కళాశాల డైరెక్టర్ శ్రీవిద్య మాట్లాడుతూ విద్యార్థులు ప్లేస్మెంట్ అవకాశాలకు సిద్ధమవ్వడానికి మాక్ ఇంటర్వ్యూలు, టెక్నికల్ ట్రైనింగ్‌లు నిర్వహిస్తున్నాము ఈ కృషి ఫలితంగా ప్రతిభావంతులైన విద్యార్థులు ప్రతిష్టాత్మక సంస్థల్లో స్థానం సంపాదిస్తున్నారు అని అన్నారు విద్యార్థులు ఉద్యోగాలు పొందడానికి కావలసిన శిక్షణ ను ప్రథమ సంవత్సరం నుంచి ఇస్తున్నామని, అది విద్యార్థులకు ఎంతో తోడ్పాటు ఇస్తుందని ఎంపికైన విద్యార్థులను అభినందించారు ఈ సందర్భంగా కళాశాల డీన్ డాక్టర్ వి సుదర్శన్, టి పి ఓ డాక్టర్ రాజేష్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వైశాలి, డిప్లమా ఇన్చార్జి కృష్ణ ప్రసాద్, డాక్టర్ జ్యోతి, డాక్టర్ ప్రణతి, డాక్టర్ చార్యులు, సురేష్ ఎన్నికైన విద్యార్థులకి అభినందనలు తెలిపారు





## సిద్దిపేట జిల్లాను తొలగిస్తామని ఎక్కడా చెప్పలేదు: మంత్రి పొన్నం

**ప్రజాబలం ప్రతినిధి:** హుస్నాబాద్ జనవరి 10 సిద్దిపేట జిల్లాను తొలగిస్తామని ఎక్కడా చెప్పలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సిద్దిపేట జిల్లాను రద్దు చేస్తాంటే తాను ఊరుకోనని హరీష్ రావు హెచ్చరించిన సందర్భంగా పొన్నం కౌంటర్ ఇచ్చారు. కెసిఆర్ ప్రభుత్వంలో జిల్లాల విభజన శాస్త్రీయంగా జరగలేదని, హుస్నాబాద్ మండల ప్రజలు సిద్దిపేటలో ఉండాలను కోవడం లేదని, కరీంనగర్ జిల్లాలో కలపాలని కోరుతున్నారన్నారు. కెసిఆర్ ప్రభుత్వంలో ఇష్టానుసారంగా జిల్లాల విభజన చేశారని, ప్రజల నుంచి వినతులు కూడా పట్టించుకోలేదన్నారు. పలు జిల్లాల హద్దులు మారుతాయని జిల్లాల పేర్లు మారవని స్పష్టం చేశారు. ప్రజల బలమైన ఆకాంక్షల మేరకే జిల్లాల పునర్ వ్యవస్థీకరణ జరుగుతుందని పొన్నం స్పష్టం చేశారు. ఆందోళనతో రాజకీయ లబ్ధి పొందే ప్రయత్నం చేయవద్దని హరీష్‌రావుకు పొన్నం చురకలంటించారు. సిద్దిపేట జిల్లా రద్దు చేస్తామంటే ఊరుకోమని, తనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోపం సిద్దిపేట జిల్లా చూపించడం సరికాదని బిఆర్ఎస్ ఎంఎల్ఏ హరీష్ రావు వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే.

# రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్ర గ్రంథాలయంలో అధికారుల నిర్లక్ష్యం

## తెరుచుకోని గ్రంథాలయం.. ఎండలో విద్యార్థుల అవస్థలు!

## ప్రశ్నిస్తే అధికారుల కక్ష సాధింపు



**రాజన్న సిరిసిల్ల, జనవరి 10 (ప్రజాబలం ప్రతినిధి)**రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్ర గ్రంథాలయంలో అధికారుల నిర్లక్ష్యం పరాకాష్టకు చేరింది. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు, గ్రంథాలయాల బలోపేతానికి ప్రాధాన్యత ఇస్తున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ప్రతిరోజూ ఉదయం 8 గంటలకే తెరుచుకోవాల్సిన గ్రంథాలయం, నేడు ఉదయం 10:45 గంటలు దాటినా గేట్లు తీయకపోవడంతో అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండిపోతున్న ఎండలో నిరీక్షించారు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులు, విద్యార్థులు ఉదయాన్నే గ్రంథాలయానికి చేరుకోగా, తాళం వేసి ఉండటంతో గంటల తరబడి గేటు బయటే నిలబడాల్సి వచ్చింది.



పర్యవేక్షణ లోపం వల్ల ఉదయం 11 గంటలు కావస్తున్నా ఏ ఒక్క సిబ్బంది కూడా రాకపోవడం అధికారుల బాధ్యతారాహిత్యానికి అద్దం పడుతోంది. విద్యార్థులు ॥లైబ్రరీలో కనీస వసతులు లేవని గతంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినందుకు, అధికారులు మాపై కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తున్నారు॥ అని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత పెద్ద గ్రంథాలయానికి కనీసం ఒక వాచ్‌మెన్ కూడా లేకపోవడం గమనార్హం. ఏదైనా వసతి కావాలని అడిగితే ‹బడ్జెట్ లేదు› అని అధికారులు సమాధానం ఇస్తున్నారని విద్యార్థులు వాపోతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చదువులకు పెద్దపీట వేస్తున్న తరుణంలో, ఇలాంటి నిర్లక్ష్యపూరిత అధికారులు ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్నారని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, గ్రంథాలయ సమయపాలన సరిచేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# గ్రామాన్ని పరిశుభ్రంగా, హరిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

## గ్రామపంచాయతీ కార్యాలయం వెనుక నూతన నర్సరీ ప్రారంభించిన సర్పంచ్ బానోతు జ్యోతి కొంఢ



**బోనకల్ ప్రతినిధి జనవరి 10 (ప్రజాబలం)**గ్రామ అభివృద్ధిలో భాగంగా గ్రామపంచాయతీ కార్యాలయం వెనుక భాగంలో నూతనంగా ఏర్పాటు చేసిన నర్సరీని సర్పంచ్ బానోతు జ్యోతి , ఉప సర్పంచ్ కొండ శనివారం శుభారంభం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...పర్యావరణ పరిరక్షణ, గ్రామంలో పచ్చదనం పెంపొందించడమే ప్రధాన లక్ష్యంగా ఈ నర్సరీని ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు గ్రామాన్ని పరిశుభ్రంగా హరిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నర్సరీ ద్వారా వివిధ రకాల పూల మొక్కలు, ఔషధ మొక్కలు, నీడనిచ్చే మొక్కలను పెంచి గ్రామంలోని ఖాళీ స్థలాలు, రోడ్ల ఇరువైపులా, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద నాటనున్నట్లు పేర్కొన్నారు. ఈ నర్సరీ గ్రామ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో కూడా దోహదపడుతుందని, స్వచ్ఛ గ్రామ-హరిత గ్రామ లక్ష్య సాధనకు ఇది కీలకంగా మారుతుందని సర్పంచ్ జ్యోతి అన్నారు. గతంలో ఈ నర్సరీ స్మశానం వాటికి దగ్గర ఉండేదని అక్కడ మొక్కల సంరక్షణ ఇబ్బందికరంగా మారుతుందని అందుకనే ఆ నర్సరీని పంచాయతీ ఆఫీసు వెనక భాగంలో మార్చినట్లు వారు తెలిపారు కార్యక్రమంలో వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. గ్రామస్తులు ఈ నర్సరీని సద్వినియోగం చేసుకొని ప్రతి ఇంటి ముందు ఒక మొక్క నాటాలని సర్పంచ్ కోరారు



# కోడిపందాల స్థావరంపై పోలీసుల దాడి

**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి జనవరి 10** : మంచిర్యాల జిల్లాలోని లక్షెట్టిపేట మండలంలోని గుల్లకోట గ్రామ శివారులోని రహస్య ప్రదేశంలో కోడిపందాలు నిర్వహిస్తున్నారు అన్న సమాచారంతో లక్షెట్టిపేట ఎస్ఐ గోపతి సురేష్ సిబ్బందితో కలిసి సోదాలు నిర్వహించారు. కోడిపందాలు ఆడుతున్న ఆరు గురు వ్యక్తులతో పాటు ఒక కోడి, 900 రూపాయల నగదును స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించి వారు. నిందితుల పేర్లు1). పసుపునుటి సాయి, 2). గుర్రాల శ్రీకాంత్3). సుందిళ్ల సురేష్ 4). కారుకూరి అనిల్ 5). అక్కల గణేష్6). ఎర్ర వేణి గణేష్ విరి పై లక్షెట్టిపేట ఎస్సై గోపతి సురేష్ కేసు నమోదు చేశారు.

# గండిపేట మండల ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా ప్రతాపని ప్రభాకర్ రావు




**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 10 జనవరి 2026**శనివారం రోజున మణికొండలో గండిపేట మండల ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షునిగా ప్రతాపని ప్రభాకర్ రావు, కార్యదర్శిగా గంగిశెట్టి నవీన్ కుమార్, కోశాధికారిగా వైయస్ బాబుల ఎన్నిక రాష్ట్ర కార్యదర్శి అర్థం లక్ష్మయ్య, సినీ నటుడు రాష్ట్ర మహాసభ ఈసీ మెంబర్ శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు గంది సురేష్, కార్యదర్శి బిల్లకంటి కిరణ్, కోశాధికారి బద్రీనాథ్ సమక్షంలో నూతన కమిటీ ప్రమాణ స్వీకారం జరిగింది. వక్తలు మాట్లాడుతూ ఆర్యవైశ్య మహాసభ యొక్క విశిష్టత గురించి వివరించడం జరిగింది, రంగారెడ్డి జిల్లాలోని గండిపేట మండలానికి అత్యధిక సంఖ్యలో ఆర్యవైశ్య మహాసభకు మెంబర్షిప్ చేయించడానికి చాలా అవకాశాలు ఉన్నాయని అందుకు జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ గండిపేట మండల కమిటీకి బాధ్యతలు ఎక్కువగా ఉన్నాయని వివరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి అతిథులుగా రంగారెడ్డి జిల్లా అవోపా అధ్యక్షులు బొడ్డు శ్రీధర్, వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఓలం యాదగిరి తదితరులు పాల్గొనడం జరిగింది.

# ఓటమి గెలుపుకు నాంది కావలి: డాక్టర్ మెతుకు ఆనంద్



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి జనవరి 10 (ప్రజాబలం) :** మర్పల్లి,వికారాబాద్ జిల్లా బి ఆర్ ఎస్,పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్మర్పల్లిమండలం దార్గులపల్లిగ్రామ సర్పంచ్ అభ్యర్థి ×లక్ష్మి కృష్ణ గారిని, బిల్కల్,గ్రామ సర్పంచ్ అభ్యర్థి నర్సింలుమరియు మల్లికార్జునగిరిగ్రామ సర్పంచ్ అభ్యర్థి నిర్మల శేఖర్ ని కలిసారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో పార్టీ నాయకులు మరియు కార్యకర్తలతో సమావేశమై, పలు రాజకీయ విషయాలు చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ శ్రేణులు ఎక్కడ దిగులు చెందరాదు, రాబోయేది మన ప్రభుత్వమే కాబట్టి రెట్టింపు ఉత్సాహంతో ప్రజల్లోకి వెళ్లాలి. గ్రామస్థాయిలో పార్టీ బలంగా ఉంది అందుకే సర్పంచ్ అభ్యర్థులకు ఆ మేరకు ఓటుశాతంవచ్చింది,కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య పాలనతో రాష్ట్ర ప్రజల్లో అసంతృప్తి నెలకొంది కెసిఆర్ పాలనలో రాష్ట్రంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలు ఎప్పటికి మర్చిపోలేరుమళ్ళీ కేసీఆర్వస్తేనే రాష్ట్రం బాగుపడుతుందని ప్రజలు విశ్వసిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మర్పల్లి మండల టిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.



# చికిత్స పొందుతూ మృతి



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి జనవరి 10** : మంచిర్యాల జిల్లాలోని లక్షెట్టిపేట మున్సిపాలిటీలోని గంపలపల్లికి చెందిన అగ్గు రమేష్ అనే 32 సంవత్సరాల వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుని చికిత్స పొందుతూ శనివారం రోజున కరీంనగర్ ఆసుపత్రిలో మృతి చెందాడు. మృతునికి మానసిక పరిస్థితి బాగోలేక గత పది సంవత్సరాల నుండి కరీంనగర్ లోని ప్రశాంతి ఆసుపత్రిలో వైద్యులకు చూయించుకొని మందులు వాడుతుండు. మందులు వాడిన తన మానసిక పరిస్థితి బాగుపడలేదు. తరచు ఆయనే చనిపోతానని అందరం ఒకసారి చనిపోయే వాళ్ళం అంటూ చెప్పేవాడని గత కొన్ని సంవత్సరాల క్రితం ఇలానే అంటూ ఆత్మహత్యకు పాల్పడగా కుటుంబ సభ్యులు గమనించి ఆసుపత్రిలో చికిత్స చేయించి దక్కించుకున్నారు అదే క్రమంలో ఈనెల 8వ తారీకు రోజు ఊట్కూరు శివారులోని వాళ్ళ సొంత పొలంలో గడ్డికి కొట్టే మందు తాగి ఇంటికి వచ్చి వాంతులు చేసుకొని కుటుంబ సభ్యులకు మందు తాగిన విషయం చెప్పడంతో కుటుంబీకులు స్థానికుల సాయంతో దక్షిణ ప్రభుత్వ తరలించి ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు మృతుని భార్య పెంకర్ల ప్రోనూష అగ్గు లక్ష్మి ఫిర్యాదు మేరకు లక్షెట్టిపెట ఎస్సై గోపతి సురేష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయడం జరుగుతుందని తెలిపారు.

# పట్లూర్, విలేజ్ ప్రెసిడెంట్ అశోక్ కుటుంబాన్ని పరామర్శించిన డాక్టర్ మెతుకు ఆనంద్,



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి జనవరి 10(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:**మర్పల్లి మండలం పట్లూర్,గ్రామ కమిటీ అధ్యక్షులు గొల్ల ముసలి అశోక్,నాన్నమ్మ మాణెమ్మ రెండు రోజుల క్రితం మరణించడంతో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులతో కలిసి వారి నివాసానికి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించిన వికారాబాద్ జిల్లా బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, పట్లూర్ మాజీ సర్పంచ్ దేవరదశి ఇందిరా అశోక్, మర్పల్లి మండల్ బి ఆర్ ఎస్, ప్రెసిడెంట్ రావులపల్లి సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి, బానోత్ సునీల్, మాజీ ఎంపిటిసి అంజయ్య, మాజీ ఉపసర్పంచ్ బషీర్, మధు, యాదయ్య,వికాస్, బాలేష్,తలారి రమేష్, సంతు, హరి సింగ్, ఉప సర్పంచ్ మోహన్, రాందాస్ బి ఆర్ఎస్ కుటుంబ సభ్యులు అశోక్ కుటుంబాన్ని పరామర్శించడం జరిగిందని తెలిపారు

# విజయవాడ ఇంద్రకీలాద్రిపై భక్తులకు కరెంట్ షాక్

విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో ఉద్రిక్తత నెలకొంది. ఉచిత ప్రసాద వితరణ కేంద్రం వద్ద భక్తులకు విద్యుత్ షాక్ తగలడంతో కలకలం రేగింది. ఈ ఘటనకు అధికారుల నిర్లక్ష్యమే కారణమని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిస్థితి తీవ్రతను గమనించిన ఆలయ అధికారులు వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేసి, ప్రసాద పంపిణీని తాత్కాలికంగా ఆపేశారు. ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపట్టి, మరమ్మతులు నిర్వహించిన అనంతరం పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు తెలిపారు.

# పట్లూర్ సర్పంచ్ పరుశురాం,ను సన్మానించిన జడ్పిహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయ బృందం




**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి జనవరి 10 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం పట్లూర్ జెడ్ పి హెచ్ ఎస్ ప్రధాన ఉపాధ్యాయులు టీచర్స్ బృందం కలసి గ్రామ సర్పంచ్ పరుశురాం, ఉపసర్పంచ్ అఖిల్, ను ఘనంగా సన్మానించి గ్రామ బాధ్యతలు స్వీకరించిన ప్రధమ పౌరులు గ్రామ సర్పంచ్ పరుశురాం,కు హ్యాపీ విషెస్ హ్యాపీ జర్నీ అని టీచర్స్ బృందం పూలమాలవేసి, శాలువాతో ,సన్మానించిన సంతోషం వ్యక్తపరిచారు

# ఆందోల్ నియోజకవర్గంలో సాగునీటి పనుల పురోగతిపై సమీక్ష

## నిర్వహించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జనవరి 10 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా:** రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, తన నివాసంలో అందోల్ నియోజకవర్గం లో, సాగునీటి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు, ఈ సమీక్షలో, సింగూరు కాలువల మరమ్మతులు, లైనింగ్ పనులను శరవేగంగా పూర్తి చేసి వచ్చే ఖరీఫ్ కు, సాగునీరు అందించాలని, మంత్రి అధికారులను ఆదేశించారు, పెద్దారెడ్డిపేట లిఫ్ట్ ఇరిగేషన్ పనులపై, ఈ సమావేశంలో చర్చించారు, నియోజకవర్గంలో 40, ఎకరాలకు, సాగునీరు అందించేలా చేపట్టనున్న పెద్దారెడ్డి పేట, లిఫ్ట్ ఇరిగేషన్, పనుల అంచనాలను, వెంటనే రూపొందించి ప్రభుత్వానికి నివేదించాలని, మంత్రి అధికారులను ఆదేశించారు, సింగూరు ప్రాజెక్టు మరమ్మతుల పనులపై, మంత్రి చర్చించారు, మరమ్మతుల పనులను చేపడుతున్న సందర్భంగా, సింగూర్ ప్రాజెక్టులో, నీటిని వృధా కాకుండా, విద్యుత్ ఉత్పత్తి తో పాటు, దిగువన ఉన్న ఘనపూర్ ఆయకట్టుతోపాటు, నిజాంసాగర్ ప్రాజెక్టు,ఆయకట్టుకు నీటిని తరలించి, రైతులకు ఉపయోగపడేలా చర్యలు చేపట్టాలని, మంత్రి దామోదర్ రాజనర్సింహ,అధికారులను ఆదేశించారు, ఈ సమీక్షలో (ఈఎన్సి) శ్రీనివాస్, (ఎస్ ఈ) రఘునాథ్, (ఈఈ) భీమ్ తదితరులు పాల్గొన్నారు....



# వేములవాడలో అభివృద్ధికి, సంక్షేమానికి పట్టం కట్టండి.

## ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.

## వేములవాడ మున్సిపల్ ,1,2 వార్డుల పరిధిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన. ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించిన విప్.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** అభివృద్ధి సంక్షేమానికి పట్టం కట్టాలని ప్రజలకు వేములవాడ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం వేములవాడ మున్సిపల్ విలీన గ్రామమైన శాతరాజు పల్లి ఒకటవ వార్డు, రెండవ వార్డు పరిధిలో 23 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న సిసి రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం కోసం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలు ఎక్కడ ఉంటే అక్కడ నిలబడి వాటిని పరిష్కరిస్తూ ముందుకు పోతున్నాము అన్నారు. శాతరాజు పల్లి లో సుమారు ఒక కోటి 43 లక్షల రూపాయలతో పేద ప్రజలకు ఉపయోగపడేలా ఆసుపత్రి నిర్మాణం పూర్తి కావస్తుందన్నారు. ఇక్కడ ఆస్పత్రి నిర్మాణం చేపట్టడం వలన చుట్టుపక్కల గ్రామాలకు శాతరాజు పల్లి ఒక హబ్ గా మారుతుందని తెలిపారు. త్వరలోనే ఆసుపత్రి ప్రారంభం చేసుకుందామన్నారు. శాతరాజు పల్లి లో సుమారు 15 లక్షల రూపాయలతో ప్రధాన కూడలిలో నూతన జంక్షన్ సుందరీకరణ పనులు జరుగుతున్నాయని విప్ తెలిపారు. 45 మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని వాటి నిర్మాణం శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఇందులో అడుగు స్థలం లేని 11 మందికి బస్సు డిపో ప్రక్కన ఇల్లు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటినుండి సుమారు ఒకటి, రెండు వార్డులకు నాలుగు కోట్ల పైచిలుకు నిధులు కేటాయించమని తెలిపారు. గత 50 సంవత్సరాలుగా వేములవాడ పట్టణ ప్రజలు ఎదురుచూస్తున్న చిరకాల కోరిక పట్టణంలో రోడ్డు వెడల్పు పనులు శరవేగంగా సాగుతున్నాయని, గత ప్రభుత్వం రాజన్న ఆలయాన్ని





అభివృద్ధి కేవలం రంగురంగుల వీడియోల మాత్రమే చేపట్టారని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో 150 కోట్ల రూపాయలతో రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. పట్టణంలో సుమారు 2000 మంది అడుగుజాడలేని ప్రజలకు స్థలం ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని తెలిపారు. 10 కోట్ల రూపాయలతో మురుగునీరు గుడి చెరువు, మూల వాగులో మురికి నీరు కలవకుండా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికలలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ముందుకు సాగుతున్నామని అందులో భాగంగా మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, నూతన రేషన్ కార్డులు మంజూరు చేసిందని ప్రతి ఒక్కరికి ఆరు కిలోలు చొప్పున సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రా(ష్టాన్ని గత పాలకులు అప్పు ఊబిలో ముంచారని విమర్శించారు. అయినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధి సంక్షేమని ఎక్కడ ఆపడం లేదన్నారు. కొత్తపేట చెరువు, బామట్ల కుంటలో నీటిని నింపుతామని హామీ ఇచ్చారు. కాలువలో ఏవైనా పిచ్చి మొక్కలు ఉంటే వాటిని తొలగించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మన్ రోడ్డి రాజు, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, మాజీ కౌన్సిలర్ సంఘ హనుమవ్వ, డిసిసి ఉపాధ్యక్షులు సంఘ స్వామి యాదవ్, నాయకులు లింగంపల్లి కిరణ్, పొన్నాల మోహన్, స్తంభం పెల్లి తిరుపతి, కిషన్, తిరుపతి, అంజయ్య, కొమురయ్య, లక్ష్మీరాజం తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడలో న్యాయవాదులు, కోర్టు సిబ్బందికి క్రికెట్ పోటీలు.

## టాస్ వేసి క్రీడలను ప్రారంభించిన సీనియర్ సివిల్ జడ్జ్ అజయ్ కుమార్ జాదవ్.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** శనివారం రోజున వేములవాడ కోర్టులో విధులు నిర్వహిస్తున్న న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కోర్టు కానిస్టేబుల్ లకు న్యాయవాదుల సంఘం అధ్యక్షులు గుడిసె సదానందం ఆదేశానుసారం సాంస్కృతిక క్రీడల కార్యదర్శి గుజ్జే మనోహర్ నేతృత్వంలో క్రికెట్ పోటీలను ఏర్పాటు చేశారు. ఈ క్రికెట్ పోటీలను వేములవాడ కోర్టు సీనియర్ సివిల్ జడ్జ్ అజయ్ కుమార్ జాదవ్ టాస్ వేసి క్రీడలను ప్రారంభించారు. ఈ క్రీడలలో కోర్టు సిబ్బంది, కోర్టు కానిస్టేబుళ్లు ఒక జట్టుగా, న్యాయవాదులు ఒక జట్టుగా ఏర్పడి క్రికెట్ ఆడారు.. ఎంతో రసవత్తరంగా సాగిన క్రికెట్ ఆటను సీనియర్ సివిల్ జడ్జి, జూనియర్ న్యాయవాదులు వీక్షించారు. క్రీడాకారులకు సీనియర్ సివిల్ జడ్జ్ టీ షర్టులను అందించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి గుడిసె సత్యనారాయణరెడ్డి, నాగుల సత్యనారాయణ, నేరెళ్ల తిరుమల గౌడ్, విద్యాసాగర్ రావు, శ్రీనివాస్, జనార్ధన్, క్రాంతి కుమార్, సుధాకర్ రెడ్డి, పొత్తూరి అనిల్ కుమార్, దివాకర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



# రాజన్న నిత్య అన్నదాన సత్రాన్ని పరిశీలించిన ఆలయ ఈవో.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం స్వామివారి నిత్య అన్నదాన సత్రాన్ని ఆలయ కార్య నిర్వహణ అధికారి (ఈవో) రమాదేవి శనివారం రోజున ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా అన్నదాన సత్రానికి వచ్చే భక్తులకు అందిస్తున్న భోజనం నాణ్యత, రుచి, పరిశుభ్రతపై భక్తులను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు సక్రమంగా ఉండాలని ఆలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకులు పూజిత, సీనియర్ అసిస్టెంట్ భాస్కర్, కూరగాయల శ్రీనివాస్ తో పాటు ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# రాజన్న ఆలయ అభివృద్ధి లో భాగంగా భారీ కంటైనర్ టాయిలెట్ల తరలింపు.




**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా శనివారం రోజు ఆలయ పార్కింగ్ ప్రాంగణంలో ఉన్న భారీ కంటైనర్ టాయిలెట్లను భక్తుల సౌకర్యార్థం శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలోని కోడెల క్యూ లైన్ లో, ఉచిత దర్శనం పక్కన ఏర్పాటు చేశారు. ఈ తరలింపు ప్రక్రియను రెండు భారీ క్రేన్ల సహాయంతో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు ఈ ఈ రాజేష్, డి ఈ రఘునందన్, ఏ ఈ రామకృష్ణారావు, ఏ ఈ ఓ అశోక్ కుమార్, తో పాటు శానిటేషన్, ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది మరియు ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు. భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించడం లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్టు ఆలయ అధికారులు తెలిపారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు బిజెపికి శ్రీరామరక్ష,

**వేములవాడ మున్సిపల్ ఈసారి బిజెపిదే.**
**వేములవాడ మున్సిపాలిటీపై కాషాయ జండా ఎగరవేయడం ఖాయం.**
**బిజెపి రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రెడ్డ బోయిన గోపి.రాజన్న దర్శనాలు పునరుద్ధరించాలి,**
**ఆలయ అభివృద్ధి పేరుతో కూల్చివేతలు ఆపాలి. బిజెపి నేతల డిమాండ్.**
**ఆకాశగంగా పైప్ లైన్ తెచ్చింది బిజెపి నే, వేములవాడ అభివృద్ధి బిజెపితోనే సాధ్యం.**
**వేములవాడలో బిజెపి నేతల మీడియా సమావేశం.**



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** శనివారం రోజున వేములవాడ పట్టణ బిజెపి శాఖ ఆధ్వర్యంలో స్థానిక పద్మశాలి సంఘ భవనంలో మీడియా మిత్రుల సమావేశం నిర్వహించడం జరిగింది. వేములవాడ పట్టణ బిజెపి అధ్యక్షుడు రా పెల్లి శ్రీధర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బిజెపి రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రెడ్డ బోయిన గోపి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్య క్షేత్రమైన రాజన్న ఆలయంలో దర్శనాలు నిలిపివేసి రెండు నెలలు కావస్తున్న ఎలాంటి అభివృద్ధి పనులు జరగడం లేదని విమర్శించారు. అభివృద్ధి పేరుతో ఊరంతా కూల్చివేతలు చేపడుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న ఎమ్మెల్యే, తక్షణమే స్పందించి మహాశివరాత్రి లోపు రాజన్న దర్శనాలను పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. రానున్న మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలలోకి తీసుకువెళ్లి వేములవాడ మున్సిపాలిటీపై కాషాయ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇన్చార్జి గంగాడి మోహన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్న వట్టి మాటలతో కాలయాపన చేస్తుంది తప్ప ఎలాంటి అభివృద్ధి చేయడం లేదని



దుయ్యబట్టారు. రానున్న మున్సిపల్ ఎన్నికలలో ప్రజలు కాంగ్రెస్కు తగిన బుద్ధి చెబుతారని, ప్రతి కార్యకర్త గెలిపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పార్టీ నేతలు ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ వేములవాడలో ఆకాశగంగ పైప్ లైన్ వంటి ఎన్నో శాశ్వత అభివృద్ధి పనులు బిజెపి హయాంలోనే జరిగాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈసారి మున్సిపల్ ఎన్నికలలో బిజెపికి అవకాశం ఇస్తే పట్టణాన్ని మరింత అభివృద్ధి పథంలో తీసుకెళ్తామని ప్రజలకు విన్నవించారు. అంతకుముందు 1000 సంవత్సరాల సోమనాథ్ ఆలయంలో పూజలు ప్రారంభమైన చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకొని భీమేశ్వరాలయంలో నేతలు ప్రత్యేక పూజలు నిర్వహించి ఓంకార జపం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి కుమ్మరి శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్చార్జి చెన్నమనేని వికాస్ రావు, ఎస్సీ మోర్చా అధ్యక్షులు సంటి మహేష్, మాజీ కౌన్సిలర్ రేగుల సంతోష్ బాబు, గడ్డమీది శ్రీనివాస్, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వేములవాడకొండగట్టు- జగిత్యాల రూట్ బంద్.

**మిషన్ భగీరథ పైపు లీకేజీ తో భక్తులకు తిప్పలు.**
**శాతరాజు పల్లి ప్రధాన రహదారిపై పైపు లైన్ మరమ్మతులు.**









**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దర్శనార్థం వేములవాడ కొచ్చే భక్తులకు మరియు జగిత్యాల వైపు వెళ్లే ప్రయాణికులకు అధికారులు కీలక ప్రకటన విడుదల చేశారు. వేములవాడ మున్సిపల్ విలీన గ్రామమైన శాతరాజు పల్లి వద్ద ప్రధాన రహదారిపై మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజీ కావడంతో అత్యవసరంగా మరమత్తు పనులు చేపట్టడం జరిగింది. దీనివల్ల వేములవాడ నుండి జగిత్యాల ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా వేములవాడ నుండి కొండగట్టు, జగిత్యాల మరియు ధర్మపురి వైపు వెళ్లే వాహనాలను శుక్రవారం సాయంత్రం నుండి నుండి వేములవాడ నుండి ఎదురు గట్ల, చెక్కపల్లి, నూకలమర్రి, నమలి గుండుపల్లి, వట్టెంల మీదుగా వాహనాలను మళ్లిస్తున్నారు. వేములవా డకొండగట్టు ప్రధాన రహదారిపై ఆకస్మాత్తుగా మిషన్ భగీరథ పైపుల మరమ్మత్తులు ప్రారంభించడంతో ఇతర ప్రాంతాల నుండి వేములవాడకు వచ్చే మరియు వెళ్లే వాహనాలు దారి తెలియక తీవ్ర అయోమయానికి గురి అవుతున్నారు. దీంతో మిషన్ భగీరథ శాఖకు సంబంధించిన ముగ్గురు సిబ్బందిని వాహనదారులకు ఎటువైపు వెళ్ళాలో సూచనలు చేస్తూ వేములవాడ పట్టణంలోని సాయిరక్ష వద్ద ఉంటూ రాత్రి నుండి వాహనాలను దారిమళ్లిస్తూ విధులు నిర్వహిస్తున్నారు. పైప్ లైన్ మరమ్మత్తులు పూర్తయ్య వరకు వాహనదారులు సహకరించాలని, అధికారులు సూచించిన మార్గాలలో వెళ్లాలని తెలిపారు. వీలైనంత త్వరగా పైప్ లైన్ మరమ్మతులు పూర్తి చేసి రాకపోకలను పునరుద్ధరిస్తామని సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

# ఇండియా బుల్స్ దాని ఫైనాన్స్ పేరుతో తక్కువ వడ్డీరేట్లకు లోన్స్ అంటూ మోసాలు.

**అంతరాష్ట్ర సైబర్ ప్రధాన నిందితుడు అరెస్ట్,**
**రిమాండ్ కు తరలింపు. దేశవ్యాప్తంగా ఎన్ సి ఆర్ పి పోర్టాల్ నందు 30 ఫిర్యాదులు.**
**గతంలో ముగ్గురు నిందితులను రిమాండ్ కు తరలించడం జరిగింది.**
**వేములవాడ రూరల్ సర్కిల్ కార్యాలయంలో వివరాలు వెల్లడించిన వేములవాడ ఏ ఎస్ పి రిత్విక్ సాయి**




**.వేములవాడ టౌన్, (ప్రజాబలం),** నిందితుడి వివరాలు 1) లక్కీ కుమార్ సదానంద్ కుమార్, తండ్రి శంకర్ సా, (21) కులము సాహు, వృత్తి ప్రైవేట్ జాబ్, నివాసము బీజువా, బహదూర్పూర్, నవ్వాడ, బీహార్ రాష్ట్రం. బీహార్ రాష్ట్రం, బహదూర్పూర్ గ్రామానికి చెందిన లక్కీ కుమార్ అనే వ్యక్తి గతంలో హైదరాబాదులో ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నిర్వహిస్తూ జీవించగా, వ్యాపారం సరిగా సాగకపోవడంతో బీహార్ కు తిరిగి వెళ్ళాడు.. అనంతరం ఆన్లైన్లో పేరుతో ప్రజలను మోసం చేయాలని పథకం రూపొందించాడు. అందులో భాగంగా నిందితుడు తన సహచరులైన అనిల్ నాయక్, బోడ రజిత మరియు భరత్ రాజులతో కలిసి ఫేస్ బుక్ లో ఇండియన్ బుల్స్ దాని ఫైనాన్స్ అనే పేరుతో నకిలీ పేజిని సృష్టించి, తక్కువ వడ్డీ రేట్లతో లోన్లు ఇస్తామని ప్రచారం చేశాడు. ఆ పేజీని సందర్శించిన వారి ఫోన్ నెంబర్లను సేకరించి వారికి ఫోన్ చేసి లోన్ వివరాలు చెప్పి నమ్మకం కలిగించేవారు. ఈ క్రమంలో బాధితుల నుంచి ఆధార్ కార్డు, పాన్ కార్డు తదితర గుర్తింపు పత్రాలు సేకరించి, లోన్ ప్రాసెసింగ్ ఫీజు, ఇతర చార్జీల పేరుతో డబ్బులు వసూలు చేసి, అనంతరం లోన్ మంజూరు చేయకుండా మోసం చేసినట్లు గుర్తించారు. బాధితుల నుంచి వసూలు చేసిన డబ్బులను వివిధ స్కానర్ కోడ్ లు మినీ ఏటీఎం కేంద్రాల ద్వారా తీసుకొని నగదుగా మార్చుకునేవారు. అందులో భాగంగా వేములవాడ రూరల్ మండలం పాజుల్ నగర్ గ్రామానికి చెందిన ఓగుల మల్లేశం అనే వ్యక్తికి కాల్ చేసి సామాజిక మాధ్యమాలలో ఇండియన్ బుల్స్ దాని ఫైనాన్స్ తక్కువ వడ్డీ రేట్లను లోన్లు ఇవ్వనున్నట్లు ఆశ చూపి ఆశ చూపి అట్టి లింక్ ఓపెన్ చేయగా నా మొబైల్ ఫోన్ కి కాల్ చేసి మీకు ఐదు లక్షల లోన్ వస్తుంది అని తెలుపగా అందుకు కాను వాళ్ళు చెప్పిన విధంగా ప్రాసెసింగ్ ఫీజు అని విడుదలవారీగా 1,18,400/ పంపడం జరిగింది. అనంతరం కూడా లోన్ కి సంబంధించిన ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంతో మోసపోయామని గ్రహించి జిల్లా సైబర్ క్రైమ్ లో ఫిర్యాదు చేయగా వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి గతంలో లక్కీ కుమార్ కు సహకరించిన ముగ్గురు వ్యక్తులను అనిల్ నాయక్, బోడ రజిత మరియు భరత్ రాజులను అరెస్టు చేసి రిమాండ్ చేయడం జరిగిందని, ప్రధాన నిందితుడు లక్కీ కుమారుని వేములవాడ రూరల్ సిఐ ఆధ్వర్యంలో సైబర్ ఆర్ ఎస్ ఐ జూ నైట్, రూరల్ ఎస్సై వెంకట్రాజం కానిస్టేబుల్ కిట్టు, చందులతో టీం ఏర్పాటు చేసి సాంకేతికత ఆధారంగా హర్యానాలో అదుపులోకి తీసుకొని శనివారం రోజు రిమాండ్ కు తరలించడం జరిగింది. నిందితునిపై దేశవ్యాప్తంగా ఎన్ సి ఆర్ పి పోర్టాల్ నందు 30 ఫిర్యాదుల వరకు ఉన్నవని వేములవాడ ఏఎస్పీ తెలిపారు. ప్రజలు ఆన్లైన్ లోన్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, సన్మానాస్పద కాల్స్, లింక్స్, ఫేస్బుక్ పేజీలను నమ్మి వ్యక్తిగత వివరాలు లేదా డబ్బులు పంపవద్దని పోలీసులు హెచ్చరించారు. ఆన్లైన్ మోసాలకు గురి అయిన వారు వెంటనే సమీప పోలీస్ స్టేషన్కు లేదా సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ 1930 ను సంప్రదించాలని సూచించారు0

# వేములవాడ లో బిజెపి ఆధ్వర్యంలో స్వాభిమాన్ పర్వం లో భాగంగా ఆలయాల సందర్శన.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** శనివారం రోజున వేములవాడ రూరల్ మండలంలోని నాగయ్య పల్లి, నూకలమర్రి గ్రామాలలోని శివాలయాలలో వేములవాడ రూరల్ బిజెపి మండల అధ్యక్షుడు బూరుగుపల్లి పరమేష్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1026 సంవత్సరంలో గజని మహమ్మద్ భారతదేశంపై దండయాత్ర చేసి హిందువుల సంస్కృతి, సాంప్రదాయాలకు చిహ్నమైన ఆరాధ్య దైవ మైనటువంటి సోమనాథ్ శివాలయాన్ని కూల్చివేసి, హిందువులను అణిచివేసి అనేక దుర్మార్గపు కార్యక్రమాలు చేశాడు. మరి 1000 సంవత్సరాల లో



ఎన్నో బాధలను ఓర్చుకుంటూ హిందువులు వారి సంస్క ృతిని, సాంప్రదాయాన్ని కాపాడుకుంటూ ఆలయానికి పునర్జీవనం పోస్తూ, 1951 సంవత్సరంలో అప్పటి రాష్ట్రపతి డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో భక్తుల సందర్శనార్థం ఆలయాన్ని తిరిగి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని సోమనాథ్ భారతదేశం మొత్తం స్వాభిమాన్ పర్వముగా జరుపుకోవడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో అధికార ప్రతినిధి సుంకరి నరేందర్, ప్రధాన కార్యదర్శులు తోట శేఖర్, వనపర్తి పరశురాములు, కార్యదర్శి గుమ్మడి శ్రీనివాస్, శక్తి కేంద్ర ప్రముఖు ఉప్పుల గౌతం, బూత్ అధ్యక్షులు సాగర్ల నరేష్, మారం రాజేందర్, లింగంపల్లి కిషోర్, జంగం నరేష్, సీనియర్ నాయకులు శెట్టిపల్లి రవి కిషోర్, అచ్చు తిరుపతి, చింతపంంటి ప్రకాష్, లింగంపల్లి అనిల్, చందనం కిషోర్, రామోజీ శివ, జంగం సాయి, ముడారపు మహేష్, బూర్గు శివ, పాలకుర్తి అభిరామ్, గ్రామ ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

# స్వర్ణాంధ్ర కాలేజీలో సంక్రాతి సంబరాలు

నరసాపురం పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం మండలం సీతారామపురం గ్రామంలోని స్థానిక స్వర్ణాంధ్ర కాలేజీ అఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (అటానమస్)కళాశాలలోని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ (ఎఐఓఎ) మరియు సి ఎస్ సి (బి.ఎస్ )విభాగం ఆధ్వర్యంలో సంక్రాతి పండగను పురస్కరించుకొని సంక్రాతి సంబరాలు అట్టహసంగా జరిగాయి. ఈ కార్యక్రమం లో ముగ్గులు పోటీలు, భోగి మంటలు, గంగిరెద్దుల ప్రదర్శన, హరిదాసు, సాంస్కృతిక కార్యక్రమాలు అత్యంత ఆకర్షనీయంగా సాగాయి. ఈ కార్యక్రమం లో కళాశాల చైర్మన్ కె. వి. సత్యనారాయణ, ట్రెజరర్ కె. వేంకటేశ్వరస్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి మరియు కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్. సురేష్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డా. ఎ. గోపిచంద్, ఏఐ అండ్ ఎమ్ ఎల్ విభాగాధిపతి డా. బొమ్మ రామ కృష్ణ, సి ఎస్ సి (బి.ఎస్) విభాగాధిపతి డా. టి. మురళి మోహన్ మరియు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థిని,విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని పండుగ వాతావరణాన్ని సృష్టిం చారు. ఈ కార్యక్రమం ముగ్గులు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com